
ఆంధ్రప్రదేశ్



రంగుల రామచిలుక

జూన్ 1966
30 పైసలు



ఆంధ్రప్రదేశ్

సంపుటి: 10
సంచిక: 8

జూన్, 1966
జ్యేష్ఠ-ఆషాఢ 1888 శకం

ప్రధాన సంపాదకులు:
టి. రామచంద్రరావు

సంపాదకులు:
ఎన్.వి. గోపాల శాస్త్రి

ఈ సంచికలో

అనుబంధ ఆహార పదార్థాలు 2
—కె. బ్రహ్మానందరెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

రేపటి ప్రపంచం 4
—డా. సంపూర్ణానంద్

స్వయం శక్తి సాధన పథంలో ... 6
—డా॥ ఎ. ఎన్. ఝా, ఐ. సి. ఎస్

బ్రతికిన కాలేజి (సీరియల్ నవల) 9
—పాలగుమ్మి పద్మరాజు

వినోద వీధి ... 12

ఆంధ్రప్రదేశ్‌లో ఖనిజ పరిశ్రమ 14
—డా॥ బి. బాలగంగాధర శర్మ

అడవి మల్లె (సీరియల్ నవల) 17
—వాసిరెడ్డి సీతాదేవి

పారిశ్రామిక లేఖ 22

భాగ్యచక్రం (సీరియల్ నవల) 25
—ఆరెకపూడి కౌసల్యాదేవి

పారిశ్రామిక శిక్షణ సంస్థలు 30
—డా॥ రాం. కె. వేపా, ఐ.ఎ.ఎస్

ఆంధ్రప్రదేశ్‌లో సాంఘిక సంక్షేమం ... 33
—బి.ఆర్.కె. శాస్త్రి, ఐ.ఎ.ఎస్

ఆలోచనలూ-అభిప్రాయాలూ 40

హిందూస్థాన్ యంత్రపరికరాల కర్మాగారం సాధించిన అభివృద్ధి 41
—ఎస్.ఎం. పాటిల్

పంచతంత్రము (సీరియల్) ... 44

సహకార సేద్యం ద్వారా అధికోత్పత్తి ... 46
—డా. కరణ్‌సింగ్

ముఖ్యవార్తలు 48

మొదటి చిత్రం:
రంగుల రామచిలుక
ఫోటో: యస్. ఆర్. కె. రావు

రెండవ చిత్రం:
ముక్తికి సోపానాలు

మూడవ చిత్రం:
సాగరతీరంలో స్వేచ్ఛావిహారం

నాలుగవ చిత్రం:
సుప్రభాతం

ఫోటోలు: ప్రధాన సంపాదకులు.

అనుబంధ ఆహారపదార్థాలు



గత రెండు దశాబ్దాలుగా ఆహార కొరత దేశంలో ఒక ప్రధాన సమస్యగా తయారైంది. అటు కేంద్ర ప్రభుత్వమూ, యిటు రాష్ట్ర ప్రభుత్వాలూ యీ సమస్యను చాలధైర్యంగా, దృఢచిత్తంతో ఎదుర్కొంటూ వస్తున్నాయి. ఆహార సమస్యను మెరుగు పరచడానికి ఏటా కోట్లకొలది రూపాయల్ని వెచ్చిస్తున్నాయి. అయితే యీసమస్య అతి జటిలమైనది కావడంవల్లా, మరీ తీవ్రమైనది కావడంవల్లా యింతవరకు యీవిషయంలో స్వయంసమృద్ధిని సాధించలేకపోయాం. పైగా ఇతరమైన అనేక సమస్యలుకూడా యిందుకు కారణమౌతూ వస్తున్నాయి. ఇంతవరకూ వరి, గోధుమ, తదితర కాయధాన్యాలవంటి అతిముఖ్యమైన ప్రాతిపదిక ఆహార ధాన్యాలను యితోధికంగా పండించడానికే కృషి చేసాం. ఇప్పుడు అనుబంధ ఆహార పదార్థాలనుకూడా మరింత ఎక్కువగా ఉత్పత్తిచేసి, వాటిని బహుళ ప్రచారంలోకి తీసుకరావలసిన సమయం ఆసన్నమైంది.

దేశంలో శాకాహారు లెంతమందో, మాంసాహారులెంత మందో, రోజూ వీరుతీసుకునే అహారంలో ఎంతమొత్తం కాయధాన్యాలు ఉంటున్నాయో మొదలైనవిషయాల్ని తెలియజేసే ఖచ్చితమైన, విశ్వసనీయమైన వివరాలు ఏమీ లేవు—ఏదో ఉజ్జాయింపుగా ఊహించడంతప్ప. ఆవిధంగా వూహించిచూస్తే మాంసాహారులు 70 నుంచి 80 శాతం వరకు ఉంటారనిపిస్తుంది. వీరు తీసుకునే ఆహారంలో కాయధాన్యాలు 50 శాతం ఆక్రమిస్తాయి. పోతే మిగిలిన యాభై శాతంలోనూ మాంసాహార పదార్థాలు, తదితర అనుబంధ ఆహార పదార్థాలు వుంటాయి. శాకాహారుల ఆహారంలోమాత్రం కాయధాన్యాలు ఎక్కువగా వుంటాయి. అయినా శాకాహారులుకూడా అనుబంధ ఆహార పదార్థాలను తగుమొత్తంలో తీసుకుంటూనే వుంటారు. శాకాహారులుగాని, మాంసాహారులుగాని వారివారి ఆహారాలలో అనుబంధ ఆహార పదార్థాలను పెంచినట్లయితే కాయధాన్యాల వినియోగం తగ్గుతుంది. దీనిని ఆచరణలో ఎందుకు పెట్టగూడదు? ఇందుకు కావలసినదల్లా అనుబంధ ఆహార పదార్థాలను ఆట్టే కష్టపడకుండా చాలాతేలిగ్గా పెద్దమొత్తాలలో అందుబాటు ధరలకు లభించేటట్టు చేయవలసివున్నది. మొదట్లో కొంత యిబ్బందికరంగానే వుంటుంది. అడ్డంకులూ వుంటాయి. అయితే ముందుముందు ప్రజలు కాయ ధాన్యాలస్థానే అనుబంధ ఆహారాలను పెద్ద మొత్తాలలో తీసుకోవడానికి అలవాటు పడతారన్న ఆశాభావం మాత్రం నాకు వుంది.

(1) చేపలు (2) గ్రుడ్లు (3) పాలు (4) కాయగూరలు (5) పండ్లు-ఇవి ముఖ్యమైన అనుబంధ ఆహార పదార్థాలు. వీటిని విస్తృతంగా దేశంలో ఉత్పత్తి చేయడానికిగాని, దిగుబడిని పెంచడానికిగాని అపారమైన వనరులు మన దేశంలో కొల్లలుగా వున్నాయి.

చేపలు

మనకు 3,000 మైళ్ళ పొడవు సముద్రతీరంవుంది. పది లక్షల చతురపుమైళ్ళ విస్తీర్ణంగల సాగర జలరాశివుంది. తీరం పొడవునా పెద్దవీ, చిన్నవీ రేవులు అనేకంవున్నాయి. అయినప్పటికీ కొన్నిచోట్ల మాత్రమే సముద్రతీరాల్లో చేపల వేట కొనసాగుతున్నది. అదిన్నీ తీరానికి కొద్దిపాటి దూరం వరకు సముద్రంలోకి యీవేట పరిమితమై వుంది. పైగా వెనకటి పాతకాలపు తెప్పలను వాడే బీద బెస్తల చేతుల్లోనే యీ పరిశ్రమ వుండిపోయింది. వారు రోజంతా కష్టపడి పట్టిన చేపలు కనీసం సముద్రతీర ప్రాంతంలోని జిల్లాల్లో మాంసాహారం భుజించేవారికైనా సరిపడినంతగా కూడ వుండడం లేదు. నిజానికి సముద్ర మధ్యస్థంలోనే అపారమైన మత్స్య సంపద వుంటుంది. చిన్నచిన్న స్కాండినేవియన్ దేశాలలో సముద్ర మత్స్య పరిశ్రమ అపారంగా అభివృద్ధి చెందింది. ఈ దేశాలు పెద్ద మొత్తాలలో చేపల్ని విదేశాలకు ఎగుమతిచేసి ఎంతగానో విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జిస్తున్నాయి. నిజానికి యీదేశాలు పెట్టిన వరవడినే మనమూ అనుసరించి, సముద్రాంతర మత్స్య పరిశ్రమ కేంద్రాలను యన సముద్రతీరం పొడవునా ఏర్పాటు చేసుకోవడం మంచిది. దీనికి కావలసినదల్లా ప్రతి కేంద్రంలోనూ తగు సంఖ్యలో చేపల్ని పట్టే ట్రాలర్లు ఏర్పాటుచేసుకోవాలి. చేపలు ఎక్కువ కాలం నిలువ వుండవు గనుక చేపల్ని పట్టే స్టీమర్లమీదనే వాటిని శుద్ధి చేసేసౌకర్యాలు, శీతలగిడ్డంగి సౌకర్యాలు వుండాలి. ఈ పథకంమీద డబ్బు వెచ్చిస్తే చాలా లాభ సాటిగా తయారవుతుంది. ఈ ట్రాలర్లద్వారా పట్టిన చేపల్ని మన దేశంలోని మాంసాహారుల అవసరాలని తీర్చడానికే గాక కొంతవరకు విదేశాలకు ఎగుమతి చేయడానికి కూడా అవకాశం వుంటుంది. మన దేశంలో యీ ట్రాలర్లను ఉధృతంగా కెరటాలులేచే ఒక్క తుఫాను సమయాలలో మినహా ఏటిపొడుగునా అన్ని ఋతువులలోనూ వాడవచ్చు.

నదులు, చెరువులు, కాలువలు మొదలైన మన అంతర్జలాలలో కూడా అపారమైన మత్స్యసంపద నిక్షిప్తమైవున్నది. నిత్యస్రవంతులై పారే పెద్దపెద్ద నదులతో పాటు అసంఖ్యాకమైన చెరువులు, సరస్సులు మనకు వున్నాయి. ఆధునికమైన పడవలు, పరికరాలను ఉపయోగించి యీ అంతర్ జలాలలో చేపల్ని పట్టడానికి మనం పూనుకుంటే పెద్ద మొత్తంలోనే మనకు మత్స్య సంపద లభ్యమౌతుంది.

గ్రుడ్లు

పాలవలె గ్రుడ్లుకూడా చాలా చక్కటి పౌష్టికాహారమని వైద్య శాస్త్రం చెప్పుతున్నది. నిత్యాహారంలో గ్రుడ్డును కూడా ఒక భాగంగా చేర్చుకోవడం ఏమంత కష్టం కాదు. సశాస్త్రీయ పద్ధతులద్వారా కోళ్ళ పెంపకాన్ని చేపట్టడంద్వారా గ్రుడ్లదిగుబడిని అధికంచేయువచ్చు. నిజానికి మన దేశంలో ముఖ్యమైన కుటీర పరిశ్రమల్లో ఒకటిగా కోళ్ళ పెంపకం పరిశ్రమను రూపొందించవచ్చు.

పాలు

జననం మొదలు కొని మరణంవరకు మనిషికి పాలు ప్రధానమైన ఆహారంగా తోడ్పడతాయి. మన దేశంలో అపారమైన పశు సంపద వున్నది. విస్తారమైన పచ్చిక భూములు ఉన్నాయి. అయినా తలసరి పాల వాడకం మన దేశంలో అతి స్వల్పంగావుంది. ఈనాడు చాలా వరకు పాల ఉత్పత్తి వ్యక్తుల చేతుల్లోనే వుంది. అందువల్ల పాల సరఫరా ఏమంత సంతృప్తికరంగాలేదు. పైపెచ్చు అధికవ్యయంతో కూడుకున్నది కూడాను. ఒకానొక పద్ధతిలో, వ్యవస్థారూపంలో పాల ఉత్పత్తిగాని, సరఫరాగాని జరిగినప్పుడు ముందు ముందు అత్యధిక సంఖ్యాకులకు ఎక్కువగా పాలను సరఫరా చేయవచ్చు. ప్రపంచంలో కొన్ని దేశాలలో పాడి పరిశ్రమ, తత్సంబంధమైన సహాయక పరిశ్రమలే కీలకస్థాన మాక్రమించి వున్నాయి. మన దేశంలో ఈ పరిశ్రమను వ్యవస్థీకరించి, అభివృద్ధి పరచడానికి తీవ్రమైన కృషి అవసరం. స్వతహాగా దీనిలో అనేక లోటుపాట్లు వున్నప్పటికీ యీపథకాన్ని కొద్ది కాలంలోనే విజయవంతంగా అమలు పరచవచ్చు.

కాయగూరలు

మన దేశంలోని వాతావరణ పరిస్థితులూ, భౌగోళిక పరిస్థితులూ ఏటిపొడుగునా రకరకాల కాయగూరల్ని పండించడానికి చాలా అనువైనవి. కాయగూరల సాగుకు తగినంత నీటి వసతి దేశంలోవుంది. మాంసాహారులకు, శాకాహారులకు వారుతీసుకునే నిత్యాహారంలో వివిధ పరిమాణాలలో కాయగూరలు, ఆకుకూరలు వుండడం అవసరం. పెరడులు వున్న వ్యక్తులు తమ పెరటి దొడ్లలో కాయగూరల్ని పండించుకోవచ్చు. పెరటిదొడ్లు లేనివారికి పొలాల్లో పెద్దఎత్తున విడివిడిగాగానీ, యితర పంటలతో కలిపిగాని కాయగూరల్నీ, ఆకుకూరల్నీ పండించి ఈరకంగా అటు పల్లెల్లోనూ, యిటు పట్టణాలలోనూ ఆకుకూరలు, కాయగూరల ఉత్పత్తిని అధికంచేయవచ్చు. బంగాళా దుంపలు, టమాటాలు, కేబేజి, ఉల్లిపాయలు తదితర పంటల్ని కూడా వాణిజ్యదృష్టితో భారీ ఎత్తున పండించవచ్చు.

పండ్లు

పండ్ల పెంపకానికి ఉష్ణవాతావరణము, విస్తారంగా నీటి సౌకర్యం అవసరం. అదృష్టవశాత్తూ మనదేశంలో యీ రెండూ వున్నాయి. కొబ్బరి, మామిడి, అరటి, బొప్పాయి, పనస, నారింజ మొదలయిన అధిక దిగుబడినిచ్చే పండ్ల సంతతులు ఈ దేశంలో వున్నాయి. వీటిలో కొన్ని పళ్ళను ప్రత్యమ్నాయ ఆహారంగా ఉపయోగించ వచ్చు కూడాను. పెరడులనూ, కాంపౌండులనూ అలంకార ప్రాయమైన మొక్కలతో నింపే బదులు ఒకేరకం పళ్ళరకాల చెట్లతోగాని, వివిధరకాల చెట్లతోగాని నింపడం లాభదాయకం. ఈ విషయంలో హృదయపూర్వకంగా కృషిచేస్తే ఉపయోగకరమైన ఫలితాలు పొందవచ్చు.

ఈ విధమైన ఆలోచనగానీ, యీచర్యలుగానీ మనకు కొత్త కాదు. కాయధాన్యాల విషయంలో మనం తీసుకున్నట్లుగా యీ అనుబంధ ఆహార పదార్థాల విషయంలో కూడా శ్రద్ధతీసుకోవాలి. అత్యవసరమైన విషయంగా భావించి తగుచర్యలు తీసుకోవాలి. వీటిలో ఏ కొన్నిటిని ఆచరణలో పెట్టినా, యివే ముందు ముందు మన ఆహారసమస్యను పరిష్కరిస్తాయి. కొత్త ఆర్థికవ్యవస్థకు కారణమౌతాయి. ప్రజల ఆహారపు అలవాట్లలో మార్పుల్ని తేవడానికి తోడ్పడతాయి. మొత్తం దేశప్రజలందరికీ యీ పథకాలవల్ల మేలు జరిగేటందుకు గాను విజయవంతంగా అమలు పరచడానికి వీలుగా అటు కేంద్రస్థాయిలోనూ, యిటురాష్ట్రాల స్థాయిలోనూ యీ సమస్యను చేపట్టడం అవసరం.

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి నంతవరకు రానున్న కాలంలో అనుబంధ ఆహార పదార్థాలను అధికంగా పండించడానికి తీవ్రంగా కృషిచేయడం జరుగుతుంది. కాయధాన్యాల్ని పండించడంలో మన రాష్ట్రం స్వయం సమృద్ధమైనప్పటికీ అనుబంధ ఆహారాల్ని కూడా ఉత్పత్తి చేయడానికి కృషిచేద్దాం. దీనివల్ల యితర రాష్ట్రాలకు మరింతగా కాయధాన్యాలను సరఫరా చేయడానికీ, వాటికి మన సహాయాన్ని అందివ్వడానికీ వీలవుతుంది. ఇతర రాష్ట్రాలుకూడా అనుబంధ ఆహార పదార్థాల ఉత్పత్తుల్ని అధికం చేసుకోవడానికి కృషిచేస్తే దేశంలో ఆహారకొరతను అనుకున్న దానికన్న ముందుగానే పరిష్కరించు కోగలుగుతాం. ఈ ఆహార కొరత కేవలం అతిస్వల్పమైనది మాత్రమే. ఇటుపై మన కృషిని అవసరమైన అనుబంధ ఆహార పదార్థాల ఉత్పత్తి పైనే కేంద్రీకరిద్దాం.

జై హింద్.



ముఖ్యమంత్రి.

పరివర్తన ప్రధానం.

రేపటి ప్రపంచం

డా॥ సంపూర్ణానంద్

"ఇప్పుడు మానవుడు ప్రపంచాన్ని విడిచి వేయడం ఎలాగో తెలుసుకోవడంవలన మళ్ళీ ఇది ఎప్పటికీ ముందువలె ఉండదు" ఈ మాటలు యీ మధ్యనే వెలువడిన 'లైఫ్' సంచికలో ప్రముఖ ఇంగ్లీషు నక్షత్ర శాస్త్రజ్ఞుడు ఎ. క్లార్క్ చేసిన రచననుండి నేను పేర్కొంటున్నాను. ఇవి మాటల్లో తెలియజేయలేనంత ప్రాముఖ్యత కలిగియున్నవి. అంతరిక్షానికి సంబంధించిన వివిధరంగాలలో సాధించబడిన ప్రగతి మూలంగా కొన్ని సంవత్సరాలనుండి మనకు అంతరిక్ష యానంతోనూ, పెంచుకున్న ఆశలు, నమ్మకాలతోనూ బాగా పరిచయమున్నది. అమెరికా, రష్యా 'ఆస్ట్రోనాట్'ల సాహసాలను ఆసక్తిగా చూశాం. కేరళ తీరాల్లో వదలబడిన మనస్వంత రాకెట్ల ప్రయత్నాలను గూర్చి ఎంతో సంతోషంగా చదివాం. కాని ఒకదానికొకటి రెండడుగుల దూరంలో రెండు అంతరిక్ష నౌకలలో 'అమెరికన్ ఆస్ట్రోనాట్‌లు' అంతరిక్షంలో పయనించిన అద్భుత కార్యం నిజంగా ఒక క్రొత్త యుగాన్ని ప్రవేశపెట్టింది. మానవుడు ఇంకెంతోకాలం భూమిపై బంధించబడిన ప్రాణి కాదు. భూమి చుట్టూ వున్న వాతావరణం వరకు గాని, సముద్రం వరకుగాని అతడు పరిమితమై లేడు. ఇప్పుడతడు ఒక అంతరిక్ష పౌరుడు.

భూమిపైగల అజ్ఞాత ప్రదేశాలు, అడవులు, ఎడారులు కనిపెట్టడానికి కావలసిన ధైర్యస్థైర్యాలు, తుఫానుతో తుడిచిపేసే సముద్రాలపై సాహస కార్యాలు నిస్సందేహంగా ఘనమైనవి. గాలిలో ప్రయాణాలు ముందెన్నడూ లేనంతగా మనిషి శక్తి, సామర్థ్యాలను తెలియజేసినవి. భూమి, దానిపైగల మట్టి, నీరు అంతా కలిపి, 8,000 మైళ్ళ వ్యాసంగల ఒక చిన్న బంతి వంటి పదార్థం మాత్రమే. పైనున్న గాలిగుండ అదృశ్య గురుత్వాకర్షణ శక్తితో యీ బంతికి కలపబడినది.

అంతరిక్ష విజయము

గణితశాస్త్ర పరిభాషలో ఆద్యంతాలు లేనిదిగా పేర్కొనబడినప్పటికిని అంతరిక్షం పరిమితమైనదే. ఇది వ్యాకోచం చెంది రోజు, రోజుకు హద్దులు మీరి పెరుగుతున్నది. అతి దగ్గరలో ఉన్న నక్షత్రం మూడు కాంతి సంవత్సరాలకంటె ఎక్కువ దూరంలో ఉన్నది. అతి సమీపంలో ఉన్న చంద్రుడు దాదాపు 2,50,000 మైళ్ళ దూరంలో ఉన్నాడు. చివరకు సూర్యుని నుండి కాంతి మనకు చేరుటకు ఎనిమిది నిమిషాలకు పైగా తీసుకొంటుంది. ఇప్పుడు మనము యీ విశాల శూన్యంలోనికి పోతున్నాము. అంతరిక్షం పూర్తిగా శూన్యం కాదని మనకు తెలుసు. కాని దీనిలో పదార్థం ఎంత పలచగా వ్యాపించి ఉందంటే చాలా పరిశోధనలతో దీని ఉనికిని ఉపేక్షించవచ్చును. 'క్రిటికల్ వెలాసిటీ' గంటకు 7.2 మైళ్ళ పరిధిని దాటిపోయి అప్పుడొక ప్రమాదం జరిగినట్లైతే పది లక్షల సంవత్సరాలలోగూడ చివరకు 'ఆస్ట్రోనాట్' ఎముకలైనా మాత్ర భూమిపై పడవు. అందుకే మనిషి ఉద్దేశపూర్వకంగా దానిని ప్రత్యేకమైన భాగంగా ఊహించుకొంటున్నాడు. కాని యిప్పుడు తిరోగమించడం లేదు. అతనిప్పుడు అంతరిక్షంలోకి పోతున్నాడు. ఈ అగాధ సముద్రంలో ఎక్కడైనా వివేకవంతమైన జీవితంగల ద్వీపాలుంటే అతడు వారితో తోడి పౌరసత్వాన్ని స్వీకరించ నిశ్చయించుకున్నాడు.

ఆధ్యాత్మిక పరివర్తనము

దీని ప్రాముఖ్యతను గుర్తించవలసినంతగా మనం గుర్తించనట్లు కన్పిస్తున్నది. మనిషి మనసుపై రావలసిన యీ ఆధ్యాత్మిక మార్పు వచ్చినట్లు సూచనలు కన్పించుటలేదు. ఇది ఒక్క భారతదేశంలోనే గాక పూర్తి మానవలోకంలోనే యథార్థమైనది. అసాధారణమైనది ఏమీ జరగనట్లే పనులు జరిగిపోతున్నవి. మానవ జీవితం, శాంతి, యుద్ధ సిద్ధాంతాలలో తీవ్ర మార్పు రావలసియున్నది. కాని మానవ జాతి యీ అవసరాన్ని తెలుసుకొన్నట్లు లేదు. అణుశక్తి మనలను గంభీరంగా ఆలోచించునట్లు చేయవలసియుండెను. కాని అంతరిక్ష యానం అణుశక్తికన్న ఎన్నో రెట్లు శక్తివంతమైనది. అయినప్పటికీ మనం యీ విషయం గ్రహించినట్లులేదు. ప్రపంచంలో వివిధ ప్రాంతాల్లో యుద్ధాలు జరుగుతున్నవి. దురాక్రమణలకు సన్నాహాలు జరుగుతున్నవి. అధికారంతో మత్తెక్కిన దేశాలు ఇతర దేశాలను బానిసలుగా చేసుకోవడమో లేక అధోగతికి లాగడమో చేస్తున్నవి. రంగు, మతభేదాలు యింకా మనిషి నుండి మనిషిని వేరుచేస్తున్నవి. అంతరిక్ష యానం అంతగా వ్యాపించకపోవడంచేత ప్రస్తుతం ఆకాశంలో స్వాతంత్ర్యం గుర్తించబడింది. కాని సత్వర భవిష్యత్తులో ఇదిగూడ సముద్ర స్వాతంత్ర్యం వలె ఉండగలదు. ఇప్పుడు అంతరిక్ష పరిశోధనలో కొనసాగుతున్న సహకారం యిక ముందు కొనసాగుతుందని ఆశించలేము. చంద్ర గ్రహాన్ని చేరిన వెంటనే వలసవాదం, ఖనిజ సంపదలకు సంబంధించిన సమస్యలు తలయెత్తి అసూయ, చివరకు యుద్ధానికే దారి తీయవచ్చును. అప్పుడు మనిషి అత్యాశ, గర్వాల తృప్తికొరకు అంతరిక్షం కేవలం భూమిని విస్తరింపజేయుటయే అగును.

ఇప్పటివరకూ మనలో ఉన్న నీచమైన ఆలోచనలు, సంకుచిత తత్వాల వలన

లాభము ఉండదు. మనము వాటిని త్యజించి, మనస్సును విశ్వమంత విశాలంగా చేసికోవాలి. మానవుడు తనకు ప్రయోజనకారి యగు అంతరిక్షయాన అవకాశాన్ని వివేకంగా ఉపయోగించు కుంటే సర్వవిధాల అతనికి విజయం చేకూరుతుంది. క్రొత్త ద్వీపాలను దర్శించడం, తెలియని విధంగా క్రొత్త జీవితాలతో సంబంధం, క్రొత్త పరిస్థితులను యెదుర్కొనే అవకాశం మనిషి వివేకాన్ని పెంపొందిస్తుంది. ఈ రోజుల్లో మామూలుగా పెరిగిపోతున్న శతృత్వ భావననుండి పూర్వకాలంలో అతి ముఖ్యమైన శక్తివంతమైన వ్యక్తిత్వానికి మరల్చుతుంది. దేవతలు భూమి మీదికి దిగివచ్చే ఆ రోజుల్లో మానవుడు ప్రకృతితో, తనకు గల బాంధవ్యాన్ని గుర్తించేవాడు.

తోడివారితో సామరస్యం

మనుష్యుడు మొదట యుద్ధాన్ని నిరసించి, తోడివారితో శాంతియుత జీవనాన్ని గడపడం నేర్చుకొన్నప్పుడే యిది సాధ్యం కాగలదు. విజ్ఞానాన్ని, కావలసిన వస్తు పరికరాలను యెన్ని కలిగి యున్నప్పటికిని, యే దేశమైనను ఒంటరిగా అంతరిక్ష విజయాన్ని సాధించలేదు. అటువంటి యే ప్రయత్నమైనను నాశనానికి దారి తీస్తుంది.

వైజ్ఞానికులకు, నాయకులకు, మతాధికారులకు సమయానికి తగు శ్రద్ధ తీసికోవాలని నేను విన్నవించు కొంటున్నాను. మానవ జాతికి యెప్పుడూ లేనంత గొప్ప అవకాశం దొరికింది. తమ ద్రవ్య సాధనాలన్నీ కలిపి, ఐకమత్యంతో పనిచేసి మానవ జాతికి నీతి మార్గాన్ని చూపాలి. ఇటువంటి అవకాశం మళ్ళీరాదు. కాని ఒక విషయం ప్రతి ఒక్కరు జ్ఞాపకముంచుకోవాలి. అది నేను మొదట పేర్కొన్న మాటలకు సంబంధించినది. అంతరిక్ష యానం పాత ప్రపంచానికి ముగింపు చూపినది. మానవులు పురోగమించవచ్చు లేక తిరోగమించవచ్చు; దేవతలు కావచ్చు లేక దానవులుగా మారవచ్చు. వాళ్ళు మిగతా గ్రహాలలో వ్యాపించ వచ్చు లేక భూమిపైనుండే అదృశ్యం కావచ్చు. కాని పూర్వపు పరిస్థితులు యెంతో కాలం పరిరక్షించబడవు. మనకు కావలసినది యెన్నుకొని అవకాశాలను సృష్టించుకొనడానికి పని ప్రారంభించే బాధ్యత మనది. మనము మారాలనే దృఢ నిశ్చయమే అన్నిటి కన్న ముఖ్యంగా కావలసినది. *

సంఖ్యలు చాటుతున్న సత్యాలు

వివిధ రాష్ట్రాలలో విద్యుచ్ఛక్తి వివరాలు

	రాష్ట్రం.	రెండవ ప్రణాళిక చివరవున్న ఉత్పాదక శక్తి.	మూడవ ప్రణాళిక చివరకు అదనంగా చేర్చినది.
		మెగావాట్లు.	మెగావాట్లు.
1.	ఆంధ్రప్రదేశ్.	307	79
2.	అస్సాం.	160	141
3.	బీహార్.	499	185 (డి.వి.సి. షేర్లతో కలుపుకొని.)
4.	గుజరాత్.	666	333
5.	జమ్మూ కాశ్మీర్.	31	18
6.	కేరళ.	197	60
7.	మధ్యప్రదేశ్.	316	83
8.	మద్రాసు.	1,301	768
9.	మహారాష్ట్ర.	1,295	535
10.	మైసూరు.	461	262
11.	ఒరిస్సా.	318	147
12.	పంజాబు.	712	403
13.	రాజస్థాన్.	254	108
14.	ఉత్తరప్రదేశ్.	914	517
15.	పశ్చిమ బెంగాలు.	1,452	601 (డి.వి.సి. షేర్లతో కలుపుకొని.)
16.	ఢిల్లీ.	112	36
17.	ఇతర కేంద్ర పాలిత ప్రాంతాలు.	13	4
	మొత్తం.—	9,008	4,280
	స్వయం ఉత్పాదక శక్తిగల పారిశ్రామిక సంస్థలు —	1,146	200
	మొత్తం.—	10,154	4,480

స్వయంశక్తి సాధనపథంలో

డా॥ ఎ. యన్. ఝూ, ఐ.సి.యస్.

సమాజంలో అనేక వర్గాల ప్రజల జీవన ప్రమాణం అభివృద్ధి పొందింది. ఎక్కువ మంది ప్రజలకు నేడు తిండి, బట్ట పుష్కలంగా లభిస్తున్నవి. మొదటి రెండు ప్రణాళికల కాలంలో భారతీయుల సగటు ఆయుఃప్రమాణం 32 నుండి 42 సంవత్సరాలకు పెరిగింది.

గత కొలదిమాసాలలో జరిగిన సంఘటనల ద్వారా ఆలోచనాపరులైన భారతీయులు నేర్చుకున్న గుణపాఠాలలో ప్రధానమైనది — దేశం అభివృద్ధికి తన కాళ్లమీద తాను నిలబడాలికాని విదేశాల సహాయంకోసం ఎదురు చూడడం తప్పు-అని.

దేశంలో యీనాడు ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణపు ఒత్తిడి, తీవ్ర ఆహార సమస్య మొదలగు వాటివల్ల నిరాశ, నిస్పృహలు తాండవిస్తున్నవి. ఈ సమయంలో మనకాళ్లపై మనం ఆధారపడడమనే సలహా దివ్యమైనదిగా తోచవచ్చు. కాని స్వాతంత్ర్యం వచ్చిననాటి నుండి నేటివరకు మనం సాధించగలిగిన దేమిటి ? మనకు గల ఆస్తులు, అవకాశాలు ఏమిటి ? దేశంలో మునుముందు సమగ్రమైన ఆర్థికాభివృద్ధి సాధించడానికి యిది వరకే మనం ఏర్పరచుకున్న దృఢమైన పునాదు లేమిటి ? అని ఒకసారి పరిశీలిద్దాం.

సేద్యపు నీటిపారుదల రిజర్వాయర్లు, విద్యుత్పథకాలు, ఉక్కుఫ్యాక్టరీలు, రసాయనిక ఎరువులు, భారీయింజనీరింగ్ సామగ్రి ఉత్పత్తి, సిమెంటు ఫ్యాక్టరీలు, గ్రామీణ విద్యుచ్ఛక్తి, మట్టిమోసే యంత్రాలు, ట్రాక్టర్లు, మోటారు రవాణ, రహదార్లు - వార్తాసౌకర్యాల రూపంలో క్రొత్త క్రొత్త ప్రగతిశక్తులను మనం సృష్టించుకోగలిగాము. అనేక రీతులలో పబ్లిక్, ప్రైవేటు రంగాల కార్యక్రమం విస్తృతమైంది. దేశరక్షణ పరికరాలు ఉత్పత్తి కార్యక్రమం సాధించిన అభివృద్ధి అందరికీ బాగా తెలిసినట్టిదే. పైగా యిటీవల మనకు పాకిస్తాన్‌తో సంభవించిన యుద్ధంలో మన దేశంలోనే మనం తయారుచేసుకున్న ఆయుధసామగ్రి యొక్క శక్తిసామర్థ్యాలు ప్రపంచానికంతా బాగా వెల్లడిఅయినవి.

సమాజంలో అనేకవర్గాల ప్రజల జీవన ప్రమాణం అభివృద్ధి పొందింది. ఎక్కువమంది ప్రజలకు నేడు తిండి, బట్ట పుష్కలంగా లభిస్తున్నవి. వస్తువినియోగ ప్రమాణాలు పెంపొందినవి. వైద్య సౌకర్యాలు బహుళంగా కల్పించబడినవి. మొదటి రెండు ప్రణాళికల కాలంలో భారతీయుల సగటు ఆయుః ప్రమాణము 32 నుండి 42 సంవత్సరాలకు పెరిగింది. దేశంలో మలేరియా పూర్తిగా నిర్మూలించబడింది. ఇతర అంటువ్యాధులు కూడా చాలావరకు తగ్గిపోయినవి. 1951లో 2 కోట్ల 40 లక్షల మంది పిల్లలు పాఠశాలల్లో చదువుతుండేవారు. నేడు వారి సంఖ్య 6 కోట్లకు పెరిగింది. అదే కాలంలో విశ్వవిద్యాలయాలలోని విద్యార్థుల సంఖ్య 5 లక్షలనుండి రెట్టింపుపైగా పెరిగింది. ఈ ఫలితాలను తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. స్వాతంత్ర్యానంతరం 17 సంవత్సరాలపాటు దేశనౌకను కల్లోలితమైన కాలమహాసముద్రంలో సురక్షితంగా నడుపగలిగిన నెహ్రూ నాయకుని బుద్ధి చాకచక్యానికీ, దూరదృష్టికి యివన్నీ నిదర్శనాలు.

ఇంతకంటే మించిన అభివృద్ధి జరగడం అవసరం. సాధ్యంకూడా; ముఖ్యంగా వ్యవసాయరంగంలో. ఎదుర్కొనే సమస్యలకు పరిష్కార మార్గాలు మనచేతిలోనే వున్నాయి. కొన్నింటిని మనవి చేస్తాను.

మొదట్లో వ్యవసాయరంగం తీసుకుందాం—ఈ రంగంలో ప్రధానమైన సమస్య పెట్టుబడి కానేకాదు. అసలు సమస్య — పనిలేకుండా వున్న గ్రామీణ మానవశక్తి సంపదను వినియోగించుకునే విషయంలో తగిన నాయకత్వం, వ్యవస్థా నిర్మాణము. వ్యవసాయరంగంలోనూ, గ్రామీణ పునర్నిర్మాణ రంగంలోనూ. చేయవలసిన పని పుష్కలంగా వుంది. భూమిని క్రొత్తగా సాగులోకి తేవడం, అడవుల పెంపకం, భూసార సంరక్షణ, వరద నిరోధం, సేద్యపునీటి పారుదల, చెరువులు, పంటకాల్వల మరమ్మత్తు, నిర్వహణ, గ్రామీణ నీటి సప్లై, రోడ్లు మొదలైన ఎన్నో నిర్మాణ కార్యక్రమాలు వున్నవి. ఈ పనులన్నింటికీ మామూలు నైపుణ్యంగల కార్మికులు

పనిచేస్తే చాలు. చిన్నతరహా పరికరాలు చాలు. కోసీనది వరదల నిరోధానికి నిర్మాణం చేయబడిన కట్టలపని అనుకున్న దానికంటే ముందుగా, అనుకున్నదాని కంటే తక్కువ ఖర్చుతో ముగిసింది. మానవశక్తి సంపదను ప్రణాళికాబద్ధమైన మార్గంలో వినియోగించుకుంటే ఏ విధంగా పని జరుగుతుందో చూపడానికి యిది చక్కని ఉదాహరణము. మరొక నిదర్శనం ఫరీదాబాద్. మేస్త్రీలు, వడ్రంగులుగా మారిన వర్తకులు, వాయవ్య సరిహద్దుప్రాంతము నుండి వచ్చిన కాందిశీకులు దీనిని నిర్మించుకున్నారు.

భారత దేశంలో వ్యవసాయం, రైతు పొట్టపోసుకునేందుకు మాత్రమే సరిపడే దశనుండి అమ్మకానికి తగినంత సరుకు మిగిలే దశకు రావాలంటే రైతులకు ప్రోత్సాహకరమైన సౌకర్యాలు, అవకాశాలు కల్పించాలి. వీటిని కల్పించడం ఏమంత కష్టంకాదు. ధరలు, మార్కెట్ సౌకర్యాల విషయంలో సహకారోద్యమం రైతును చాలావరకు ఆదుకోవచ్చు. అధికోత్పత్తి జరగడానికి అవసరమైన క్రొత్త పరిస్థితుల విషయంలో రైతులకు తగిన విజ్ఞానం కలుగజేయాలి. ఇప్పటికే గ్రామాలలోకి సైకిళ్లు, టార్చిలైట్లు, రేడియోలు, బూట్లు, సిగరెట్లు, యిటుకతో కట్టిన యిండ్లు, రకరకాల కొత్త దుస్తులు మొదలగు ఆధునిక నాగరికతా చిహ్నాలు ప్రవేశించాయి. ఈ వస్తువులకు గిరాకీ తప్పకుండా పెరగాలి. చవుకలో నాణ్యమైన వస్తువులు తయారుచేసి ప్రజలు వినియోగించుకోడానికి వీలుగా, గ్రామసీమల్లో యీ విలాస వస్తువులను విరివిగా రైతులకు అమ్మకానికి విడుదల చేయాలి.

అంతేకాక ప్రస్తుతం నిర్మాణంలో వున్న ప్రాజెక్టులను సాధ్యమైనంత త్వరలో పూర్తి చేయడానికీ, ఆర్థికవ్యవస్థలో యిప్పుడుగల శక్తి సామర్థ్యాలను పూర్తిగా వినియోగించుకోడానికి తీవ్రంగా కృషి జరగాలి. ఉన్న శక్తి సామర్థ్యాలను పూర్తిగా ఉపయోగించుకోవడం జరిగితే ఉత్పత్తి వృద్ధి అవడమే కాకుండా ఉత్పత్తి ఖర్చులు తగ్గుతాయి. ఒక ఇంజనీరింగ్ పరిశ్రమలోనే వినియోగం కాకుండా వున్న శక్తి 50 శాతం వుంటుందని అంచనా.

పరిపాలనా నిర్వహణలో మార్పులు :

ప్రస్తుత పరిపాలనా నిర్వహణ క్లిష్టమైన పద్ధతులలో, పూర్వోదాహరణలకు పూర్తి కట్టుబడి జరుగుతున్నది. ఇందులో తక్షణం విప్లవాత్మకమైన మార్పులు రావడం అవసరం. తెలివైన పద్ధతులు అవలంబిస్తే, ఎక్కువ చెల్లింపు జరుగడానికిగానీ, మోసం జరగడానికిగానీ వీలుండదు. ఒక నిర్ణయాన్ని తీసుకోకుండా వాయిదా వేసినందువల్ల జరిగే జాతీయనష్టం చాలా ఎక్కువగా వుంటుంది. జరిగిన పొదుపు అందులో శతాంశం మాత్రమే వుండడంకద్దు. కాలమే ధనం అంటే త్వరితగతిలో పని చేయడం లాభదాయకం అనీ, అదే ముమ్ముందు ఒక ముఖ్యమైన వనరుగా ఉపయోగపడుతుందనే విషయం పూర్తిగా ఎవరూ గ్రహించడం లేదు. ఒక ప్రాజెక్టుప్రాంతంలో కావలాదార్లకు సుమారు రు. 1,000ల ఖర్చుతో యూనిఫారం సప్లై చేయాలా వద్దా అనే అంశంపై గంటకుపైగా దీర్ఘంగా చర్చ జరిగిన సందర్భంలో నేనక్కడఉండి వినడం తటస్థించింది. ఈ చర్చలో పాల్గొన్న వారందరికీ కలిసి నెలకు మొత్తం రు. 25,000 లు జీతం వుంటుంది.

జరుగవలసిన మరొక ముఖ్యమైన చిన్న సంస్కరణ ఏప్రెల్ నుండి మార్చి వరకుగల ఆర్థిక సంవత్సరంలో మార్పు. సరియైన ప్రణాళికా రచనకూ, పరిపాలనా వ్యవహారాలకూ యీ సంవత్సర కాలపరిమితి అడ్డంకిగా వుంది. బడ్జెట్‌లో కేటాయించబడిన మొత్తాలు, వివిధశాఖల పద్దులకు జమకట్టబడి వారికి ఖర్చుచేసే అధికారం సంక్రమించే నాటికి వర్షాకాలం ప్రారంభమవుతుంది. దానితో పనులన్నీ పూర్తిగా స్తంభించకపోయినా కుంటుపడడం తప్పనిసరి అవుతుంది.

అందువల్ల ఈ ఆర్థిక సంవత్సరాన్ని జులై నుండి ఆగస్టువరకు మార్చుకుంటే బావుంటుంది. దీనివల్ల బడ్జెట్ కేటాయింపులు ప్రయోజనాత్మకంగా ఖర్చు జరగడానికి వీలుంటుంది. ప్రణాళికా కార్యక్రమాలు త్వరితగతితో అమలు జరగడానికీ, పరిపాలనా సామర్థ్యం పెరగడానికీ, ఆర్థిక అజమాయిషీ సక్రమంగా జరగడానికీ యీ మార్పు దోహదం చేస్తుంది.

శాస్త్రీయ పరిశోధనలు :

పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ దేశంలో శాస్త్రీయ పరిశోధనలకు చాలా ప్రోత్సాహమిచ్చారు. అయినప్పటికీ భారతదేశంలో శాస్త్రీయ పరిశోధన, సాంకేతిక అభివృద్ధి మందంగానే జరుగుతున్నది. విదేశాలలో తర్ఫీదు పొందిన మన శాస్త్రవేత్తలు స్వదేశానికి రావడానికి వెనుకాడడం విచారకరం. శాస్త్రవేత్తలు చేస్తున్న కృషిని గుర్తించకపోవడం, పరిశోధనకు తగిన వసతులు లేకపోవడం, సామగ్రి సమకూర్చుకోవడంలో యిబ్బందులు, అంతులేని ఆలశ్యాలు జరుగుతూవుండడం, వారిలో వారికి, ముఖ్యంగా పెద్దవయస్సుగల వారిలో గల అసూయలు పరస్పర స్పర్థలు దీనికి కారణం. ఐ. సి. యస్. అధికారులు చాలావరకు ఎన్నో సుగుణాలు కలిగివుంటారు. అయినప్పటికీ వారుకూడా శాస్త్రవేత్తలు మేధావులనీ, తమకృషిలో పూర్తిగా నిమగ్నమై పనిచేసుకోవలసిన వారనీ గుర్తించడానికి వెనుకాడుతున్నారు. పరిశోధన జరపడానికి కావలసిన ఒక పరికరం శాస్త్రవేత్తకు అందడం ఆలస్యమైతే, దానికోసం వేచికూచోడంలో ఆయనకాలం వృథా అవుతున్నదనీ, యీలోగా ఆ పరిశోధన మరోచోట- ఎక్కువ అవకాశాలుగలచోట- జరగడంవల్ల అది పాతబడిపోతున్నదనీ వారు గ్రహించడం లేదు.

వ్యయకర్తన ప్రతిపాదనలు వచ్చినప్పుడల్లా పరిశోధనా సంస్థలకే ముందుగా దెబ్బతగులుతుంటుంది. వాటి బడ్జెట్ కేటాయింపుల్లో కోతపడుతుంది.

మనం నేర్వవలసిన ప్రథమ గుణపాఠం స్వయంకృషి, స్వశక్తిపై ఆధారపడడం. ఈ గుణపాఠంగనుక మనకు ఒంటబట్టితే విదేశాలమీద ఆధారపడే దుస్థితినుండి మనం విముక్తి పొందగలుగుతాం

గాంధీజీ.

మన దేశంలో "బోరన్" పదార్థంలేదు. కాని ఇన్సులేటర్లు తయారుచేయడానికి అదిఅవసరం. ఒక పరిశోధనా సంస్థలో భారతీయ శాస్త్రజ్ఞులు, దానికి బదులు వాడడానికి మరొక పదార్థాన్ని తయారు చేశారు. కేవలం భారతీయవస్తు సామగ్రితోనే దానిని తయారు చేయగలిగారు. దానివల్ల యిప్పుడు భారత దేశం తన కవసరమైన "స్పార్కింగ్ ప్లగులు" తయారుచేసుకునే పరిస్థితి ఏర్పడింది. ఈ పరిశోధనాసంస్థ బడ్జెట్‌లోకూడా ఒక ఏడాదిక్రితం 20 శాతం కోత పెట్టారు.

ఈ 20 శాతం కోతే మన దేశంలో శాస్త్రీయ పరిశోధన ప్రగతికి నిజమైన అవరోధంగా వుంది. శాస్త్రీయ విజ్ఞానం వల్ల ఏమంత పెద్ద ప్రయోజనంలేదని పాశ్చాత్య దేశాల్లోకూడా నమ్ముతున్న రోజుల్లో మనలో చాలామందిమి విద్యనార్జించాము. అందువల్ల బాంబులు, యుద్ధప్రక్రియకవసరమైన యితర సాంకేతిక విషయాలు నేర్చుకునే అవసరం మనకు లేకపోయింది. ఇప్పటికీ మన మనః ప్రవృత్తి శాస్త్రజ్ఞానానికి దూరంగానే వుంటున్నది. దేశంయొక్క ఆర్థికాభివృద్ధికి శాస్త్రీయ, సాంకేతిక విజ్ఞానాలు ఎంతవరకు దోహదం చేయగలవో, ఎంత ప్రముఖపాత్ర అవి నిర్వహించగలవో — చైనాలో జరిగినట్లు-మనం గుర్తించలేకుండా వున్నాం. అందువల్లనే మన విశ్వవిద్యాలయాల్లో సైన్సు బోధన కేవలం విద్యావిషయకంగానే జరుగుతున్నది. ఎంతసేపటికీ పుస్తకాల విజ్ఞానమేగాని, పరిశోధనా వ్యవస్థకు చోటు లేకుండాపోయింది. అంతేకాక శాస్త్ర పండితుడు స్వయంగా పనిచేయడం ఆయన హోదాకు లోపమనే ఒక విశ్వాసం వుండడంవల్లకూడా యీ పరిస్థితి మరీ తీవ్రంగా పరిణమించింది. దీనివల్లనైతేనేమి, యంత్రసామగ్రి యితర సౌకర్యాలు లేనిలోపంవల్లనైతేనేమి, ఎంతసేపటికీ సిద్ధాంతరూపమైన విషయ సేకరణ, తలా తోక లేని లెక్కలు తప్ప ప్రయోజనకరంగా శాస్త్రీయ విజ్ఞానం అందడంలేదు. ఈ లెక్కలు, యీ సిద్ధాంత చర్చలు సత్యానికీ, నిత్య జీవితంలో అనుసరణకూ చాలా దూరంగా వుంటాయి.

ఒక ఆశారేఖ :

పరిస్థితి యింత చెడుగావున్నప్పటికీ అందులోనుండి ఒక ఆశాకిరణం తళుక్కుమంటున్నది. అదేమిటంటే భారతదేశం విప్లవాత్మకమైన శక్తి సామర్థ్యాలు కల దేశం. ఆత్మశక్తితో పురోగమిస్తున్న దేశం.

ఎద్దుబండి నాగరికతనుండి అణుశక్తి యుగంవరకు దాదాపు ఒక శతాబ్దం పైగా జరిగిన పురోగమనమంతా ఒక తరం వారు సాధించాలంటే మాటలు కాదు. అయినా, అభివృద్ధికి పాటుపడుతున్న యితర దేశాలవలె, భారత దేశం యీ లక్ష్యసాధనకే కృషిచేస్తున్నది. దీనిని మనం లిబరల్ ప్రజాస్వామ్య రాజకీయ సిద్ధాంత పరిధిలోనే సాధించ దలచినాము. పాశ్చాత్య . రాజ్యాలలో ఆలస్యంగా వచ్చిన ఆర్థిక విప్లవ ఫలితమే మనం నిర్ణయించుకున్న యీ పరిధి కూడా. ఆర్థికరంగంలో యిప్పటి దుస్థితికి కారణం మనం మరీ ఉన్నత లక్ష్యాలను పెట్టుకుని సాధించబూనడం కాదనీ, చేయవలసినంత గట్టికృషి చేయనందువల్లనేననీ నా విశ్వాసము. స్వయంశక్తిదాయకమైన ఆర్థికవ్యవస్థా నిర్మాణానికి యిప్పుడున్న అడ్డంకులేవీ అధిగమించజాలనివికావు. వీటిని మనం దీక్షతో తొలగించుకోవచ్చు.

ఈ సందర్భంలో గాంధీజీ ప్రబోధాన్ని మనం గుర్తుంచుకోవాలి.

"మనం నేర్వవలసిన ప్రథమ గుణపాఠం స్వయంకృషి, స్వశక్తిపై ఆధారపడడం. ఈ గుణపాఠం గనుక మనకు ఒంటబట్టితే విదేశాలమీద ఆధారపడే దుస్థితినుండి, చివరకు దివాలాతీసే పరిస్థితినుండి మనం విముక్తి పొందగలుగుతాం." ★

బతికిన కాలేజీ

పాలగుమ్మి పద్మరాజు

సీరియల్ **14**

జరిగిన కథ

పెద్దలకు నచ్చక పెళ్ళిచూపు లాగినా అబ్బాయి పట్టూమాత్రం అమ్మాయి రాధనే పెళ్ళి చేసుకోవాలని అనుకొని, స్నేహితుడు చింతా సలహాతో తండ్రిని ఒప్పిస్తాడు. పెళ్ళిపీటలమీద పెళ్ళికూతురు రాధ కాకపోగా, విరాగియై తిరిగి ఇంటికి వస్తాడు. రాధా, కల్యాణీ శర్మగారివద్ద నాట్యం నేర్చుకొని రామలింగయ్య సహాయంతో ప్రదర్శన ఇస్తారు. చింతా, పట్టూ దీనికి వస్తారు. పట్టూ రాధను కలుసుకోనడానికి గ్రీన్‌రూమ్‌కే వెళ్తాడు. అక్కడ కామన్న చేత బాగా దెబ్బలుతిని చివరికి చింతా సలహాపై పుంజుకుని కామన్నని ఒక కొత్తరకం పట్టుతో ఓడించేస్తాడు. కామన్నని చింతాయే అతని యింటి దగ్గర దిగవిడుస్తాడు. ఆ మర్నాడు వాళ్ళింటికి వెళ్ళి అతని చెల్లెళ్ళయిన రాధ, కల్యాణీలను తను రాసిన నాటకంలో వేషం వేయడానికి ఒప్పిస్తాడు.

అతను చెప్పిన కథ - అతడు కథ సవ్యంగా చెప్పేస్థితిలో లేడనుకోండి.(అదే సమయంలో కామన్న పంచీ చొక్కా తొడుక్కుని ఇవతలికి వచ్చాడు. మిస్టర్ చింతాని నమిలి మింగెయ్యాలన్నట్టు చూశాడు. రామలింగయ్య కూచోమని సంజ్ఞ చేస్తే కూచున్నాడు.) అతను అసందర్భంగా పూర్వాపర సంబంధం లేకుండా వాగిన వాగుడులోంచి నేను గ్రహించిన కథ, నాకు దిగ్భ్రమ కలిగించింది.

కామన్న కుర్చీలోంచి లేచాడు. తన్నీ విధంగా అవమానిస్తుంటే తనుమాత్రం ఆ రహస్యం ఎందుకుదాచాలి? పట్టూ పీడూ కలిసి గంగలో దిగనీ.

"నువ్వు నన్ను మీ ఇంటికి తీసికెళ్లితే నాకు టీ ఇవ్వలే?" అని అరిచాడు.

"అదే చెపుతున్నాను. టీ ఇస్తే కాస్త నరాలు సర్దుకుంటాయని మా ఇంటికి తీసికెళ్ళాను. ఆ తరువాత ఇక్కడ నా కార్లోనే దింపాను. చిత్రం. మీ రిక్కడ మకాం చేస్తున్నారని నాకు తెలీదు అప్పుడు. తెలిస్తే నేనే తలుపుతట్టి మిమ్మల్ని లేపి అప్పగించేవాణ్ణి." అన్నాడు మిస్టర్ చింతా.

"తెలీదేం? కల్యాణి మా చెల్లెలనీ, ఆ రాస్కెల్ పెళ్లిపీటలనుంచి పారిపోయి దాని జీవితం నాశనం చేశాడనీ,...."

"చెప్పారు. అయితే కల్యాణే మిస్ వాణి అనీ, ఆ అద్భుత నర్తకి అన్నగారే వీరనీ నాకిప్పుడే తెలిసింది. మీకథ విన్నాక నాకు దిగ్భ్రమ కలిగిందని చెప్పానుగా. ఎందుకంటే—నేను రాసిన నృత్యనాటకంలో సరిగ్గా—అక్షరాలా—ఇల్లాగే జరిగింది."

కామన్నకి కోపంతో గొంతుక పూడిపోయింది. నిన్నరాత్రి అకారణంగా అతన్ని అందరూ తాగుబోతుకింద కట్టేసి అవమానించారు. ఇప్పుడే చింతాగాడు చెప్పే కథ తన చెల్లెళ్ల అనుమానం ధ్రువపరుస్తోంది.

"ఒరేయి దొంగపీనుగా, ఎందుకీ నాటకమంతా...." అంటూ మీదికురకబోయాడు.

"అన్నయ్యా" అంది కల్యాణి.

"కూచో," అని అరిచాడు రామలింగయ్య.

"అదికాదు మావయ్యగారూ! అంతా అబద్ధం, అన్నాడు కామన్న.

"సిగ్గులేకపోతేసరి. చేసిన పనికి నోరుమూసుకు పడుండక పైగా రోషం ఒకటి" అంది రాధ.

గాలితీసేసిన బెలూన్‌లాగ చప్పబడిపోయాడు కామన్న, తను ఇప్పుడు ఏం చెప్పినా ఎవరూ నమ్మరు. ఏం లాభం? మిస్టర్ చింతా అతని కోపం తగ్గించడానికి,

"చుట్టా?" అంటూ ఒకటి అందించబోయాడు. కామన్న దాన్ని లాక్కుని ముక్కలు ముక్కలుచేసి పారెయ్యాలనుకున్నాడు. దానివల్ల తనస్థితి మరింత అయోమయం కావడం తప్పదని విరమించుకున్నాడు.

"మీరిందాకా మీపేరు మిస్ కల్యాణి అని చెప్పగానే, అప్పుడంతా నాకర్థమైపోయింది. నాగుండె చెరువైపోయింది. ఇటువంటి ప్రతిభావంతురాలికి రావలసిన కష్టమేనా ఇది అన్న బాధ అప్పటినించీ నన్ను వేధిస్తోంది."

మిస్టర్ చింతా చుట్టపీల్చాడు. పొగ రాలేదు. ఆరిపోయిందని గ్రహించి, అగ్గిపుల్ల గీసి మళ్ళీ అంటించాడు.

"ఆ నృత్యనాటకం ప్రదర్శించాలని ఎంతో ప్రయత్నించాను. అందులో ఇద్దరు మగ పాత్రలు, ఇద్దరు స్త్రీ పాత్రలు. స్త్రీ పాత్రలు నిర్వహించగల వ్యక్తులు దొరక్క విరమించుకున్నాను. ఈనాటికి ఆలోటు భర్తీచెయ్యగల సమర్థులు మీరిద్దరూ దొరికారు."

మిస్టర్ చింతా ఆగాడు. కల్యాణీ, రాధా విస్తుపోయి విన్నారు.

"బాగుంటుంది మనంవేస్తే" అంది రాధ.

"నాకిష్టంలేదు" అంది కల్యాణి.

''ముందు అది రామలింగయ్య బాబాయికి చదివి వినిపిస్తాను. ఆయినకి నచ్చితే తరవాత ప్రదర్శనం సంగతి ఆలోచిద్దాం. అదిగో కారొచ్చినట్టుంది. వొస్తారా బాబాయి, మిస్టర్ కామన్నా! మీరూ రండి.''

మిస్టర్ చింతామీద కసితీర్చుకోవచ్చునని కదిలాడు కామన్న.

''శలవు. మళ్ళీ దర్శనం చేసుకుంటా'' అంటూ వంగి నమస్కరించి మిస్టర్ చింతా అవతలికి దారితీశాడు. రామలింగయ్యా కామన్నఅతన్ని అనుసరించారు.

కార్లో ఎక్కగానే తన అక్కసంతా వెళ్ళబోసుకున్నాడు కామన్న.

''అసలు నా కిష్టం లేకపోయినా ఈ పన్నాగంలోకి నన్ను బలవంతంగా దింపింది నువ్వు. నిన్న రాత్రి ఆ దొంగ వెధవతో పొత్తు కలిపింది నువ్వు. ఆ తరవాత నన్నింటి గుమ్మం దగ్గరొదిలేసింది నువ్వు. పొద్దున్న రాగానే పలకరిస్తే ఎవరో తెలీనట్టు నాటకమాడతావా? ఆ తరవాత లేనిపోని కథలన్నీ కల్పించి చెబుతావా వాళ్లకి? అసలే వాళ్లు నేనేదో తాగేసి ఒచ్చాననుకుంటున్నారు, ఇంటికి. నువ్వసలు పెద్ద మనిషివేనా అంట?''

''ఒరేయి కామన్నా! కాస్త అర్థమయేటట్టు అఘోరించరా. పన్నాగ మేమిటి? తాగిరావడ మేమిటి?'' అన్నాడు రామలింగయ్య.

దానికి సమాధానం నేరుగా రాకపోయినా, కామన్న అరుపుల మధ్య, మిస్టర్ చింతా సముదాయింపుల మధ్య, కొంత కొంత అర్థమైంది. [కారు దిగి అందరూ ఇంట్లోకి వెళ్లగానే పక్క గదిలోంచి అరుపులు, చప్పుళ్లూ, హెచ్చరికలూ, శ్రీ ముఖాలూ, దూషణలూ, అన్నీ కలిసిపోయి గోలగా వినిపించాయి. మిస్టర్ చింతా తలుపు గొళ్లెం తియ్యడంతోటే తుపానులా ఇవతలికి వొచ్చి పడ్డాడు పట్టూ.]

''ఒరేయి! నన్ని గదిలో పెట్టి గొళ్లెం పెట్టమని నువ్వేనా చెబుతా డ్రైవరికి? నువ్వేనాంట?''



''నేనే - ఆడపిల్లలున్న కిటికీల కాడ కూర్చుని చచ్చు పవలల్లో ప్రణయ ఘట్టాలు ఏ కరువు పెడుతుంటే జనం ఊరుకుంటారా? ఏకీలుకాకీలు విరిచి చేతులో పెడతారు,'' అన్నాడు మిస్టర్ చింతా.

''ఏవిటో ఈ పిచ్చాసుపత్రి? వీడెవడు?'' అన్నాడు రామలింగయ్య.

''ప్లీజ్ మీట్ మై ఫ్రెండ్. పట్టూ అనబడే పట్టాభిరామారావు.''

''కల్యాణిని చేసుకోడానికొచ్చి, పెళ్లి పీటల మించి పారిపోయిన పెళ్లి కొడుకు వీడే,'' అన్నాడు కామన్న.

''అదా సంగతి!'' అన్నాడు రామలింగయ్య మెల్లగా. అప్పటికి కామన్న-చింతా-ప్రశ్నోత్తరావళికి అర్థం ఇంచుమించు బోధపడిందాయనకి.

కొత్త మనిషిని, అందులో అన్ని విధాలా పెద్ద మనిషిలా కనబడుతున్న ఆసామీని చూడ్డంతోటే పట్టూ ఉద్రేకం తగ్గింది.

''నేను చేసింది నీచమైన పనే. కాని నేను రాధను మనసారా ప్రేమిస్తున్నాను. మొదట ఆమెనే చూశాను. ఆమే ఆమె అనుకుని, తీరా ఆమెను పెళ్లి కూతుర్నిచేసి తీసుకొచ్చేసరికి, ఆమె ఆమె కాదని తెలీడంతోటే .... ఏంచెయ్యాలో తోచక - ఆమె కన్యాయం చెయ్యడం ఇష్టంలేక - ఆమె కోసమని, ఆమెను....''

''అర్థమైందిరా కుర్రకుంకా,'' అన్నాడు రామలింగయ్య.

''ఇకమీద కర్తవ్యం ఆలోచించడానికే మిమ్మల్నికక్కడికి తీసుకొచ్చాను బాబాయి'' అన్నాడు మిస్టర్ చింతా. అలవాటైన 'మిస్టర్ రామలింగయ్య'కి బదులు 'బాబాయి' అని సంబోధించడంలో ఆంతర్యం ఉందని పట్టూగ్రహించాడు. తనకోసం ఇంత శ్రమపడుతున్న తన ప్రాణమిత్రుడి మీద చిరాకు పడ్డం తప్పని అతని మనస్సు హెచ్చరించింది. అంచేత మాట్లాడకండా కూచున్నాడు పట్టూ.

కామన్న ముఖంమీది మబ్బులు కాఫీ కప్పూ, సిగరెట్టు పెట్టే చూడ్డంతోటే చెదిరిపోయాయి. అతనికి తెలియకండానే, అతని ప్రయత్నం లేకండానే చిరునవ్వు మొలిచింది అతని పెదవుల మీద. ముందు కాఫీ చప్పరించాలో, సిగరెట్టు ముట్టించాలో తేలక కామన్న మధన పడ్డాడొక క్షణం. ఆసనాల పుస్తకాన్ని నమ్ముకుని, ఇంత సంతృప్తినిచ్చే సాధనాలను ఇన్నాళ్లు నిర్లక్ష్యం చేసినందుకు, తన్నుతాను నిందించుకున్నాడు. కాని 'యోగా సనములు' రాసిన గ్రంధకర్త మీద కోప్పడ్డానికి మాత్రం మనస్సు వెనకాడింది.

కామన్న సిగరెట్టు ముట్టించి పొగ ఒదలడంతోటే రామలింగయ్య పగలబడి నవ్వాడు.

''ఏందోయి అల్లుడా, ఇది కూడా అలవాటైందీ ?'' అన్నాడు.

''ఇది కూడా అంటే ?'' అన్నాడు కామన్న. అతని ముఖంమీద మళ్లీ నల్లని మబ్బులు క్షణంపాటు ఆవరించాయి. అయితే రామలింగయ్య ఆ'కూడా'ని అంతకన్నా వివరించలేదు.

''నీనాటకం తియ్యరా అబ్బాయి,'' అన్నాడు రామలింగయ్య.

''నాటకమా ఏం నాటకం ?'' అన్నాడు మిస్టర్ చింతా.

''ఏదో హృదయ కుసుమాలన్నావుగా?''

''హృదయ కుసుమాలా ? ఎవ....'' చటుకుని బండి గాడిలో పడుతోందని గ్రహించాడు మిస్టర్ చింతా. వెధవ చుట్ట పొగ కారణం దానికి. అంచేత సగమైనా కాలకుండాన్నే పక్కనున్న గంగాళ మంత అష్ట్రేలో దాన్ని పారేశాడు.

''ఐమ్‌సారీ,'' అన్నాడు. ''ఆ నృత్య నాటిక ఇంకా రాయలేదు.''

''రాయలేదూ? '' అన్నాడు ఆశ్చర్యంగా రామలింగయ్య, ''మరి....''

''లీవిట్‌టు మిస్టర్ చింతా,'' అన్నాడు మిస్టర్ చింతా. ''అంతా నా మెదడులో ఉంది...పాటలూ, వచనం, అంతా, కాగితం మీద పెట్టడమే తరవాయి.''

''మరి...'' అన్నాడు రామలింగయ్య మళ్లీ.

'మిస్ కల్యాణి అడక్కపోయినా, మిస్ రాధ అడిగి తీరుతుంది, చదివి వినిపించమని? అందుకు నేనొక సమాధానం ఆలోచించాను. ఈ ఉదయమే నాకో కొత్త ఆలోచన తోచింది, మెలికలాంటిది. రామలింగయ్య బాబాయంత ప్రముఖ నటకుడు మనదగ్గరుండగా ఆయన్ని ఉపయోగించుకోక పోవడం ఎంత అవివేకం? ఆయన ఇన్నాళ్లని తిరిగి రంగస్థలం ఎక్కుతున్నారంటే, జనం విరగబడిపోరూ! అంచేత ఇదివరకు నేను రాసిన హృదయ కుసుమాలలో ఆ ప్రముఖ నటుడికి ఒక ప్రధాన పాత్ర సృష్టించి తిరిగి రాస్తున్నాను, అని చెపుతాను.''

''ఏవిటీ నేనా? నృత్య నాటికలో నేనేం చెయ్యగలనురా?''

''లీవిట్‌టు మిస్టర్ చింతా. అసలు నృత్యమంటే ఏవిటి? మీకే నృత్యం రానప్పుడు ప్రధాన పాత్రల్లో ఒకడైన పట్టూ మాత్రం ఏం నాట్యం చెయ్యగలడు?''

''నేనా?'' అని కుర్చీలోంచి అకస్మాత్తుగా ఎగిరి గంతేశాడు పట్టూ.

''అంచేతే నీకు వచనం. నీ చేతులో ఉన్న పుస్తకంలోంచి కొన్ని పేజీలు. అదీనీ పోర్షను. ఎవరి పాత్రలు వారు నిర్వహిస్తే చాలు. నృత్యం చేశామనే అనుకుంటారు జనం. అభినయం చెయ్యగలిగితే చాలు. అసలు నృత్య భాగమంతా మన సోదరీ మణులూ, నేనూ నిర్వహిస్తాం. రాసేటప్పుడే అందుకు వీలుగా రాసుకుంటాం. మగవాళ్ల నీచత్వాన్ని గురించీ, ఆడవాళ్ల ఔన్నత్యాన్ని గురించీ, ఒక డజను పద్యాలు. రాగాలు మార్చి పాడడానికి వీలుగా—రాయబారం సీనులో కృష్ణుడు గుర్తుకొచ్చేటట్టు—అదీ మీ పోర్షను.''

నాటకం పద్యాలూ అనేసరికి రామలింగయ్య ముఖం విప్పారింది, ఆయనింక అవకాశం ఇస్తే, ''ఒరే మారోజుల్లో,'' అని ప్రారంభిస్తాడని గ్రహించి మిస్టర్ చింతా తన ప్రణాళిక వివరించాడు.

కథ అచ్చూ మచ్చూ, జరిగిన కథే. మోహన్—బ్రొత్తిగా పట్టూ లాంటి పేర్లు సాహిత్యంలో బాగుండవు. అదీగాక అసలు పేర్లు ఉపయోగిస్తే ఇది నాటకం కాదని సోదరీమణులకు తెలిసిపోతుంది. తెలిసిపోతే అసలు నాటకమే ఉండదు—అంచేత—మోహన్ అనబడే యువకుడు ఒక పిల్లని చూడ్డానికి వెడతాడు. అనుకోకుండా అరుగుమీద మిస్ రాణి—(నాటకంలో మిస్ రాణి, మిస్ రాణి ఉంచెయ్యొచ్చు. అవి అసలు పేర్లు కావు, అదీగాక, అవి వాళ్ల రంగస్థలనామధేయాలుగా చలామణీ అయిపోయాయి.) నాట్యం చేస్తుండగా మోహన్ చూశాడు. ఆమెయే పెళ్లి కూతురనుకోడం—వగైరా మిగతా కథంతా మామూలుగా నడుస్తుంది. ఈ సమస్య పరిష్కారం విషయమై, మోహన్, గోపాల్ అనే తన ప్రాణస్నేహితుడి సహాయం కోరతాడు. గోపాల్ రంగంలోకి దిగే సరికి—అంటే మిస్ రాణి ఎదట పడే సరికి, అతనికి మతిపోతుంది. మిస్ రాణిలోని హుందాదర్పం, ఆత్మాభిమానం, అతన్ని ముగ్ధుణ్ణిచెయ్యడమే కాదు. భయపెడతాయి. అతని పన్నాగాలన్నీ బెడిసి కొడతాయి. సోదరీ మణులు ఈ యువకుల నిద్దరినీ ఈసడిస్తారు, అసహ్యించుకుంటారు. అప్పుడు సోదరీ మణులకు అత్యంతాప్తుడూ, సంగీత గురువూ అయిన రామలింగయ్య (ఆ పేరు మాత్రం ఆరుమూడైనా సరే, మార్చడానికి వీల్లేదన్నాడు పట్టూ. ఆ పేరుకున్న విలువ, దాన్ని ఆశ్రయించుకున్న గౌరవ ప్రపత్తులు, ప్రదర్శనానికి ఎంతో బలం.) అన్యాపదేశంగా ఒకడజను పద్యాలు చదివి, మగవాళ్ల మూర్ఖత్వం వెనక, అతి స్వచ్ఛమైన ప్రేమ ఉందని సోదరీమణులకు రుజువు చేస్తాడు. కథ కంచికి.

''ఇదంతా నాటకమని వాళ్లకి తెలిసి పోదూ,'' అన్నాడు రామలింగయ్య.

''లీవిట్‌టు మిస్టర్ చింతా,'' అన్నాడు మిస్టర్ చింతా.

రామలింగయ్య మిస్టర్ చింతా మీద కార్యభారం వదిలేసి, కొన్నేళ్లుగా మరిచిపోయిన కాఫీ రాగంలో సంగతులు సాధకం చెయ్యడం మొదలు పెట్టాడు. (సశేషం)

వినోదవీధి

ఏనాటికో ఓనాటిక

ఒక ఆధునిక మహాకవిని ఒక నాటిక వ్రాసివ్వమని ఒక నాటకాల రామకోటి ఎన్నో రోజుల్నుండి ప్రాధేయపడుతున్నాడు. ఆ మహాకవి కలంనుండి ఆ నాటిక ఎంతకూ ఊడిపడడం లేదు. అయితే ఆ రామకోటి నాటికను గురించి అడుగడం గూడ మాను కోలేదు. డెబ్బయిపదకొండోసారి-బహుశ-రామకోటి నాటికను గురించి అడిగినప్పుడు ఆ ఆధునిక మహాకవి ఇచ్చిన జవాబు-''ఏనాటికో ఓనాటిక వ్రాసిస్తాన్లేవయ్యా''.

గాడిదలూ-మామిడిపళ్లూ

ఉర్దూ సాహిత్య రంగంలో సమున్నత మైన స్థానం సంపాదించిన మిర్జాగాలిబ్ హాస్యంగా మాట్లాడి చురుకులవంటి ఛలో క్తులను విసరడంలో ఉద్దండుడు. గాలిబ్‌కు మామిడిపళ్లంటే చాలా ఇష్టం. ఓ రోజు గాలిబ్, ఆయన స్నేహితుడు ఒకతను కలిసి వీధిలో వెళ్తున్నారు - త్రోవలో పడి ఉన్న మామిడిపండును ఓ గాడిద వాసన మాత్రం చూసి ముట్టుకోకుండానే అయి ష్టంతో వెళ్లిపోయింది - ఈ దృశ్యాన్ని గమనించిన గాలిబ్ స్నేహితుడు గాలిబ్‌తో ఇలా అన్నాడు — ''చూసావా మిత్రమా, గాడిదలుకూడ మామిడిపళ్లను అసహ్యించు కుంటాయి.'' గాలిబ్‌ను ఏడిపించానన్నట్టు మొహంపెట్టిన స్నేహితునికి గాలిబ్ వెంటనే తడుముకోకుండా సమాధానం చెప్పాడు-''అవును మిత్రమా. నువ్వు చెప్పింది నూటికి నూరు పాళ్లు నిజం. మామిడిపళ్లంటే గాడి దలకు ఇష్టం కాదు.''

రాశిఫలాలు

ఒక దిన పత్రికలో (ఆదివారంనాటి) ఓ రాశివారికి ఫలానా వారంలో వారఫలం ఈ విధంగా ఉంది: ''ఈవారము సుఖముతో ప్రారంభమై లాభంతో అంతమవుతుంది. శుభప్రదమైన కాలము. సుఖము అవిచ్ఛి న్నముగా ఉంటుంది. ఆరోగ్యము మేలుగా ఉంటుంది. కాని అనారోగ్యముకూడా ఉండనే ఉంటుంది. దరిద్రదశ, చిత్త చాంచల్యము, క్లేశము, వైకల్యము సంప్రాప్తమవుతవి..''

నెహ్రూజీ చమత్కారం

ఇది మనకు స్వాతంత్ర్యం దొరకడానికి ముందటి మాట. ఆ రోజుల్లో నెహ్రూజీ నాసిక్ జైల్లో ఉండేవారు. ఆ జైలులో ఇచ్చే రొట్టెల్లో మట్టి కలుస్తున్నదనికొందరు ఖైదీలు నెహ్రూజీకి చెప్పారు. నెహ్రూజీ ఈ విషయాన్ని గురించి జైలు సూపరింటెం డెంట్‌తో మాట్లాడారు.

''మీరు మాతృభూమి సేవచేయడానికి వచ్చారు. అంతేగాని ఈ విధంగా రొట్టెల్లో మట్టి ఉందని ఫిర్యాదు చేయడానికి కాదు'' అని సూపరింటెండెంట్ నవ్వుతూ నెహ్రూ జీతో అన్నారు.

నెహ్రూజీ వెంటనే ''మీరు చెప్పింది నిజమే. మేము మాతృభూమి సేవ చేయ డానికి వచ్చాంగాని దానిని తినడానికి కాదు అని జవాబు చెప్పారు.

క్రికెట్ టీమ్

'జంగ్‌లీ' అనేపేరుగల ఒక వ్యక్తి ఎంతో అసహాయపరిస్థితిలో నెహ్రూజీని కలుసు కున్నాడు. నెహ్రూజీ జంగ్‌లీని ఆదుకొని ఒక ఉద్యోగం ఇప్పించారు. తరువాత జంగ్‌లీకి వివాహం జరిగి పన్నెండు మంది పిల్లలు పుట్టారు. నెహ్రూజీ ప్రతి సంవత్సరం, కలిసినప్పుడల్లా ''జంగ్‌లీ, ఇప్పుడు నీకెంతమంది పిల్లలు'' అని అడుగు తుండేవారు. అతను 'పదకొండు' అని చెప్పినప్పుడు నెహ్రూజీ ''అయితే ఇప్పుడు మీ యింట్లోనే క్రికెట్ టీమ్ తయారైందన్న మాట'' అని పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వారు.

చికిత్సా-ఫలమూ


ఒకతను:-డాక్టర్‌గారూమీరు చేసిన చికిత్సకు మీకు జీవితాంతం ఋణపడిఉంటాను.

డాక్టరుగారు:-(ఆశ్చర్యంతో) మీకు చికిత్స చేసినట్టు నాకు జ్ఞాపకం లేదే !


ఒకతను:-నిజమే, నాకు మీరు చికిత్స చెయ్య లేదు. మా పినతండ్రికి చికిత్సచేశారు. ఆయన ఆస్తికంతా నేనే వారసుణ్ణి.

విషమూ-లాయిడ్‌జార్జీ

బ్రిటిష్ రాజకీయరంగంలో పేరుప్రఖ్యా తులు పొందిన లాయిడ్‌జార్జి సమయస్ఫూర్తి జవాబులకు, చమత్కారానికి, కారం ఉప్పూ కలిసిన ఛలోక్తులకు ప్రసిద్ధి పొం దాడు. ఒక బహిరంగసభలో లాయిడ్‌జార్జి గంభీరంగా ఉపన్యసిస్తున్నాడు. హఠాత్తుగా సభికుల్లోనుండి ఒక అందవిహీనమైన స్త్రీ లేచి ''మిస్టర్ లాయిడ్‌జార్జ్ ఒకవేళ నేను నీభార్యనయితే నీకు విషం ఇచ్చేదాన్ని'' అని గట్టిగా అరిచింది. జార్జ్ గంభీరమైన ఉపన్యాసానికి అడ్డంకి ఏర్పడింది. సభికుల్లో కలకలం మొదలయింది. పరిస్థితిని గమ నించిన లాయిడ్‌జార్జి మెరపులా ఒక్క సారి ఆ అందవికారమైన స్త్రీ మొహం చూసి ఇలా అన్నాడు-''మాడమ్, ఒక వేళ నేను నీభర్తనయి ఉంటే వెంటనే వెనక్కు చూడకుండా విషంపుచ్చుకునే వాణ్ణి.'' *



చార్మినార్ నూరుకోట్లు



మేరను దాటింది

భారత దేశములో మునుపెన్నడూ లేనంత మొత్తంలో అమ్మకము



ఒక సారి ఆలోచించండి : నూరు కోట్లు [illegible]
[illegible] చార్మినార్ సిగరెట్లు [illegible]
అంటే, ప్రతి రోజూ 33,333,333 సిగరెట్లు [illegible]
[illegible] రెండు రకాల సిగరెట్లు [illegible]
[illegible] అందులో ఆశ్చర్యంలేదు. కారణం,
[illegible] చార్మినార్‌తో [illegible]
ఇతర సిగరెట్లు [illegible] అద్వితీయమైన [illegible]
[illegible]

అద్వితీయమైనది చార్మినార్—
[illegible]

ఆంధ్రప్రదేశ్‌లో ఖనిజపరిశ్రమ

డా॥ బి. బాలగంగాధర శర్మ

1961 లో రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్ మైనింగ్ కార్పొరేషన్ అనే సంస్థను ఏర్పాటు చేసింది. ఇది పూర్తిగా ప్రభుత్వ యాజమాన్యాన నడిచే సంస్థ; ఖనిజ సంపదను సద్వినియోగపరుచుకోవడం, ఖనిజ సంబంధి పరిశ్రమలను అభివృద్ధి పరచడం ప్రభుత్వ లక్ష్యాలు.

ఏ దేశంలోనైనా ఖనిజాలు దేశీయ సహజ సంపదలో ప్రధానమైన భాగం. భూగర్భంలో ఖనిజాలు ఏర్పడడానికి చాలా కాలం పడుతుంది. దానిని మానవ జీవిత కాల పరిమితులతో గణించడం సాధ్యంకాదు. అందువల్ల ఖనిజ సంపద యొక్క ప్రాధాన్యం మరింత అధికమవుతుంది. ఈ కారణం చేతనే ఖనిజాలను "వృధా అయిపోతున్న ఆస్తులు" అని అంటుంటారు. ఆధునిక కాలంలో మానవుడు ప్రకృతిలో సహజంగా లభ్యమయ్యే ప్రతిదానికి బదులుగా కృత్రిమ వస్తువులను కల్పించుకోగలుగుతున్నాడు. అయినప్పటికీ పారిశ్రామిక రంగంలో ఖనిజాలకు గల ప్రాధాన్యం ఏమాత్రం తగ్గలేదు.

దేశంలోని వ్యవసాయ ప్రగతి పటంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అత్యంత ప్రధానమైన స్థానాన్ని అలంకరిస్తున్నది. భూగర్భ శాస్త్రవేత్తలు చెప్పేదానిని బట్టి ఖనిజ సంపద విషయంలోకూడా మన రాష్ట్ర భవిష్యత్తు ఎంతో ఆశాజనకంగా వున్నది. అయితే ఖనిజ సంపద పుష్కలంగావుండి కూడా దానిని మనం భూగర్భం నుండి వెలికితీసి సద్వినియోగ పరచుకోలేకపోతే మనకు మానసిక సంతృప్తి తప్ప మరేమీ ప్రయోజనం దక్కదు. ఖనిజ సంపదను వినియోగించుకునే కృషికి, ముందుగా వాటినిగురించిన పరిశీలన, మదింపు జరగాలి. వివరమైన పరిశీలనలు జరపడం ఖర్చుతోకూడిన పని. వాటిలోనూ ఎప్పుడూ సత్ఫలితాలే చేకూరుతాయనే నమ్మకంలేదు అయినా పరిశీలనలు జరుపక తప్పదు. ఈ పరిస్థితుల్లో, సోషలిస్టు సమాజనిర్మాణం ధ్యేయంగా గల మన దేశంలో పబ్లిక్ రంగం నిర్వహించ వలసిన పాత్ర ఎంతో వుంది.

1961లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ మైనింగ్ కార్పొరేషన్ అనే ఒక సంస్థను ఏర్పాటుచేసింది. ఇది పూర్తిగా ప్రభుత్వ యాజమాన్యాన నడిచే సంస్థ. ఖనిజ సంపదను సద్వినియోగ పరచుకోవడం, ఖనిజ సంబంధి పరిశ్రమలను అభివృద్ధి పరచడం యీ సంస్థ లక్ష్యాలు. బొగ్గు ఉత్పత్తికి సింగరేణి కాలరీస్ ప్రత్యేక సంస్థగా పనిచేస్తున్నది. ఇది కూడా ప్రభుత్వరంగంలోని సంస్థే. రాష్ట్రంలోని ఖనిజ సంపదను పరిశీలించి అభివృద్ధి పరచే కృషిలో రాష్ట్ర ప్రభుత్వపు గనులు, భూగర్భ విషయాలశాఖ వారూ; భారతప్రభుత్వానికి చెందిన జియలాజికల్ సర్వేఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యూరోఆఫ్ మైన్స్ అనే సంస్థలవారు ప్రధానమైన పాత్ర నిర్వహిస్తున్నారు.

దేశం అతితీవ్ర పరిస్థితిని ఎదుర్కొంటున్న ప్రస్తుతస్థితిలో, రాష్ట్రంలోని ఖనిజ సంపదను సద్వినియోగ పరుచుకోవడం చాలా అవసరం. ఖనిజ సంపదను స్థూలంగా మూడు విభాగాలు చేయవచ్చు

1. పరిశ్రమలలో ముడి పదార్థాలుగా ఉపయోగింపబడే, లేక ఇంధన ద్రవ్యాలుగా ఉపయోగింపబడే ఖనిజాలు

2. ఎగుమతుల వల్ల విశేషంగా విదేశీ మారక ద్రవ్యంలభింపజేసే ఖనిజాలు

3. ప్రస్తుతం విశేషంగా దిగుమతి అవుతున్న ఖనిజాలు, ఖనిజ సంబంధి వస్తువులు. ఈమూడు విభాగాలలోనూ ఖనిజాలు నిర్వహిస్తున్న పాత్రను పరిశీలిద్దాం.

సున్నపురాయి, సిమెంటు పరిశ్రమ

సిమెంటు తయారు చేయడంలో ముఖ్యంగా వాడే ముడి పదార్థం సున్నపురాయి. ఒక టన్ను సిమెంటు ఉత్పత్తి చేయడానికి 1.5 నుండి 1.6 టన్నుల వరకు సున్నపురాయి కావలసి వస్తుంది. దేశంలో యిప్పుడు ఒక కోటి టన్నుల సిమెంటు ఉత్పత్తి జరుగుతున్నది. ఇందులో మన రాష్ట్రంలోని 5 సిమెంటు ఫ్యాక్టరీలద్వారా ఏటా 11లక్షల టన్నుల సిమెంటు తయారవుతున్నది. ఎంతగా అభివృద్ధి కార్యక్రమం జరుగుతున్నప్పటికీ ఉన్న గిరాకీకి తగినంతగా ఉత్పత్తి జరగడంలేదు. 1964-65లో రు. 70 లక్షల విలువగల సిమెంటు దిగుమతి చేసుకోవడం జరిగింది. నాలుగవ ప్రణాళికాంతానికి 2½ కోట్ల టన్నుల వరకు సిమెంటు ఉత్పత్తి పెంచాలని ప్రభుత్వ సంకల్పం. సిమెంటు ఉత్పత్తి పెంచే లక్ష్యంతో యిటీవల కేంద్రప్రభుత్వం భారత సిమెంటు కార్పొరేషన్ అనే సంస్థను నెలకొల్పింది. సిమెంటు తయారీకి పనికివచ్చే సున్నపు రాయి పుష్కలంగా వున్నందున ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అధిక సిమెంటు ఉత్పత్తి లక్ష్యానికి ఎంతగానో దోహదం చేసే అవకాశం వున్నది.

బొగ్గు:

మామూలుగా వంటచెరుకుగా ఉపయోగపడే వాటిలో బొగ్గుచాలా ముఖ్యమైనది. అణుశక్తి ఉత్పత్తి చేయబడుతున్న యీఆధునాతన కాలంలో కూడా, సులభంగా లభ్యమయ్యే చోట్ల బొగ్గు వాడకం మంచిదనీ, చవుక అనీ భావించబడుతున్నది. ఆంధ్రప్రదేశ్‌లోని బొగ్గు గనుల నుండి ఏడాదికి 36 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతున్నది. దక్షిణాదిన మరెక్కడా యింత భారీయెత్తున బొగ్గు ఉత్పత్తి జరగడంలేదు. కొత్తగూడెం, రామగుండంలలో థర్మల్ విద్యుత్ కేంద్రాలు పనిచేయడం ప్రారంభించినప్పుడు మన బొగ్గు యింకా ఎక్కువగా లాభదాయకంగా వినియోగ పడుతుంది. ఇటీవల పాకిస్తాన్‌తో సంభవించిన యుద్ధములో యీ కేంద్రాలకు ఉద్దేశించబడిన యంత్ర సామగ్రికొంత పాకిస్తాన్ వారు పట్టుకోవడం వల్ల వీటి నిర్మాణంలో కొంత ఆలశ్యం జరుగవచ్చు. అయినా ఆ సామగ్రి త్వరలోనే విడుదల చేయబడుతుందని మనం ఆశించవచ్చు.

ముడిఇనుము :

మనరాష్ట్రంలో ముడిఇనుము నిలువలు అక్కడక్కడ చెదురు చెదురుగా వున్నవి, ఏదైన ఒక భారీ ఉక్కు-పరిశ్రమను నిర్వహించడానికి సరిపడినంతగాకూడా లేవు. అందువల్ల మనకులభ్యమయ్యే ముడి ఇనుపఖనిజాన్ని మన రాష్ట్రంలోనే పారిశ్రామిక ప్రయోజనాలకై వినియోగించుకునే అవకాశాలు లేవు. ఖనిజాలు, లోహాల ట్రేడింగ్ కార్పొరేషన్ ద్వారా మన రాష్ట్రం 3 నుండి 4 లక్షలటన్నుల వరకు ముడిఇనుము ఎగుమతి చేసి తద్వారా సంవత్సరానికి 1 నుండి 2 కోట్ల రూపాయల వరకు విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జిస్తూవుండడం విశేషం.

అభ్రకం :

పదేండ్లక్రితం అభ్రకం ఉత్పత్తిలో మన రాష్ట్రం దేశంమొత్తంమీద రెండవ స్థానం ఆక్రమించి వుండేది. ప్రథమ స్థానం బీహారుది. ఇప్పుడు మనది మూడవస్థానం—అంటే బీహారు, రాజస్థాన్‌ల తర్వాత. మన రాష్ట్రంలో సంవత్సరానికి 60-70 లక్షల టన్నుల అభ్రకం ఉత్పత్తి అయి, దాదాపు పూర్తిగా ఎగుమతి జరుగుతున్నది. దీనివల్ల సంవత్సరానికి సుమారు రు. 40 లక్షల విదేశీ మారక ద్రవ్యం లభిస్తున్నది. అంతవరకు బాగానే వుంది. కాని రాష్ట్రంలో అభ్రకం మీద ఆధారపడిన పరిశ్రమ ఏదీ స్థాపించబడకపోవడం విచారకరం. మైకాతో తయారైన అనేక వస్తువులను మనం ఏటేటా దిగుమతి చేసుకుంటున్నాం. మైకాను మనం ఎగుమతి చేస్తున్నాం. అందువల్ల అభ్రకం వినియోగించుకునే పరిశ్రమలను వెంటనే మనం ఏర్పాటు చేసుకోవడం చాలా అవసరం. ప్రస్తుతం ఆంధ్ర ప్రదేశ్ మైనింగ్ కార్పొరేషన్ వారు అభ్రకపు ఇటుకల ఫ్యాక్టరీని స్థాపించడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇది మనకే ఆశాజనకమైన అభివృద్ధి కార్యక్రమం.

ఆస్‌బెస్టాస్ :

ఆస్‌బెస్టాస్ సిమెంటు రేకులు యిప్పుడు విరివిగా వాడబడుతున్నవి. ఈ రేకులు తయారుచేయడంలో 10-15 శాతం ఆస్‌బెస్టాస్ పీచు ఉపయోగిస్తున్నారు. క్రిసోటైల్, ఆంఫిబోల్ అనే రెండు రూపాలలో ఆస్‌బెస్టాస్ లభిస్తున్నది. ఇందులో మొదటిది నాణ్యతలో చాలా మెరుగైనది. ఆస్‌బెస్టాస్ యితర గుణాలతో పాటు, దానిలోని గట్టిదనం మీద దాని ఉపయోగం ఆధారపడి వుంటుంది. క్రిసోటైల్ రకంయొక్క-గట్టిదనం చదరపు అంగుళం 1 కి 80 వేల నుండి లక్షపౌనుల వరకు వుంటుంది. ఇక రెండవరకం ఆస్‌బెస్టాస్ గట్టిదనం చ. అం. 1 కి వెయ్యినుండి 8 వేల పౌనుల వరకే వుంటుంది. ఆంధ్ర ప్రదేశ్‌లో, దేశంమొత్తంమీద ఉత్పత్తి అయ్యే క్రిసోటైల్ ఆస్‌బెస్టాస్ పీచులో విలువను బట్టి 70 శాతంవరకు వుంటుంది. ఉత్పత్తి సంఖ్యలు మాత్రం చాలా తేడాతో మారుతుంటాయి.

ఆస్‌బెస్టాస్‌కు దేశంలో గిరాకీ బాగా పెరుగు తున్నది. 1964-65లో రు. 4 కోట్ల విలువగల 39,000 టన్నుల సరుకు దిగుమతి అయింది. ఈముడి పదార్థంకాక ఆస్‌బెస్టాస్ వస్తువులు సుమారు రు. 1.18 కోట్ల విలువగల 1800 టన్నులు దిగుమతి చేసుకోబడినవి. సంవత్సరానికి ఆస్‌బెస్టాస్ ఉత్పత్తి 6 వేల టన్నుల వరకు పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. దీనితోపాటు ఆస్‌బెస్టాస్‌కు సంబంధించిన పరిశ్రమలు నెలకొల్పడానికి కూడా కృషి జరుగవచ్చు.

బ్యారైట్స్ :

రసాయనముల తయారీలోనూ, పెయింట్లు తయారీలోనూ, నూనె త్రవ్వకంలోనూ వినియోగించే బేరియం సల్ఫేట్ యొక్క ఖనిజ రూపమే బ్యారైట్స్. మన రాష్ట్రంలో యిది కడప, అనంతపురం, కర్నూలు, ఖమ్మం జిల్లాల్లో లభిస్తుంది. దేశం మొత్తంమీద లభించే బ్యారైట్స్‌లో 90 శాతం మన రాష్ట్రంలోనే ఉత్పత్తి అవుతున్నది. ఇప్పుడు యీ ఖనిజంలో చాలా భాగం పెయింట్ల తయారీలోను, నూనె త్రవ్వకంలోనూ ఉపయోగ పడుతున్నది. ఏటేటా సుమారు రు. 30 లక్షల విలువ గల బేరియం రసాయినిక ద్రవ్యాలను మనం దిగుమతి చేసు కుంటున్నాము. బేరియంకెమికల్స్ లిమిటెడ్ అనే ఒక ప్రైవేటు సంస్థ యిటీవల ఖమ్మంజిల్లా కొత్తగూడెంలో బేరియం పదార్థాల ఉత్పత్తికి పూనుకున్నది.


బాల్‌క్లే :

పింగాణి పరిశ్రమలోనూ, ఇన్సులేటర్ పరిశ్రమలోనూ ఉపయోగ పడే ప్రత్యేక రకం మట్టిని "బాల్‌క్లే" అంటారు. దీని వినియోగదారులు ఏటేటా రు. 8 లక్షల విలువగల సుమారు 4 వేల టన్నుల మట్టిని దిగుమతి చేసు కుంటున్నారు. ఇటీవల ఆంధ్ర ప్రదేశ్ మైనింగ్ కార్పొరేషన్‌వారు జరిపిన


(తరువాయి 24వ పేజీలో)




విజయవాడలో ఏప్రిల్ 18 వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రాంతీయ వర్కుషాపుకు ప్రారంభోత్సవం చేస్తున్న ముఖ్యమంత్రి.




ఇటీవల ముఖ్యమంత్రి తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించిన సందర్భంలో మురమ్నాథ గ్రామాన్ని చేరడానికై గోదావరి నదిని దాటుతున్న దృశ్యం.




ముఖ్యమంత్రి ఏప్రెల్ 22న మంచిర్యాలలో గంగారెడ్డి స్మారక వైద్యాలయానికి ప్రారంభోత్సవం చేస్తున్నప్పటి దృశ్యం.



ముఖ్యమంత్రి ఏప్రెల్ 21వ తేదీన ఆదిలాబాదు ప్రభుత్వ ఆసుపత్రిలో పెడియాట్రిక్ వార్డుకు శంకుస్థాపన చేస్తున్నప్పటి దృశ్యం.




హైదరాబాదు, రాజేంద్రనగర్‌లోని సమాజ వికాసం తాలూకు నేషనల్ ఇనిస్టిట్యూట్‌లో పునశ్చరణ-వృత్తి శిక్షణ కార్యక్రమానికి ఏప్రెల్ 28న ప్రారంభోత్సవం జరిగినప్పుడు సమాచార, కార్మిక శాఖా మంత్రి శ్రీ బి. వి. గురుమూర్తి అధ్యక్షోపన్యాసం చేస్తున్న దృశ్యం. ఈ శిక్షణ కోర్సుకు డా. జి. జాకోబ్ డీన్, ప్రారంభోత్సవం జరిపారు.




ఖైరతాబాదు...


ఫైన్వాస్ నీటి సరఫరా పథకానికి ఏప్రెల్ 22న ముఖ్యమంత్రి శంకుస్థాపన జరిపినప్పటి చిత్రం.



ఆదిలాబాదులో ఏప్రెల్ 21న ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల భవనానికి శంకుస్థాపన జరిపిన ముఖ్యమంత్రి.



ముఖ్యమంత్రి ఆదిలాబాదులో ఏప్రెల్ 21న జిల్లా పరిషత్తు కార్యాలయ భవనానికి ప్రారంభోత్సవం జరిపినప్పటి చిత్రం.




జిల్లా పరిషత్తు కార్యాలయ భవనం.




ఆర్థిక, పరిశ్రమల శాఖామంత్రి డా. ఎం. చెన్నారెడ్డి ఏప్రెల్ 24న మేడ్చల్‌లో బ్లాకు సమాచార కేంద్రం భవనానికి శంకుస్థాపన జరిపినప్పటి చిత్రం.




ముఖ్యమంత్రి శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి కృష్ణాజిల్లా, పామర్రు గ్రామంలో ఏప్రెల్ 18న మంచి నీటి సరఫరా పథకానికి శంకుస్థాపన జరిపినప్పటి చిత్రం.




గుంటూరు జిల్లా మామిడి కోదూరు గ్రామంలో పంచాయితీ భవనానికి ఏప్రెల్ 16న ప్రారంభోత్సవం జరుపుతున్న ముఖ్యమంత్రి.




ఆర్థిక, పరిశ్రమల శాఖామంత్రి డా. ఎం. చెన్నారెడ్డి మే 3న వికారాబాదులో మంచి నీటి సరఫరా పథకానికి శంకుస్థాపన జరిపినప్పటి చిత్రం.




హైదరాబాదు, లింగంపల్లి వద్దగల వంతెనకు ఏప్రెల్ 28వ తేదీన ప్రారంభోత్సవం జరుపుతున్న ముఖ్యమంత్రి.




ఏప్రెల్ 23న నాగార్జున కొండమీద పురావస్తు ప్రదర్శనశాలకు ప్రారంభోత్సవం జరుపుతున్న కేంద్ర విద్యామంత్రి శ్రీ ఎం.సి. చాగ్లా. ఈ ప్రారంభోత్సవానికి ఆహార, నీటి పారుదల శాఖా మంత్రి శ్రీ ఎ.సి. సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు.




ముత్తూరు గ్రామంలో ఏప్రెల్ 15 న శ్రీ కె. బ్రహ్మానందరెడ్డిని గ్రామ ప్రజలు ఘనంగా ఊరేగిస్తున్న దృశ్యం.




ముఖ్యమంత్రి ఏప్రెల్ 15 న గుంటూరుజిల్లా ముత్తూరులోగల సెయింట్ జేవియర్స్ కాన్వెంటు పాఠశాలను సందర్శించినప్పటిచిత్రం




శ్రీమతి రాఘవమ్మా బ్రహ్మానందరెడ్డి ఏప్రెల్ 15 న గుంటూరులో పోలీసు బాలుర వసతిగృహానికి శంకుస్థాపన జరిపినప్పటి చిత్రం.




గుంటూరులోని శ్రీకృష్ణ హరిజన పారిశ్రామిక పాఠశాలలో సిమెంటు గొట్టాల్ని తయారుచేసే యంత్రానికి ఏప్రెల్ 15 న ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం జరుపుతున్నప్పటి దృశ్యం.




ప్రముఖ హార్మనీ విద్వాంసుడు శ్రీ ఎస్. అంబాప్రసాద్ నాయుడు షష్ఠిపూర్తి సందర్భంలో ఏప్రెల్ 2 న రవీంద్రభారతిలో ఉపన్యసిస్తున్న ముఖ్యమంత్రి.



రాష్ట్ర హోంమంత్రి శ్రీ మీర్ అహమ్మద్ అలీఖాన్ మే 4న బేగంపేట విమానాశ్రయంలో సంయుక్త అరబ్ రిపబ్లిక్ మంత్రి డాక్టర్ ఎ. ఆర్. టూర్కీకి స్వాగతం చెప్పినప్పటి చిత్రం.



మెకాంగ్ కమిటీ సభ్యులు ఏప్రిల్ 9న నాగార్జున సాగర్ ఆనకట్టను సందర్శించినప్పటి చిత్రం.



శ్రీశైలం ఆనకట్ట ఇంజనీర్లతో కృష్ణాజిల్లా పాత్రికేయులు. సమాచార, పౌర సంబంధశాఖ ప్రారంభించిన అంతర్ రాష్ట్ర పర్యటన పథకంక్రింద ఈ పాత్రికేయులు యిటీవలే కర్నూలు జిల్లాలో పర్యటించారు.



విజయవాడలో ఏర్పాటు చేసిన పారిశ్రామిక ప్రదర్శనలో పరిశ్రమల శాఖవారి స్టాలును సందర్శిస్తున్న రాష్ట్ర ఆర్థిక, పరిశ్రమల శాఖా మంత్రి డా. ఎం. చెన్నారెడ్డి.






తూర్పుగోదావరి జిల్లా మారేడు మిల్లిలో కాఫీతోటలు.




శ్రీమతి పొన్నమ్మ థానుపిళ్ళె హైదరాబాదులో గల జ్వరచికిత్స ఆసుపత్రిలో ఏప్రెల్ 27 న సంక్షేమ కేంద్రానికి ప్రారంభోత్సవం జరిపినప్పటి చిత్రం.




సరోజనీదేవి హాలులో మే 9 వ తేదీన జరిగిన శ్రీ గోపాలకృష్ణ గోఖలే శతజయంత్యుత్సవాలకు అధ్యక్షత వహించిన సాంస్కృతిక శాఖామంత్రి శ్రీ పి.వి.జి. రాజు.

ఉత్తమ చలనచిత్రాలకు రాష్ట్ర ప్రభుత్వ బహుమతులు





సినీ కళాకారులకు స్వాగతం పలుకుతున్న సమాచార శాఖ మంత్రి శ్రీ బి. వి. గురుమూర్తి.




బహుమతీ ప్రదానోత్సవ సభలో ప్రసంగిస్తున్న ఆర్థిక, పరిశ్రమల శాఖా మంత్రి డా. ఎం. చెన్నారెడ్డి.

ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో కన్నుల పండువుగా జరిగిన ఉత్సవ దృశ్యాలు.






ఆ సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి.




బాలల చిత్రాల్ని నిర్మించవలసిన అవసరాన్ని గుర్చి రాష్ట్ర గవర్నరు నొక్కి వక్కాణించారు.



సభకు విచ్చేసిన కొందరు ప్రేక్షకులు.



చలన చిత్ర పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సహాయ, సహకారాలకు కృతజ్ఞత తెలియజేస్తున్న అఖిల భారత చలన చిత్ర సమాఖ్య అధ్యక్షుడు శ్రీ ఎ. ఎల్. శ్రీనివాసన్.



ఉత్తమ చలన చిత్రం అంతస్తులకు గవర్నరు బంగారునంది బహుమతిని అందుకుంటున్న జగపతీ పిక్చర్స్ నిర్మాత శ్రీ వి. రాజేంద్ర ప్రసాద్.

అడవిమల్లె

14

గౌరి పూర్ణఆరోగ్యవంతురాలు కావటానికి పదిహేను రోజులు పట్టింది. ప్రకాశం, చంద్రం, ఇద్దరుకూడా ఎంతో శ్రద్ధగా ఆమెకు సేవలుచేశారు. మళ్లీ తనను శరణాలయానికి పంపించరు అనే నమ్మకం కుదిరినాకనే ఆమె ఆరోగ్యం పుంజుకుంది. అది ప్రకాశం, చంద్రం తెలుసుకోకపోలేదు.

చంద్రంకంటే ప్రకాశం దగ్గర గౌరికి చనువు ఎక్కువ. ముభావంగా కనిపించే చంద్రం అంటే ఆమెకు గుండెలో ఎక్కడో ఓమూల భయం బిడాయించుకుని కూర్చుంది.

ఒక రోజు ప్రకాశం అడిగితే గౌరి శరణాలయ జీవితంగురించీ, ముఖ్యంగా ఆరోజు తను గోడదూకి పారిపోవటం గురించీ చెప్పింది.

అక్కడ వాళ్లకు పెట్టే తిండీ, వాళ్ల యెడల అధికారులు చూపే నిరాదరణా, తిరస్కారం గురించి ఆమెకు చాతనయిన ధోరణిలో చెప్పింది. ముఖ్యంగా గౌరి గోడదూకి పారిపోవటానికి కారణ భూతమైన సంఘటన చంద్రాన్ని వేధించింది.

గౌరి జూనియర్ మెట్రిక్‌లోవుంది. కొంచెం మొండి ఘటం. అప్పుడప్పుడు ఎదురుతిరిగి మాట్లాడి మాట్రిన్‌చేత, సూపర్నెంటుచేతా దెబ్బలు తినేది. అధికారులే కాకుండా, వయస్సులో వున్న కొందరు ఆడ పిల్లలు కూడా చిన్న పిల్లల మీద అధికారం చేసేవారు.

> **జరిగిన కథ**
>
> చిన్ననాడే తల్లిదండ్రులు లేని చంద్రం వదినెద్వారా దొంగగా నిరూపించబడి, తీవ్రంగా శిక్షింపబడి అమాయకపు స్త్రీ అయిన గౌరి సహాయాన బయట పడతాడు. ప్రకాశంను ఆత్మహత్య స్థితినుంచి తప్పించి అతని తండ్రి ఆదరణ ద్వారా చాల గొప్ప స్థితిలోకొస్తాడు. అతడు తన ఊరికి వచ్చి జరుగుతున్న మార్పులను పరిశీలిస్తాడు. గౌరిని అనాధ శరణాలయంలో చేరుస్తాడు. అన్నను చూడడానికి వెళ్లి వ్యాపార సంస్థ అభివృద్ధిని గమనిస్తాడు. రజనిని చూచిన తరువాత తాను చిరకాలం నుంచి కలుసుకోవాలనుకున్న హేమను కూడా కలుసుకుంటాడు. తనను కలిసేందుకు వచ్చిన గౌరిని చంద్రం ప్రకాశం ఇంటికి తీసుకు వెడతాడు. అక్కడ గౌరి లేవలేని స్థితిలో ఉండగా, చంద్రం ప్రకాశంలు చాల సహాయం చేస్తారు.

ఆరోజు పొద్దుట లేస్తూనే సూపర్నెంటు గౌరికోసం కబురు పెట్టింది. గౌరి భయపడుతూ సూపర్నెంటు గదికి వెళ్ళింది. గౌరికి తను అంత ప్రొద్దుటే చేసిన అపరాధం ఏమిటో అర్థంకాక బిక్క మొహం వేసింది. గౌరి వూహించినట్లు సూపర్నెంటు ఆమెను చూడగానే కళ్లు వురమలేదు. ఆల్‌సేషన్‌లా గుర్రుమనలేదు. కనీసం పిల్లిలా 'కస్' మని కూడా అనలేదు. గౌరిని నవ్వుతూ దగ్గరకు పిలిచింది. సూపర్నెంటు నవ్వు ముఖాన్ని గౌరి ఏనాడూ చూసి ఎరగదు. అది చూసిన గౌరికి ఆమె నవ్వకుండా వుంటే బాగుండుననిపించింది. భయపడుతూనే ముందుకు రెండడుగులు వేసింది.

"ఇలా రా గౌరి! చూడు ఈ చీరా జాకెట్ బాగున్నాయా?" టేబుల్ మీద పెట్టి ఉన్న కాగితంపొట్లం విప్పింది సూపర్నెంటు.

పసుపు పచ్చ నైలాన్ చీర, అదే రంగు జాకెట్టు. గౌరి కళ్లు సంతోషంతో మెరిసిపోయాయి. అంతలోనే ఏదో అనుమానం ఆ సంతోషాన్ని వెనక్కు నెట్టి వేసింది.

"పిచ్చి పిల్లా ఎందుకు భయపడతావు. ఇవి నీకోసమే తెచ్చాను. చూడు బాగున్నాయేమో?"

గౌరి సంతోషంతో ముందుకు వెళ్ళి ఆచీరను చేత్తోతాకి చూసింది. ఆ స్పర్శ ఆమెను ఏదోలోకానికి లాక్కుపోయింది. ఇంత మంచి చీర తనకే? అవును తనకే ...అనుకుంది.

"వెళ్ళి త్వరగా తలకుపోసుకో. ఈ బట్టలు వేసుకుందువుగాని. ఇవ్వాళ నీ పుట్టిన రోజు" అంది సూపర్నెంటు.

వాసిరెడ్డి సీతాదేవి

ఇవ్వాళ తను పుట్టిన రోజా ? అంటే ? అయితే? ఇంతకు ముందు తనకు పుట్టిన రోజు గుర్తులేదేం మరి? అసలు సరిగ్గా ఎన్ని ఏళ్లో, ఏరోజు పుట్టిందో తనకెలా తెలుసు? గౌరి అమాయకపు బుర్ర ఆలోచించలేక ఆవిషయాన్ని వదిలేసింది.

ఆ కమలకీ, సుందరికీ బలేగర్వంలే! సూపర్నెంటు. ఎప్పుడూ వాళ్ళనే ప్రేమగా చూస్తుందని. మంచి బట్టలు కూడ తెచ్చిఇస్తుంది వాళ్లకు. కాని ఈ రోజు, తన కోసం తెచ్చిన చీరంత మంచి చీర ఇంత వరకు ఇక్కడ ఎవరూ కట్ట లేదు. గౌరి కళ్లుమూసుకొని తలంటి పోసుకుంటూంటే ఆ మూసిన కళ్లలో పచ్చనైలాన్ చీరనుంచి అలలు లేచి లేచి పడుతున్నాయి.

కొత్త బట్టలు ధరించి గౌరి ఆరోజంతా కొత్తగా రెక్కలు వచ్చిన పక్షి పిల్లలా గెంతుతూ తిరిగింది. కమలా, సుందరీ, ఇంకా కొంత మంది పెద్ద పిల్లలు గౌరిని చూసి అదోలా నవ్వారు. వారి కళ్లలో కనుపించిన అసూయకు జవాబుగా గౌరి గర్వంగా చిరునవ్వులు విసిరింది.

సూపర్నెంటు ఆరు గంటలకు గౌరికి కబురు పంపించింది. గౌరి ఉత్సాహంగా ఆమె గదికి వెళ్ళింది.

"ఎంత అందంగా వున్నావో తెలుసా. ఇవ్వాళ నీవు సినిమాకు వెళతావా ?" అంది సూపర్నెంటు ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ.

పెద్దమ్మగారి ఆప్యాయతను చూర గొన్న పెద్ద పిల్లలు అప్పు డప్పుడు సిని మాలకు వెళుతుండటం తెలుసు గౌరికి. సంతోషంతో తల గిర గిర ఆడించింది గౌరి. అయితే తనకు ఇక నుంచి సిని మాలూ ... ... మంచి మంచి చీరలూ సెంట్లూ .... పౌడర్లూ .... అబ్బో ఎన్నో ఎన్నో ... . గౌరి గాలిలో తేలి పోతున్నట్లు అనుభూతిని పొందింది.

మేట్రన్‌తో రిక్షాలో కూర్చున్న గౌరి కళ్లు ఇంతంత చేసుకొని రోడ్డు మీద నడిచే జనాన్ని, రోడ్డు పక్క రక రకాల కొట్లనూ చూస్తూ తన్మయత్వం పొంద సాగింది.

రిక్షా ఒక పెద్ద హోటల్ ముందు ఆగింది. మేట్రన్ దిగి గౌరిని దిగ మన్నది.

"ఇది సినిమా హాలా ?" అంది గౌరి ఆశ్చర్యంగా—సినిమాకు అని చెప్పి హోటల్‌కు ఎందుకు తీసుకొని వచ్చిందో అర్థంకాక.

"సినిమాకు వెళ్దాంలే. తొందరేమీ కాదు. ముందు కాఫీ తాగుదాం పద " అంది మేట్రన్.

గౌరి మేట్రన్ వెనకే హోటలు మేడ మీదకు దిక్కులు చూస్తూ నడిచింది. మేట్రన్‌తో ఒక గదిలో ప్రవేశించిన గౌరి అమాయకపు బుర్ర అయో మయంలో పడింది.

గదిలో పొద్దుట తమ శరణాలయం తనిఖీకి వచ్చిన ఆఫీసరు వున్నాడు. ఆ ఆఫీ సరు చిరునవ్వుతో లేచి గౌరిని సమీ పించాడు. గౌరి గాభరాగా వెనక్కు తిరి గింది మేట్రన్ కోసం. అప్పటికే అక్కడనుంచి మేట్రన్ తప్పుకుంది. తలుపుకూడా బయటనుంచి వేసింది. అంత పెద్ద ఆఫీసరు ముందుకు రాగానే కలిగిన గాబరాలో గౌరి ఇదేమీ గమ నించలేదు. ఆ ఆఫీసరు గౌరి రెక్క పట్టుకొని అనునయంగా కూర్చో బెట్ట బోయాడు. తనకు ఏదో జరగరాని అన్యాయం జరుగబోతుందని మాత్రం అర్థం అయింది గౌరికి. గౌరి ఆ ఆఫీస రుతో పెనుగులాటలో పక్కనే టేబుల్ మీదవున్న గాజు కూజాను నేలమీద కొట్టింది. తత్తర పాటుతో వేసిన కాళ్లో గాజుపెంకులు గుచ్చుకొని ఆఫీసరు తలుపు తియ్యమని కేక పెట్టాడు. తలుపు తెరుచుకుంది. గౌరి మెరుపులా పరిగెత్తింది.

శరణాలయం చేరుకున్న గౌరి, పిల్లి నోటికి చిక్కి గాయ పడ్డ పక్షిలా వణికి పోతూ సూపర్నెంటు గదిలోకి వెళ్ళింది. గౌరి వాలకంచూసిన సూపర్నెంటు గాబరాపడింది. గౌరి ఏడుస్తూ జరిగిం దంతా చెప్పింది. మరో క్షణంలో సూపర్నెంటు గౌరి జుట్టు పట్టుకొని వంచి కక్షగా వీపుమీద బాదింది. ఒక గదిలో



పెట్టి తాళం వేసింది. ఆ రాత్రి భోజనం లేదు. చీకటి గదిలో, ఆకలి కడుపుతో ఏడుస్తూ కూర్చున్న గౌరికి ఇక తను ఆ శరణాలయంలో వుండటం అంతమంచిది కాదని తోచింది. తెల్లవారు ఝామున గౌరి స్నేహితురాలు తలుపు తీసింది. గౌరి పారిపోవటానికి ఆ అమ్మాయి సహాయం చేసింది.

ఆ తరువాత కథ చంద్రానికీ, ప్రకా శానికీ తెలిసిందే చంద్రానికి గౌరి అంటే జాలికలిగింది. తను ఆమెయెడల చూపిన నిరాదరణను తలచుకొని బాధ పడ్డాడు.

"అయితే గౌరీ! ఆరోజు నేను ఆ ఇంట్లో వున్నట్లు నీ కేలా తెలిసింది ?" చంద్రం ప్రశ్నించాడు.

"శరణాలయం నుంచి నేను పారి పోయాను కాని చాటు చాటుగా నిన్ను వెంబడిస్తూనే వున్నాను. నువ్వు ఇంటికి

వెళ్ళగానే నా పెట్టె తీసుకొని వెళ్ళి పోవాలనుకున్నాను. నువ్వు బొగ్గు కంపెనీ నుంచి ఎవరితో కార్లో వెళ్ళిపోయావు. ఎక్కడికు వెళ్ళావో తెలియక బిక్క మొహంతో నిలుచున్నాను. ఇంతలో నాగేంద్రం వచ్చి తనతో వస్తే నిన్ను చూపిస్తానన్నాడు.''

''నాగేంద్రం నీకు అంతకు ముందే తెలుసా ?'' చంద్రం విస్తుపోతూ ప్రశ్నించాడు.

''తెలుసు. ముందు నన్ను నాగేంద్రం, ఆదెమ్మా పెంచారు,'' అంటూ గౌరి ఆ నాటి రాత్రి తను విన్న విషయం, అంతా చెప్పింది. కాని గౌరి తను ఒక అబ్బాయిని కట్లు విడిపించానన్న విషయం మాత్రం చెప్పలేదు.

''అయితే ఆ డబ్బు నాగేంద్రం తీశాడన్న మాట ?'' అన్నాడు ప్రకాశం.

''నాకు మొదటినుంచీ వాడిమీదే అనుమానం.'' అన్నాడు చంద్రం.

''గౌరికూడా ఏ పెద్దయింటి బిడ్డో అయివుండొచ్చు.'' అన్నాడు ప్రకాశం సాలోచనగా. చంద్రం ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు. ఆ డబ్బు విషయం ముందుగానే వీళ్లకెలా తెలిసిందో అనుకుంది గౌరి. తెలుసుకాబోలు అనిసరి పెట్టుకుంది అంతకంటె ఆలోచనరాని గౌరి.

* * * *

ప్రకాశం స్థలంలోనే ఒక చిన్న నిట్టాడి గుడిసెలో వుంటున్న రాజవ్వ దగ్గర గౌరిని పెట్టాడు ప్రకాశం. వయస్సులో వున్న ఆడపిల్ల పెద్దవాళ్ళెవరూ లేకుండా తనతో నివసించడం ఆ అమ్మాయి భవిష్యత్తుకు మంచిది కాదని ఆలోచించిన ప్రకాశం ఈ ఏర్పాటు చేశాడు. భోజనం వగైరా అంతా ప్రకాశం ఇంట్లోనే. గౌరి వచ్చినప్పటి నుంచీ రాజవ్వ భోజనం కూడా ప్రకాశం ఇంట్లోనే. రాజవ్వ వంటా అదీ చేసి పెట్టి పొగాకు కంపెనీకి పనికి వెళుతుంది. గౌరి రాజవ్వకు పని సాయం చేస్తూ వుంటుంది. పగలంతా ఇల్లు సర్దటం సాయంకాలం వంటచెయ్యటం గౌరివంతు. ప్రకాశం ఎప్పుడూ ఎవరితోనూ బయట తిరుగుతూనే వుంటాడు. చంద్రం మాత్రం ఎక్కువ ఇంట్లో వుంటాడు. కాని మౌనంగా ఏవేవో పుస్తకాలు చదువుకుంటూ వుంటాడు. గౌరితో ఎక్కువగా మాట్లాడడు. గౌరికి కూడా చిన్న చిన్న పుస్తకాలు తెచ్చి ఇచ్చి చదువుకోమని చెబుతూండేవాడు. గౌరికి చంద్రంతో మాట్లాడటం ఇష్టం.

ఆ వాతావరణంలో గౌరికి అంతకు ముందు తనకు తెలియని ఎన్నో విషయాలు తెలుస్తున్నట్లు అనిపించసాగింది. గౌరి త్వరలోనే ఆ గూడెం వాళ్ళందరికీ ప్రియపాత్రురాలయింది. లీడరన్నకు కావల్సిన వాళ్ళంతా ఆ గూడెం వాళ్ళ గుండెల్లో ప్రాణం లాంటివారే. సాయంత్రం అయేటప్పటికి ఆ గూడెం పిల్లలంతా గౌరి చుట్టూ చేర్తారు. గౌరి వాళ్ళతో ఆడుకుంటూ వాళ్ళకు కథలు చెబుతూ వుంటుంది. గౌరి ఆనందంచూసి ప్రకాశం సంతృప్తిగా నిట్టూర్చేవాడు.

మరో రెండు నెలలుపోతే ట్యుటోరియల్ కాలేజీలో చేర్పించి గౌరికి చదువు చెప్పించటానికి నిర్ణయించుకున్నాడు ప్రకాశం. ఆ నిర్ణయం విని చంద్రం ఎంతో సంతోషించాడు. ఆ రెండు నెలలూ గౌరికి చదువు చెప్పమని చంద్రానికి చెప్పాడు ప్రకాశం.

ప్రకాశం గౌరిని వివాహం చేసుకుంటె బావుణ్ణు! అనుకున్నాడు చంద్రం.

ఆ సాయంత్రమే చంద్రం గౌరికోసం మంచి మంచి చీరలు కొని తెచ్చాడు. తన ప్రకాశం భార్యగా వూహించుకున్న గౌరిని శరణాలయం బట్టల్లో చూట్టం ఇష్టంలేక పోయింది చంద్రానికి. ఈ విధంగా నన్నా ప్రకాశం ఓ ఇంటివాడైతే తనకు అంతకంటే సంతోషం కలిగించేది మరోటి లేదు.

ప్రకాశం మరోలా వూహించుకొని ఆనందించాడు. చంద్రం ఈ విధంగా నన్నా సుఖపడితే అదేచాలు ననుకున్నాడు. గౌరికి చంద్రం అంటే చాలా ఇష్టం అన్న విషయాన్ని ప్రకాశం ఏనాడో గ్రహించాడు. కాని చంద్రం మనస్సే అర్థంకాలేదు ప్రకాశానికి.

మొదటినుంచీ సభ్యసమాజానికి దూరంగా పెరిగిన గౌరికి కృత్రిమ మర్యాదలూ, నాగరికతా తెలియవు. అందువల్లనే ఆమెకు ప్రకాశంను ప్రకాశం అనీ, చంద్రాన్ని, చంద్రం అనీ పిలవటానికి అట్టే కాలం పట్టలేదు. ప్రకాశం దగ్గర గౌరికి మరీ చనువు. కాని చంద్రం అంటే ఆమెకు ఓ విధమైన భయం. గౌరికి తనంటే ఇష్టమనీ, ఆ ఇష్టం ఇంకే రూపాన్నయినా ధరించగలదనీ తెలుసుకున్న చంద్రం గౌరితో అంత చనువుగా వుండటం మంచిది కాదని ముభావంగా వుండేవాడు.

ఆ రోజు ప్రకాశం ఊరికి వెళ్లటానికి తయారవుతున్నాడు. గౌరి ప్రకాశం బట్టలూ, సామానూ, సూట్‌కేసులో సర్దుతూంది. అప్పుడే మికారుకు వెళ్లిన చంద్రం తిరిగి వచ్చాడు.

"చంద్రం! నేనొక అర్జంటు పనిమీద తెనాలి వెళ్ళుతున్నాను. ఎల్లుండికి వచ్చేస్తాను" అన్నాడు ప్రకాశం అద్దం ముందు నిల్చొని తలదువ్వుకుంటూ.

"నేను కూడా రేపు వెళ్ళిపోతున్నాను. ఆ విషయం నీకెలా చెప్పటమా అని ఆలోచిస్తూ వున్నాను" అన్నాడు చంద్రం ఉదాసీనంగా.

ప్రకాశం ఓ క్షణకాలం పాటు చంద్రం ముఖంలో విస్తుపోయి చూశాడు.

"నువ్వు వెళ్లిపోతావా? ఎక్కడకు?"

"విధి ఎక్కడకు తీసుకెళితే అక్కడకే; నేను వచ్చిన పని అయిపోయింది''.

"ఏమిటావని ?'' కొంచెం మందలిస్తున్నట్లున్న స్వరంతో అడిగాడు ప్రకాశం.

"కేవలం నిన్నూ, నాన్నను చూడాలనీ, మా అన్నయ్యకు నేను దొంగిలించానని భావించిన డబ్బు తిరిగి ఇచ్చేయాలనీ వచ్చాను. అనుకోకుండ అయిన

వాళ్ళంతా దగ్గరయి మళ్ళీ ఇట్టే దూరం అయారు. నాన్నను చూడలేక పోయాను. నిన్ను చూశాను.''

సామాను సర్దుతున్న గౌరి చేతులు పని మానేశాయి. ఆదుర్దాగా చంద్రం ముఖంవైపు చూస్తూ వుండిపోయింది. అది గమనించిన చంద్రం ''పిచ్చిపిల్ల! ఏమిటో ఈ అనుబంధం?'' అనుకున్నాడు మనసులోనే.

ప్రకాశం మాట్లాడలేదు. అతని మౌనాన్ని అంగీకారంగా తీసుకున్నాడు చంద్రం. మనసు ఎందుకో చివుక్కుమంది.

"ప్రకాశం! నీ ఋణం నేను ఇంకా నాలుగు జన్మలెత్తినా తీర్చుకోలేనిది. కాని ఒకటి చేశాను నీ అనుమతి లేకుండా."

"ఏమిటి!'' ప్రకాశం గొంతులోని తీవ్రతక్కు గౌరి పెద్ద కళ్ళు ఇంకొంచెం పెద్ద వయాయి. ప్రకాశం ముఖంలోకి ఆందోళనగా చూసింది.

''నా పేరున ఢిల్లీ బ్యాంకులో వున్న పది వేల రూపాయలు ఇక్కడ బ్యాంకుకు ట్రాన్సుఫర్ చేయించాను. అవి నీ పేరున వేశాను.''

"మహా గొప్పపని చేశావు. మా అప్పును చక్రవడ్డీకట్టి తీర్చినట్లున్నావు.'' ఉబికి వస్తున్న కోపాన్ని అణచుకుంటూ అన్నాడు ప్రకాశం.

''నన్ను అపార్థం చేసుకోకు ప్రకాశం. మానవుడు ఎప్పుడూ ఆత్మసంతృప్తికోసం, ఆనందంకోసం పాకులాడుతాడు. చిన్నప్పటినుంచీ నేను అన్ని ఆనందాలకూ దూరంగానే పెరిగాను. మానవుడు నా అనే వ్యక్తులకోసం బతుకుతాడు. తన కోసం తను బతకడు. తన సంపాదనతో, తనుచేసేపనులతో తనవారిని ఆనందపరచి తను ఆనందపడాలని తాపత్రయ పడతాడు. నాకు నీకంటే ఎవరూలేరు. నాకాడబ్బు ఒక సత్కార్యానికి లభించింది. దాన్ని నేను వాడుకోవటంలో నాకు ఆనందంవుండదు. నావాళ్లకు దాన్ని ఇవ్వగలిగితేనే నాకు ఆనందం. కాదనకు ప్రకాశ్'' అంటూ చంద్రం ప్రాధేయ పూర్వకంగా యాచించాడు.

''పోనీయ్ ఆ డబ్బుతో గౌరిని చదివించు. ఆమెకోసం ఖర్చుచెయ్యి."

ప్రకాశం ఆలోచిస్తూ కూర్చున్నాడు.

"ఇంకొక విషయం. నా ఆస్తినంతా నీపేరనే వ్రాశాను. ఇవాళ్లే రిజిస్ట్రేషన్ కూడా అయిపోయింది. ఆ డబ్బుతో గౌరిలాటి కొందరు అనాథల్ని ఉద్ధరించు. సత్కార్యానికి వుపయోగించు. ఈ విశాల ప్రపంచంలో నేను బతకగలను. నాకివన్నీ అక్కరలేదు" ప్రశాంతంగా చెప్పుకు పోతున్నాడు చంద్రం.

ప్రకాశం ఒక్కసారిగా చంద్రాన్ని తన రెండు బాహువుల్లో బిగించాడు. ఉద్రేకం ఉదారత్వం రెండూ ఒకదాన్ని ఒకటి పెనవేసుకున్నాయి.

ప్రకాశం తనను తను సంబాళించుకొని వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు. చంద్రం, ప్రకాశం ముఖంలోకి అతని జవాబుకోసం ఆదుర్దాగాచూడసాగాడు.

ప్రకాశం ముఖంలో ఏదో నిర్ణయం కనిపించింది చంద్రానికి.

"నువ్వెంత ఇదిగా ఇస్తున్న దేన్నీ నేను కాదనలేను. ఆ దస్తావేజులు ఎక్కడ?'' చిరునవ్వుతో ఉత్సాహంగా అడిగాడు ప్రకాశం.

చంద్రం సంతోషంగా లోపలకు వెళ్ళి తన పెట్టెలో వున్న దస్తావేజులున్న కవరుతెచ్చి ప్రకాశంకు అందించాడు. అందుకోబోయిన ప్రకాశం చెయ్యి చటుక్కున వెనక్కు పోయింది. చంద్రం ప్రశ్నార్థకంగా చూశాడు.

''నాకు నువ్వొక మాటయివ్వాలి. అప్పుడే దీన్ని తీసుకుంటాను.'' అన్నాడు ప్రకాశం.

"ఏమిటది?'' సందేహిస్తూ అన్నాడు చంద్రం.

''ముందు చేస్తానని మాటయిస్తేనే చెబుతాను.''

''అలాగే చంపక చెబుదూ?''

"అలాగే అంటేకాదు. నా చేతిలో చెయ్యివేసి ప్రమాణంచెయ్యి.''

చంద్రం పక్కున నవ్వాడు. ప్రకాశం తెల్లబోయాడు. అయితే ఇదంతా చంద్రం తమాషాగాచేసిందేనా? ఎందుకు చేశాడు? తనకు డబ్బుమీద ఆశ వుందో లేదోనని పరీక్షించటానికా? ప్రకాశం ముఖం చిన్నబోయింది.

"ఏంరా ప్రకాశం? మొన్నను నేను విధి కర్మ, అన్నానని అంతపెద్ద ఉపన్యాసం దంచావే, మరి ఇప్పుడు నన్ను చేతిలో చెయ్యి వేసి ప్రమాణం చెయ్యిమంటున్నావు? అసలు కిటుకు అందులోనే వుంది. మనం ఎంత విజ్ఞానాన్ని ఆర్జించుకున్నా, ఆధునిక భావాలను అలవరచుకున్నా, పాశ్చాత్యభావ ప్రభావం ఎంత మన మీద పడినా, ఇలాంటి నమ్మకాలు మనకు తెలియకుండానే మన రక్తంలో జీర్ణించుకుని వుంటాయి. లేకపోతే నీలాటి వాడికి ఒట్టుమీద నమ్మకం ఏమిటోయ్, మనిషి మాటమీదవుండాలిగాని."

ప్రకాశం వాదనలో దిగేమూడ్‌లో లేదు. "ఏడిచావు లేరా? మరి నేను చెప్పినట్లు చేస్తావా?''

చంద్రం, ప్రకాశం చేతిని తన చేతిలోకి తీసుకుంటూ "నీవేం చెప్పినా చేస్తాను'' అన్నాడు.

"అయితే నువ్వు ఇక్కడనుంచి ఎక్కడకూ వెళ్లకూడదు. నువ్వు ఈ ఊరు వదలటంలోనే నీక్షేమం వుందని నేను అనుకున్న నాడు నేనే నిన్ను పంపిస్తాను. ఇక నుంచి నీవు నా రక్షణలో వుంటావు సరేనా''?.

ప్రకాశం మాటలకు చంద్రం జవాబు ఇవ్వలేక పోయాడు, తల వంచుకుని మౌనంగా కూర్చున్నాడు.

అంతవరకూ ఊపిరి బిగబట్టి స్నేహితులిద్దరి మాటలు శ్రద్ధగా వింటున గౌరికి చంద్రం ప్రస్తుతం ఎక్కడకూ వెళ్లటం లేదని మాత్రం అర్థమయింది. తేలికగా గాలి పీల్చుకుంది. అప్పుడు కాని ఆమెకు

వంటింట్లో పొయ్యిమీద మాడిపోతున్న కూర వాసన రాలేదు. గబగబా లేచి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

"ఏమిటిరా ఆ మౌనం, నీకు ఇష్టంలేక పోతే వెళ్ళిపో" అన్నాడు ప్రకాశం విసుగ్గా. "చాలా పెద్దశిక్షే విధించావు ప్రకాశ్'' అన్నాడు చంద్రం నీరసంగా.

"మరి నువ్వు నాకు చేసిన అన్యాయం చిన్న దనుకుంటున్నావా ? దానికి తగిన శిక్ష ఇదే. ఆ కాగితాలు ఇలాఇవ్వు'' అంటూ చంద్రం చేతులో కవరు అందు కున్నాడు ప్రకాశం.

"ఏరా చంద్రం, మళ్ళీ ఒక్క సార యిన హేమను చూట్టానికి వెళ్ళావా ?'' చంద్రం మనస్సును అర్థం చేసుకున్న ప్రకాశం ప్రశ్నించాడు.

హేమ పేరు వినగానే చంద్రం కళ్ళలో కదిలిన కాంతి రేఖలను గమనించాడు ప్రకాశం.

"ఏ ముఖం పెట్టుకొని హేమ దగ్గరకు వెళ్ళమంటావ్'' అన్నాడు చంద్రం చిన్న బుచ్చుకున్న ముఖంతో.

"నీకు అసలు వున్నదే ఒక ముఖం. అసలు వచ్చిన చిక్కే అది. ఏంచేస్తాం, అదే పెట్టుకొని వెళ్ళు. లోకంలో చాలా మందికి ఒక ముఖం కంటె ఎక్కువే వుంటాయి. ఎప్పుడు ఏది అవసరమో దాన్ని ధరిస్తూ వుంటారు. అలాటి వారే ప్రపంచంలో బ్రతకగలరు. వాళ్లనే లౌక్యం తెలిసినవాళ్లు అంటారు. అయినా నువ్వు తప్పేం చేశావని ? అసలు విష యంచెప్పు. హేమ అంత అర్థం చేసుకో లేని మూర్ఖురాలని నేను అనుకోను'' అన్నాడు ప్రకాశం.

ప్రకాశం ప్రోత్సాహంతో చంద్రం హృదయంలో ఆశలపందిరి వెల్లివిరిసింది.

"నాకు బండికి టైం అవుతుంది. నువ్వెళ్లి కాళ్లూ చేతులూ కడుక్కుని బట్టలు మార్చుకో భోజనం చేసేద్దాం'' అన్నాడు ప్రకాశం చంద్రం వీపుమీద చరుస్తూ.

"ఉండరా బాబూ'', అంటూవీపు తడుము కుంటూ నవ్వుతో బాత్‌రూమ్‌కు వెళ్ళాడు చంద్రం. టవల్‌తో ముఖం తుడుచుకుంటూ లోపలకు వస్తున్న చంద్రానికి కాగితాలు కాలుతున్న వాసన వచ్చి వంటింటి గడపలో నిల్చొని లోప లకు చూశాడు. ప్రకాశం కుంపటి దగ్గర కూర్చొని వున్నాడు. కుంపట్లో కాగి తాలు కాలుతున్నాయి. ప్రక్కన తను అంత క్రితం దస్తా వేజులు పెట్టి ఇచ్చిన కవరు పడివుంది. (సశేషం)

అధికోత్పత్తి కృషి

మన ఆహార సమస్యను అనతికాలంలో పరిష్కరించడానికి ఈ యేడాది నుంచి ఒక క్రొత్త వ్యూహం ప్రారంభం కాబో తున్నది. ప్రజలు, ప్రభుత్వం, అధికారులు చేసే సమన్విత కృషిపైనే ఈ వ్యూహం విజయం ఆధారపడివుంది.

ఎక్కువ దిగుబడినిచ్చే విత్తనాలను దేశంలో మొత్తం 60 లక్షల ఎకరాలలో ఉపయోగించడానికి నిర్ణయం జరుగగా, ఇందులో 26 లక్షల ఎకరాలకు పైగా భూమి కొత్త వరివంగడాలకోసం కేటా యించబడింది.

ఆంధ్రప్రదేశ్‌లో ఈ యేడాది ఆరు లక్షల ఎకరాల భూమిలో హెచ్చు దిగుబడి వరివిత్తనాలను వేయదలచినట్టు ముఖ్యమంత్రి తెలియచేశారు. ఏయే జిల్లాలలో ఎంతెంత భూమిని ఎక్క డెక్కడ ఈ కొత్త విత్తనాలకు కేటా యించాలి మొదలైన వివరాలుకూడా అప్పుడే రూపొందుతున్నాయి.

కొత్త వరి రకాలను ఉపయోగించ డంలో రైతుల శ్రద్ధాసక్తుల లోపం కూడా లేదు. ఒక గింజకు మరొక గింజను పండించడానికి వారెప్పుడు సంసిద్ధులే.

ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటించిన పార్లమెంటు సభ్యుల బృందం తైచుంగ్ నేటివ్ వరివంగడం సాగు చేసిన క్షేత్రాలను దర్శించి సంతృప్తి వెల్లడించింది. రైతుల ఉత్సాహోతిశ యాన్ని వారు కొనియాడారు.

అందుచేత రైతుల ఉత్సాహ లోపం లేదు. ఎరువులు, క్రిమి సంహారకౌష ధాలు, తదితర పరికరాల సరఫరా పరి స్థితి కూడా క్రిందటి సంవత్సరంలో కంటె కొంత సంతృప్తికరంగానే వుండ బో తున్నది. తైచుంగ్ నేటివ్ మొద లైన తక్కువ కాలపు, ఎక్కువ దిగుబడి విత్తనాలను సమృద్ధిగా సరఫరా చేయ డానికి కూడా చురుకుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇవన్నీ ఆశా జనక మైన అంశాలే.

— ఆంధ్ర జ్యోతి.

పారిశ్రామిక రేఖ

కేంద్ర రంగంలోని పరిశ్రమలు

కేంద్రరంగం క్రింద రాష్ట్రంలో నెల కొల్ప బడుతున్న ప్రాజెక్టులు 1965-66 లో అభివృద్ధి దశగా పురోగమిస్తున్నాయి. ఈ రంగం క్రింద రాష్ట్రంలో నెలకొల్ప బడిన ప్రాజెక్టులలో అత్యధిక పెట్టుబడి ప్రాజెక్టుగా చెప్పదగ్గ రామచంద్రాపురం లోని భారత్ భారీవిద్యుత్పరికరాల కర్మాగారానికి స్వర్గీయ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి ఈ సంస్థానికి విచ్చేసిన సందర్భంలో 1965 డిశంబరు 11న లాంఛనంగా ప్రారంభోత్సవం జరిపారు. ఈ విద్యుత్పరికరాల కర్మాగారానికి అను కునే ఎలక్ట్రికల్ స్విచ్ గేరుల్ని తయారు చేసే మరొక యూనిట్ నెలకొల్ప బడుతూవున్నది. హిందుస్థాన్ యంత్ర పరికరాల కర్మాగారానికి 1965 డిశం-బరు 27న ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు. దేశంలో వివిధ ప్రాంతా లలో నెలకొల్పబడుతున్న ఈ మాదిరి కర్మాగారాలలో యిది అయిదవది. సింథ టిక్ మందుల కర్మాగారం కూడా 1965 అక్టోబరు 15 నుంచి తొలిఉత్పత్తిని ప్రారంభించిది. ఈమూడు కేంద్ర ప్రాజె క్టులు వర్తమాన సంవత్సరంలో ఉత్పత్తిని ప్రారంభించడం చెప్పుకోదగ్గవిషయం.

ఎరువుల కర్మాగారాలు

విశాఖ పట్టణంలోని ఎరువుల కర్మా గారము, కొత్తగూడెంలోని ఎరువుల కర్మాగారము-యీ రెండు కర్మా గారాలు యిటు రాష్ట్రంలోను, అటు యావద్భారత దేశంలోనూ ఒక ప్రత్యేక తను కలిగి వున్నాయి. కోరమండల్ ఫెర్టిలైజర్స్ లి. వారు విశాఖ పట్టణంలో తమ కర్మాగారాన్ని నెలకొల్పు తున్నారు. నిర్మాణ కార్యక్రమం చురు కుగా సాగుతోంది. మరొక ఏడాదిలోగా యిది ఉత్పత్తిని ప్రారంభించవచ్చు. దీనికి కావలసిన విద్యుచ్ఛక్తిని, నీటిని సరఫరా చేయగలమని రాష్ట్ర ప్రభుత్వం హామీ యిచ్చింది. ఇకపోతే కొత్తగూడెం కర్మా గారం విషయంలో హిందుస్థాన్ ఎల్లై డ్ కెమికల్స్ అన్న సంస్థ రిజిస్టర్ అయింది. దీనికి కొంత ప్రభుత్వ స్థలంతో సహా వెయ్యి ఎకరాల స్థలాన్ని యివ్వడానికి ప్రభుత్వం అంగీకరించింది. దిగుమతుల మీద విపరీతంగా నిర్బంధాలు విధించబడిన దృష్ట్యా మరొకసారి పున రాలోచన జరిపి యింతకు పూర్వం అను కున్నట్టు బొగ్గును ఉపయోగించే బదులు నాఫ్థాను ఉపయోగించాలని నిశ్చ యించారు. దీనికి భారత ప్రభుత్వం అంగీక రించింది. అందు చేత త్వరలోనే యీ కర్మాగారం పని పూర్తయి, 1969 లో పునః ఉత్పత్తిని ప్రారంభించగలదు.

నూలు మిల్లులు

వర్తమాన సంవత్సరంలోనే సూళ్ళూరు పేట, హైదరాబాదులో గల రెండునూలు మిల్లులూ ఉత్పత్తి ప్రారం భించాయి. ప్రస్తుతం వున్న కొన్ని మిల్లుల్లో ఉత్పత్తి శక్తిని అధికం చేయడం జరిగింది. లైసెన్సు పొంది, యింకా నిర్మాణం పూర్తి కాని మిల్లుల ప్రగతినిగూర్చి ఎప్పటి కప్పుడు పరిశీలించడం జరుగుతున్నది. వీటిలో ఆరుమిల్లులైనా యీ ఏడాది ఉత్పత్తిని ప్రారంభించవచ్చు.

రాజమండ్రి, నెల్లూరు, కరీంనగర్ లలో సహకార నూలుమిల్లుల్ని నెలకొ ల్పేందుకు లైసెన్సులు మంజూరు చేయ బడ్డాయి. వాటాధనం సేకరణకు, యం త్రాల్ని పొందడానికి తగు చర్యలు తీసు కుంటున్నారు. కరీంనగర్ లో నెలకొల్ప దలచిన నూలుమిల్లు రామగుండంలో, నూలు పరిశ్రమవాడలో ఒక భాగంగా ఏర్పాటు చేయాలని ఉద్దేశించబడింది. భారత ప్రభుత్వ పునరావాస మంత్రి త్వశాఖ సహకారంతో వెయ్యి మంది తూర్పుపాకిస్థాన్, బర్మా, సింహళ కాంది శీకులకు దీనిలో ఉపాధి కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఈ పథ కానికి రూ 90 లక్షలు అవుతుందని అంచనా. భారత ప్రభుత్వ సహాయం విషయమై అక్కడ నుండి వారి అంగీకా రం లభించడంతో యీపథకాన్ని అమలు పరిచే చర్యలు గైకొనడం జరుగుతుంది.

ఇండియా డిటొనేటర్సు లిమిటెడ్

గత సంవత్సరం నుండి ఉత్పత్తిని ప్రారంభించిన ఇండియా డిటొనేటర్సు సంస్థ అమెరికా సంస్థ సహకారంతో

అధిక శక్తిగల ప్రేలుడు పదార్థాలను ఉత్పత్తి చేసే ప్లాంటును నెల కొల్పడానికి ఉద్దేశించినది. దీనికి అవసరమైన సౌకర్యాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. అమెరికాలోని ప్రముఖ పారిశ్రామిక సంస్థలలో ఒకటైన యూనియన్ కార్బైడ్ కంపెనీవారు హైదరాబాదులో డ్రై బ్యాటరీలు, మేంగనీస్ డయాక్సైడ్ ఉత్పత్తులకు చెందన ప్లాంటును నెలకొల్పడానికి యోచిస్తున్నారు. బొంబాయి, కలకత్తాలలో అనేక ముఖ్య పరిశ్రమలను నెలకొల్పారు.

సింగరేణి బొగ్గుగనులు

1964-65 సంవత్సరంలో సింగరేణి బొగ్గుగనుల సంస్థ యొక్క పెట్టుబడి ధనం, చెల్లింపు ధనం మొత్తాన్ని రు. 3.00 కోట్లనుండి రు. 5.58 కోట్లకు పెంచారు.

1964-65 లో 36.51 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగింది. గత సంవత్సరంలో 34.7 లక్షల టన్నుల ఉత్పత్తి జరిగింది. 1963-64 లో మొత్తం రు. 2.05 కోట్ల లాభం ఒనగూడగా 1964-65 సంవత్సరంలో రు. 2.08 కోట్ల లాభం చేకూరింది. కొత్తగూడెంలో థర్మల్ ప్లాంటును నెలకొల్పడంతో డిమాండు బాగా పెరుగుతుందని ఆశించబడుతోంది.

ఆజంజాహి మిల్సు

వరంగల్లులోని ఆజంజాహి మిల్స్ ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద బట్టలమిల్లు. ఇందులో 36000 కదుళ్లు 700 మగ్గాలు ఉన్నాయి. ఇందులో నెలకు 2000 బేళ్ల వస్త్రం 400 బేళ్లదారం ఉత్పత్తి జరుగుతున్నది. 6400 కదుళ్లుపెంచే విస్తరణ పథకాన్ని పూర్తిగా అమలు చేశారు. త్వరలోనే ఉత్పత్తి ప్రారంభిస్తుంది. రు. 60.00 లక్షల ఖర్చుతో 25000 కదుళ్లు 150 మగ్గాలను మార్చి ఆధునీకరణచేసే పథకాన్ని సిద్ధంచేశారు. ఈ పథకం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నది. ఈ పథకం అమలుకు అయ్యే ఖర్చులో సగం మొత్తాన్ని దశలవారిగా ప్రభుత్వం అందజేస్తుంది. మిగతా సగాన్ని కంపెనీ తమ స్వంత వనరుల నుండి సేకరిస్తుంది. ఇతర మిల్లులతోపాటు ఆజంజాహి మిల్లుకూడ సరుకు నిల్వల సమస్యను ఎదుర్కొంటున్నది. అయితే అతిక్లిష్ట పరిస్థితిని అధిగమించడం జరిగిందని భావించబడుతున్నది. ఈ సమస్యను ఎదుర్కొన డానికి వీలుగా ప్రభుత్వం రు. 25.00 లక్షల స్వల్పకాలికరుణాన్ని మంజూరు చేసింది. వస్త్ర పరిశ్రమలో అనివార్యమైన క్లిష్టపరిస్థితులు ఏర్పడినప్పటికీ 1964-65 లో ఆజంజాహి మిల్సుకు రు. 6.00 లక్షల లాభం చేకూరింది.

లఘు పరిశ్రమలు

1966-67 సంవత్సరంలో లఘు పరిశ్రమల పద్దు క్రింద రు. 24.5 లక్షలు కేటాయించారు. దీనినుండి ఆంధ్రప్రదేశ్ లఘు పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్‌కు పెట్టుబడి వాటాధనంగా రు. 10.5 లక్షలు కేటాయించారు. ఇదివరకే మంజూరు చేసిన రుణాల పంపిణీకి యీ మొత్తాన్ని వినియోగిస్తారు. లఘు పరిశ్రమల యూనిట్లకు విద్యుచ్ఛక్తి సబ్సిడీ గ్రాంట్లు యివ్వడానికి రు. 1.00 లక్ష కేటాయించారు. సనత్‌నగర్‌లోని పారిశ్రామిక వాడలో రేడియో సర్వీసింగ్, ఆటోమొబాయిల్‌లలో స్వల్పకాలిక శిక్షణ కోర్సుల నిమిత్తం రు. 2.00 లక్షలు కేటాయించారు. సనత్‌నగర్‌లో టూల్ రూం, కంపోజిట్ సర్వీసింగ్ శిక్షణ కేంద్రం నిమిత్తం మరో రు. 2.00 లక్షలు కేటాయించారు. రాజమండ్రిలోని పింగాణీ పరిశ్రమలో క్వాలిటీ మార్కింగ్ పథకానికి రు. 40,000, సనత్‌నగర్‌లోని తేలిక రకం ఇంజనీరింగ్ పరిశ్రమలో యిటువంటి పథకానికి రు. 85,000 లు కేటాయించారు.

పరిశ్రమలకు రాష్ట్ర సహాయం చట్టం క్రింద 1966-67 సంవత్సరంలో రు.4.00 లక్షలు కేటాయించారు. పరిశ్రమలకు రాష్ట్ర సహాయం చట్టం క్రింద 1965-66 లో రు. 7.00 లక్షలు కేటాయించారు. రుణాల మంజూరికై 150 దరఖాస్తులు అందాయి. ఇందులో 97 దరఖాస్తుల వారికి మంజూరు చేశారు. మిగతా దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలలో మొత్తం రు. 4.33 లక్షలు రుణాలుగా మంజూరు చేయడం జరిగింది.

పారిశ్రామిక వాడలకు సంబంధించినంత వరకు 1965-66లో రు. 14.22 లక్షలు ఖర్చు చేసినట్లు భావించబడుతున్నది. తెలంగాణా ప్రాంతంలో నిర్మల్, సూర్యాపేట, ఖమ్మం, నిజామాబాదు మంచిర్యాల, కొత్తగూడెం, పటంచెర్వు వికారాబాదు, కరీంనగర్, మౌలాలీలలో సాంప్రదాయక తరహా వాడలలో ఫ్యాక్టరీ భవనాల నిర్మాణానికి హెచ్చుభాగాన్ని ఖర్చుచేశారు. పటంచెర్వులోని పారిశ్రామికవాడ నిర్మాణం పూర్తి అయింది. కొన్ని ఫ్యాక్టరీ షెడ్లను కేటాయించడం కూడ జరిగింది. మౌలాలీలోని పారిశ్రామిక వాడలో 14 భవనాల నిర్మాణం పూర్తి అయింది. ఇందులో మూడింటిని కేటాయించారు. ఇతర పారి

శ్రామిక వాడల నిర్మాణాలు వివిధ దశలలో ఉన్నాయి.

ఏలూరు, నెల్లూరు, ఆదోని, రాజమండ్రి, గుంటూరు, ఆముదాల వలసలలో సహాయక ప్రైవేటు పారిశ్రామిక వాడల నిర్మాణం పూర్తిఅయి పని ప్రారంభించాయి. ప్రొద్దుటూరు, మచిలీపట్నం, అనంతపురం, చిత్తూరు, తిరుపతి, విజయనగరం, పాలకొల్లు, జనగాంలలోని పారిశ్రామిక వాడల నిర్మాణాలు వివిధ దశలలో ఉన్నాయి. 1966-67 స్పిల్ ఓవర్ పథకాలుగా వీటిని కొనసాగిస్తారు.

సర్లపల్లి (అనంతపురం జిల్లా), కిషన్ నగర్, (నిజామాబాదు జిల్లా)లలో సాంప్రదాయ తరహా పారిశ్రామిక వాడల మాదిరి రెండు గ్రామీణ పారిశ్రామిక వాడలను నిర్మించాలని ప్రతిపాదించారు.

సనత్‌నగర్‌లో రు. 42.84 లక్షల ఖర్చుతో ఒక సహకార పారిశ్రామిక వాడను నెలకొల్పడానికి ప్రభుత్వం మంజూరు చేసింది. 20 శాతం సమాన వాటాధనం పెట్టుబడి పెట్టడానికీ, (రు. 7.33 లక్షలు), మొత్తం అభివృద్ధి ఖర్చును (రు. 6.20 లక్షలు) భరించడానికీ, ఎల్. ఐ. సి. యిచ్చే రు. 21.93 లక్షల రుణానికి హామీగా ఉండడానికీ, మూడు సంవత్సరాలవరకు పరిపాలనాధికారుల సర్వీసులను లభింపజేయడానికీ ప్రభుత్వం అంగీకరించింది. సహకార పారిశ్రామిక వాడకు 47 ఎకరాల భూమిని కేటాయించారు. 50 మంది పారిశ్రామిక వేత్తలకు యీ భూమిని పంపిణీ చేశారు. 70 ఫ్యాక్టరీ భవనాలను నిర్మించారు. ఇవి ఉత్పత్తిని ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నాయి. సహకార వాడను విస్తరింప జేయడానికి వీలుగా అదనంగా మరో 100 ఎకరాల భూమిని సేకరించడానికి సంబంధించిన ప్రతిపాదన పంక్తులనలో ఉన్నది.

ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న వివిధ ఫ్యాక్టరీలను పూర్తిచేయడానికి 1966-67 సంవత్సరంలో రు. 15.00 లక్షలు కేటాయించారు.

సంప్రదాయక తరహా పారిశ్రామిక వాడలలో 260 ఫ్యాక్టరీ భవనాల నిర్మాణం పూర్తి అయింది. ఇందులో 258 కేటాయించడం జరిగింది. 256 ఫ్యాక్టరీలను స్వాధీనం చేసుకున్నారు. 3837 మందికి ఉపాధి కల్పించారు. సహాయక పారిశ్రామిక వాడల విషయంలో 247 ప్లాట్లు అభివృద్ధి చేయబడినాయి. 236 ప్లాట్లను కేటాయించారు. ఇంత వరకు 28 యూనిట్లు పని ప్రారంభించాయి. వీటిలో 258 మందికి ఉపాధి లభించింది. *

(15వ పేజీనుండి)

పరిశీలనలను బట్టి దేశంమొత్తం అవసరాలకు సరిపడినంతగా యీ మట్టి పశ్చిమ గోదావరి జిల్లాలోని ద్వారకా తిరుమల ప్రాంతంలో లభించగలదని తేలింది. డిశంబరు నెల ప్రారంభంలో కార్పొరేషన్ ఆధ్వర్యాన గనిత్రవ్వకం పనికూడా ప్రారంభమైనది.

గ్రాఫైట్ :

క్రూసిబుల్స్ నిర్మాణంలోనూ, పెన్సిళ్లలోనూ వాడే కార్బన్ యొక్క ఖనిజ రూపమే గ్రాఫైట్. దేశ రక్షణ పరిశ్రమలకు యిదిచాలా పనికివస్తుంది. లోహ పరిశ్రమకు గ్రాఫైట్ క్రూసిబుల్స్ అవసరం కావడంచేత ఆ పరిశ్రమ దీని మీద ఆధారపడి వుంది. ప్రస్తుతం ప్రతి సంవత్సరం రు. 15 లక్షల విలువగల గ్రాఫైట్, రు. 50 లక్షల విలువగల గ్రాఫైట్ (క్రూసిబుల్) దిగుమతి చేసుకోవడం జరుగుతున్నది. ఆంధ్ర ప్రదేశ్‌లో ముఖ్యంగా ఖమ్మం, తూర్పు, పశ్చిమ గోదావరి, శ్రీకాకుళంజిల్లాలలో గ్రాఫైట్ ఉత్పత్తికి చక్కని అవకాశాలు ఉన్నవి. తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రి ప్రాంతంలో గ్రాఫైట్ క్రూసిబుల్స్ పరిశ్రమకూడా నెలకొల్పబడింది. ఆంధ్ర ప్రదేశ్ మైనింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యాన శ్రీకాకుళం జిల్లాలో గ్రాఫైట్ ఉత్పత్తికి, గ్రాఫైట్ క్రూసిబుల్ పరిశ్రమ స్థాపనకూ కృషిజరుగు తున్నది. అయితే యిక్కడ రాజమండ్రి ప్రాంతంలో ప్రస్తుతం తయారు కావడంలేని పెద్ద సైజు క్రూసిబుల్స్ ఉత్పత్తికి కార్యక్రమం పరిమితంచేయి బడుతున్నది.

రాగి :

రాగి లేకపోతే ఆధునిక పరిశ్రమ ఏదైనా స్థంభించిపోతుందనడం అతిశయోక్తి కాదు. మన దేశంలో మయోబందరు దగ్గరగల రాగి గనులు, బీహారు లోని మాసాబనీ వద్దగల శుద్ధి కర్మాగారం మినహా రాగి ఖనిజం ఉత్పత్తి అయ్యే చోటుగానీ, పరిశుద్ధి చేయబడే చోటుగానీ ఎక్కడాలేదు. రాజస్థాన్‌లో ఖేత్రివద్ద రాగి గనుల అన్వేషణ జరుగుతున్నది. ప్రతియేటా దేశంలోకి రు. 20 లక్షల విలువగల రాగి వస్తువుల దిగుమతి జరుగుతున్నది. మన రాష్ట్రంలో ఖమ్మం జిల్లాలోని మైలారంవద్ద జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంస్థ ఆధ్వర్యాన, గుంటూరు జిల్లాలోని అగ్నిగుండాలవద్ద ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ సంస్థ ఆధ్వర్యాన జరిగిన అన్వేషణ ఫలితాలు చాలా, ఆశాజనకంగా వున్నవి. అగ్నిగుండాల వద్ద రాగి త్రవ్వకం, శుద్ధి కర్మాగార నిర్మాణానికి శ్రద్ధగా కృషి జరుగు తున్నది.

ఖనిజ పరిశ్రమకు సంబధించినంత వరకు దేశాన్ని స్వయంపోషకం, స్వయ సమృద్ధం చేయడంతో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఖనిజ సంపద బహుముఖాల ఉపయోగ పడుతుంది. *

భాగ్యచక్రం

ఆరెకపూడి కౌసల్యాదేవి

పట్నవాసంలోలాగా ఉదయం పదెనిమిది గంటల వరకూ పండుకొని నిద్రపోతూ వుండనీయదు పల్లెప్రకృతి. బృందగానంవలె వినవచ్చే కోళ్ళ అరుపులూ, కిర్రు చెప్పుల రైతుల సందడీ, పొలాలకు పోయే బళ్ళ చక్రాల చిత్రమైన కటకట గుబ గుబ ధ్వనీ, పశువుల కాలి గిట్టల శబ్దాలూ, ఎడ్ల మువ్వల-గంటల గణ గణలూ, చిత్ర విచిత్రమైన విహంగాల కలకూజితాలూ వేకువనే మేలుకొలుపులు పాడుతాయి.

నిద్ర లేచిన జయశ్రీ మేడదిగి క్రిందికి వచ్చేసరికే నౌకర్లు తమతమ పనులలో లీనమైపోయివున్నారు. అప్పుడే ఆకసం అరుణరాగ రజితమౌతున్నది. ఆ శోభని తిలకించుతూన్న జయ ఎవరో క్రొత్త మనిషి ప్రవేశించడంతో అటు తిరిగింది.

“ఇప్పుడే నిద్ర లేచావేమిటమ్మా?” అంటూ పలుకరించింది ఆ క్రొత్తామె. “ఔనండి” అంది జయ, ఎవరో తెలియని సంశయాత్మక దృక్కులతో.

“ఆ ఏంలేదూ, క్రొత్తగా వచ్చారు కదా, చూద్దామని. ఈ ప్రక్క లోగిలే మాది. ఈ మేడా - మీ కుటుంబం - వాటివైభవం ఏమని వర్ణించను మీ తాత గారికాలంలో! మళ్లీ ఆ శ్రీదేవి, ఆమె కొడుకూ ఆ వైభవాన్నీ, దాతృత్వాన్నీ నిలబెడుతున్నారులేమ్మా, మనుష్యులంటే అలావుండాలి, ఓ! ఈ పల్లెలో ఈ చుట్టుపట్ల ఎక్కడ చూచినా శ్రీనగేశ్ బాబు దేవుడన్న ప్రశంసేకదు తల్లీ!”

అలాగే మౌనంగా చూడసాగింది జయశ్రీ.

“మీరిక్కడికి వచ్చారంటే సంతోషమేకాని, పాపం, కుటుంబం చాలా నాశనమై పోయిదంటే విని కంట తడి పెట్టని వాళ్ళు లేరమ్మా. మీ కుటుంబానికి రావలసిన కష్టంకాదిది.” ముక్కుచీదింది ఆ ముత్తైదువ.

ఒక్క దీర్ఘ నిశ్వాసం మాత్రం వెలువడింది జయశ్రీ అంతరంగం నుండి.

“ఇదుగో, మా మనుమరాలు నిన్ను చూస్తానంటేనూ తీసుకొచ్చానమ్మా ఇలా కాలువకు నీళ్లకుపోతూ.” అంటూ చేతిలోనున్న పెద్ద బిందెను లక్క పిడతలాగా గిఱ్ఱున తిప్పింది. “కాస్త పల్లెటూరి వాళ్లం మరి! పట్నవాసపు దానవు-మాతో మాట్లాడతావో

జరిగిన కథ

వైద్యశాస్త్ర పట్టభద్రుడైన శ్రీనగేశ్ సేవాతత్పరత కలిగిన ఆదర్శవాది. శ్రీనగేశ్ ఆదర్శాలు ఆయన మామ అయిన శ్రీపతికి, శ్రీపతి కుటుంబంలోని వారికి హాస్యాస్పదంగా కన్పిస్తాయి. సమయానికి కట్నం అందని కారణంగా శ్రీపతి కొడుకు శ్రీహరి వివాహం, పెళ్ళిపందిట్లో రభసతో వివాదంగా పరిణమించుతుంది. అంతకుముందే సైన్యంలో వైద్యాధికారిగా చేరిన శ్రీనగేశ్ అధికార బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి తిరిగి తన వైద్యశాలకు వచ్చేస్తాడు. కారుప్రమాదంలో శ్రీపతికి మతిస్థిమితం తప్పుతుంది. ఆయన ముగ్గురు కొడుకులు ఇద్దరు కోడళ్ళు భార్య ప్రాణాలను కోల్పోతారు. కూతురు జయశ్రీ తండ్రి శ్రీపతిని వెంట తీసుకుని శ్రీనగేశ్ హాస్పిటల్‌కు వస్తుంది. జయశ్రీ ద్వారా అన్ని వివరాలను తెలుసుకున్న శ్రీ నగేశ్ శ్రీపతికి చికిత్స ప్రారంభిస్తాడు.

లేదోనని భయపడ్తోంది.'' అంటుండగా ఆమె చాటునుండి ఓ పదహారు పద్దెనిమి దేళ్ళ అమ్మాయి ముందుకు వచ్చింది, జయశ్రీని వింతగా చూస్తూ.

జయశ్రీకి ప్రాణం లేచి వచ్చినట్లైంది. వెంటనే అతి ఆనందంగా అన్నది: ''ఎవరూ మాట్లాడే వారు లేక నాకు చాలా బాధగా వుంది. తప్పక వస్తుండండి.'' అంటూ వారికి చేరువగా వెళ్ళింది.

"మా తల్లే! చదువుకున్నావు కూడా. ఎంత చక్కగా మాట్లాడుతున్నావ్! అసలు మాట్లాడవేమో ననుకున్నాను. వెళ్తాము.'' అంటూ దారి తీసింది.

''మధ్యాహ్నం వస్తానండి'' పరమ సంతోషంతో అంటూ మామ్మను అనుసరించింది మనుమరాలు.

అన్నట్లే సుబ్బులు వచ్చింది మధ్యాహ్నం, మరో నలుగురు నేస్తురాండ్రను వెంటబెట్టుకుని. సాదరంగా ఆహ్వానించింది జయశ్రీ, 'పల్లెవాళ్లని పేరే కాని, పట్నవాసంవాళ్లను తలదన్ని ఉన్నారు' అని అనిపించింది లోలోన. వారిలో ఒకామె వివాహిత; భర్త ఇంకా చదువుకుంటున్నాడట. మిగతా ముగ్గురూ పదిహేడు, పద్దెనిమిదేళ్ల కన్యలే.

మొదట క్రొత్త వల్ల ఎవరికీ నోళ్లు మెదలలేదు. తర్వాత మెల్లగా ప్రారంభమైన సంభాషణ అనేక విషయాల మీదకు మళ్లింది. ఎంతో సరదాగా ఆ గంట కాలమూ అన్ని బాధలనూ మరచి పోయింది జయ.

''ప్రతిరోజూ ఈ సమయంలో వస్తుండండి, వచ్చిన కుట్లూ అవీ నేర్పుతాను'' అన్నది జయశ్రీ వారిని సాగనంపుతూ.

'' నేర్పుతారండీ ? నిజంగా ?'' వాళ్ల ముఖాలు వికసించాయి. కాని అంతలో నీళ్లు గారిపోయారు.

"మా అమ్మ నిద్రపోతున్నది. నాన్న పొలం వెళ్లాడు. అదను చూచుకుని ఇలా వచ్చేశాను. కాని రోజూ యిలా రానివ్వరండీ.'' అన్నదొక అమ్మాయి.

''ఏం?'' జయశ్రీ ఆశ్చర్యంగా ప్రశ్నించింది.

''ఇది పల్లెటూరండీ పట్నవాసాలలోకి మల్లే తిరుగకూడదు, తప్పు బడతారు.'' మరొక అమ్మాయి వివరించింది.

''మాది ఈ పక్కిల్లేగా, ఏం ఫర్వాలేదు. గబుక్కున వచ్చేయవచ్చు. కాని నాకు ఎప్పుడూ చాలా పని చెబుతూంటుందండీ మా అమ్మ. ఒక్కోసారి, అమ్మా మామ్మా పోట్లాడుకుని ప్రక్కకెక్కితే పనంతా కూడా నా నెత్తినే పడ్తుంది. అంచేత రోజూ వచ్చేందుకు వీలు పడదు, వీలైనప్పుడల్లా వస్తాను.'' అన్నది సుబ్బులు.

''మీరు కూడ మా యింటికి ఓసారి రండి. అప్పుడు మళ్లీ నేను మీ ఇంటికి వస్తా.'' వంతులు వేసింది పెళ్లి అయిన అమ్మాయి.

'పల్లెటూరివాళ్లు అమాయకులేమీ కాదు. పైకి కన్పించని తెలివి వున్నది వాళ్లలో' అనుకున్నది జయశ్రీ. అందరూ వెళ్లిపోయాక తనలో తాను నవ్వుకుంది.

'పట్నవాసాలైనా, పల్లెలైనా మనుష్యుల మధ్య పరిచయాలు, మాటలూ, లేనిదే మనలేరు. అక్కడ క్లబ్బులూ, సినిమాలూ, విహారాల ద్వారా పరిచయమైతే యిక్కడ ఈ విధంగా!'

"అమ్మాయ్!'' వెంటనే తండ్రి పిలుపు విన్పించింది పైనుండి.

''వస్తున్నా'' తక్షణమే మేడ మీదికి వెళ్లిన జయశ్రీకి ఏదో నరకంలో అడుగు పెట్టినట్లున్నది కాని ఇంట్లోనూ గదిలోనూ వున్నట్లు అన్పించలేదు. నేలనిండా చింపి పారవేసినవీ, ఉండలు చుట్టి విసిరి వేసినవీ కాగితాలు సముద్రంలాగా పడివున్నాయి. బల్లనిండా కుర్చీల నిండా నల్లసిరా ఒలకపోసేసి వుంది.

జయను చూడగానే ''చూడమ్మా, ఈ ఉత్తరం పోస్టు చేయించు. పొద్దుటినుండీ శ్రమపడి, అతి ఘాటుగా, ప్రతి ముస్తూ - ఎంతో బాగా వ్రాశాను. ఈ దెబ్బతో వెంటనే రైలెక్కి వచ్చేస్తారు చూస్కో మీ అమ్మా అన్నయ్యాలూ!''

వినుగెత్తిపోయింది జయశ్రీకి. అంతవఱకూ ఇరుగుపొరుగు సుబ్బులూ వగైరా తోటి ఆడపిల్లలతో సరదాగా మాట్లాడుతూ గడిపిన ఆమెకు, పట్టణంలో తన చదువూ, స్నేహితులూ, వింతలూ, వినోద విహారాలూ గుర్తు వచ్చి, ఈ నిస్తబ్ద పల్లె వాతావరణంతో ఆ గత సంతోష జీవితాన్ని పోల్చుకోవడంతో మనస్సంతా చీకాకు పడిపోయింది.

" పంపించమ్మాయీ, వెళ్లు, త్వరగా పోస్టుకు పంపించు,'' హెచ్చరించాడు శ్రీపతి.

పూర్తిగా ఓరిమిని కోల్పోయింది జయశ్రీ. ''ఎక్కడికి పంపించను నాన్నా వల్లకాట్లోకి? వాళ్లంతా చచ్చారు- ఈ భూమి మీద లేరు, లేరు! ''

'' ఏమన్నావే?'' పిచ్చిచూపు చూస్తూ కుర్చీనుండి లేచి కర్కశ స్వరంతో ప్రశ్నించాడు శ్రీపతి.

"ఏమంటాను నాబుండిద! వాళ్ళంతా చచ్చారనే ఏడవనా మీరిలాగున్నారనే ఏడవనా? అన్ని విషయాలలోను అతి తెలివిగా వుండి ఈ ఒక్క సంగతేనా మీకు గ్రహింపు కాకున్నది?'' ఆవేశంతో కోపంగా అరిచింది.

వెంటనే పులిలా లంఘించాడు శ్రీపతి "నా ముద్దుల కుమారులు చనిపోయారంటావటే దౌర్భాగ్యురాలా. వాళ్లు హాయిగా ఢిల్లీలో ఉద్యోగాలుచేస్తూంటే? నువ్వుచావు, ముందు నువ్వుచావు'' కోపంతో అరుస్తూ కసిగా బలంగా కూతురి కంఠం నులిమివేయసాగాడు. మౌనంగా పెనగులాడడమే కాని జయశ్రీ గొంతు ఎక్కడా పెలకడంలేదు.

"రావుగారు''.

గంభీర పురుషకంఠం వినరావడంతో పట్టు వదిలేసి అటు చూచాడు శ్రీపతి. "ఏమిటండీ అది?'' అంటూ ప్రవేశించిన నగేష్‌నుచూచి నిశ్శబ్దంగా రోదిస్తూ, ఏమిటకొంగు నోట్లోకుక్కుకుంటూ త్వరత్వరగా క్రిందికి పారిపోయింది జయశ్రీ. పోతున్న ఆమెవైపు ఒక్కసారి జాలిగా చూచి, మెల్లగా శ్రీపతి వద్దకు నడిచాడు శ్రీ నగేష్.

నిశితమైన అతడి చూపులతో ఒక్కసారి చూపులు కలిపి, ఆవాడి చూపుల్ని భరించలేక వెంటనే వాల్చేశాడు రావు. మరులిప్తలో అంత కోపమూ ఏమైపోయిందో—ఒక కుర్చీలో కూలబడి ముఖానికి పై తువ్వాలు అడ్డుపెట్టుకుని ఒక్కసారి భోరుమని విలపించసాగాడు "నా ఒక్కగానొక్క కూతురి పట్ల చాలా దారుణంగా ప్రవర్తించాను డాక్టర్. ఏంచేయను మరి? నా కుమారులను చచ్చిపోయారంటుందా. చూడండి డాక్టర్! మా అబ్బాయిలు హాయిగా ఉద్యోగం చేస్తూన్నారు. ఎవరితరం నా కొడుకుల్ని చంపడానికి?" దుఃఖం మానేసి ఆవేశంగా లేచాడు శ్రీపతి. "ఆ దేవుడుకాడు యముడుకాడు-ఎవరు దిగివచ్చినా నాకొడుకులను చంపి తీసుకపోగలరా నేనుండగా?" అంతకంతకూ కోపంతో ముఖమూ, కనుగ్రుడ్లూ కెంపు వర్ణం దాల్చుతూండగా, తారస్థాయినందుకుంటూన్న కంఠంతో చేతులు త్రిప్పుతూ, కాళ్లు కసిగా నేలను బాదుతూ అరవసాగాడు.

పరిస్థితి శ్రుతి మించిపోతున్నదనే విషయం గ్రహించిన శ్రీ నగేష్ మెల్లగా శ్రీపతి చెయ్యి పట్టుకొని అనునయంగా అన్నాడు; "అయ్యో కాదండీ మరి? మీ అబ్బాయిలు లక్షణంగా ఢిల్లీలో వుంటే అదేం మాట? తొందరలోనే వచ్చేస్తారుగా?''

"ఆఁ. అద్గదీ. లక్షణమైన మాట అన్నావ్.'' శాంతించి కుర్చీలో కూర్చున్నాడు శ్రీపతి. "అయితే ఢిల్లీ వెళ్లావా? మా అబ్బాయిలకు కన్పించావా? ఎప్పుడు వస్తానన్నారు?'' నుదుటిపై స్వేదబిందువుల నొత్తుకుంటూ అడిగాడు. క్రమంగా ముఖంలోని అరుణిమ తగ్గి, శాంతి రేఖలు ఆవరించసాగాయి.

"ఆఁ, ఆఁ, కన్పించారండి, తొందరలోనే వస్తామన్నారు.'' శ్రీ నగేష్ తడుముకోకుండా అనేశాడు.

శ్రీపతి ముఖం సంతోష తరంగితమైంది. "ఆఁ, ఆఁ! వస్తారు. ఎందుకు రారు? వాళ్లు నా మాట ఎన్నడూ మీరరు, నాకు తెల్సు. చూడుబాబూ, కాస్త ఈ ఉత్తరాన్ని అర్జంటుగా పోస్టు చేయించు. వెంటనే వచ్చేస్తారులే, చాలా బాగా వ్రాశాను.''

"అలాగే నండి'' ఆ ఉత్తరాన్ని తీసుకుని జేబులో భద్రపరిచాడు శ్రీ నగేష్. "నేను సాయంకాలంనుళ్లీ వస్తాను కాస్త అలా తిరిగి వద్దాం నిన్నటిలాగే.''

"అలాగే బాబూ అలాగే. తప్పకుండారా. నిన్ను చూస్తే మా అబ్బాయిల్ని చూచినట్టే ఉంటోంది నాకు.'' అన్నాడు శ్రీపతి మనస్ఫూర్తిగా.

"మరి వెళ్లి వస్తానండి నేను. నమస్కారం.''

"ఆఁ! అన్నట్టు నీకు చదరంగం వచ్చునా నాయనా?''

"వచ్చునండి.''

"దా, అయితే కూర్చో, రెండెత్తులు వేద్దాం.''

"రేపటినుంచి తీరిక చేసుకుని వస్తానులెండి. ఇవ్వాళకు వెళ్లాలి. పనుంది.'' వినయంగా అనుమతికై అర్థించాడు శ్రీనగేష్.


"సరే వెళ్ళిరా,'' అంటూనే తన ఆటలో మునిగిపోయాడు శ్రీపతి.

మేడదిగి క్రిందికి వెళ్లిన శ్రీనగేష్‌కు ఎక్కడా జయశ్రీ దర్శనం కాలేదు. కడకు నౌఖరు నడిగి తెలుసు కొని మెల్లగా ఆమె వున్న పడమటివైపు గదిలోకి వెళ్లాడు.

మంచంమీద బోర్లాపడి వెక్కివెక్కి ఏడుస్తూన్నది జయశ్రీ.

తన ప్రవేశాన్ని ఆమెకు తెలియజెప్పే ఉద్దేశ్యంతో సన్నగా దగ్గాడు నగేష్. గమనించలేదు; గట్టిగా సకిలించాడు. ఆమె వైఖరిలో మార్పులేదు.

"జయా!' సానునయంగా సంబోధించాడు, వాత్సల్యా ముట్టిపడే కంఠంతో.



జయశ్రీ శోకోద్వేగం మరింత హెచ్చింది.

ఆమె నిస్సహాయస్థితిని, రోదననూ చూస్తూన్న శ్రీనగేష్ హృదయం జాలితో నిండిపోయింది. స్టూలు దగ్గరకు లాగి కూర్చుంటూ, "జయా! ఏమిటీ పిచ్చితనం ? ఏదీ, ఇటు చూడు." అంటూ ఆమె భుజం పట్టి యిటు త్రిప్పాడు. "అలా బాధ పడితే ప్రయోజన మేమిటి చెప్పు ? అసలేం జరిగింది ?"

కనులు తుడుచుకుంటూ లేచి కూర్చుని, తలా, దుస్తులూ సవరించుకుంది జయశ్రీ. కాని ఆ నేత్రాల నుండి జాలువారుతూన్న జలపాతాలు కట్టుపడలేదు. మాటలాడ యత్నించి, శోకంతో కంఠం పూడిపోవడం వల్ల విఫలురాలైంది.

"ఇలాగైతే వైద్యం ఏలా సాగుతుంది చెప్పు ? మానేసి వెళ్ళిపోమంటావా నన్ను ?" చిరుకోపం నటించాడు శ్రీనగేష్.

అనంగీకారంగా తల అడ్డుగా త్రిప్పిందే కాని, అప్పటికే మాట్లాడలేకపోయింది జయ.

ఇక శ్రీనగేష్ తానే మాటలు ప్రారంభించాడు. "నిన్న సాయంకాలం అలా మేమిద్దరం కలసి వ్యాహ్యాళి పోవడం మంచిదే అయ్యింది, మామయ్యను గూర్చి-అంటే ఆయన ప్రస్తుత మనః ప్రవృత్తిని బాగానే అంచనా వేయగలిగాను."

దుఃఖం మరచి పోయి శ్రద్ధగా వినసాగింది జయశ్రీ.

"ఆయన మనస్సు ఇటు స్థిమితంగానూ లేదు, అటు పూర్తిగా పోనూ లేదు. అటు ఇటు ఊగిసలాడుతూన్నది. దానికి మనం మన మాటలవల్లా, చేతలవల్లా స్వాస్థ్యం చిక్కించాలి. ఇందుకు చాలా ఓర్పు అవసరం. ఈ ఊరినీ, మనుషులనూ, నన్నూ పూర్వం ఎప్పుడో ఎక్కడో చూచినట్లే—తెలిసి వున్నట్లే అన్పిస్తూన్నదట. చూశావా ! ఆయనమతి కోలుకోగల దనడానికి ఎంతటి భరోసా యిచ్చే విషయమో యిది !"

చాలా శ్రద్ధగా, తదేకంగా వింటూన్న జయను చూచి, ఆమె కాస్త స్థిమితపడిన దని గ్రహించిన శ్రీనగేశ్ చిరునవ్వుతో అడిగాడు : సరే, ఇంకా నేను మాట్లాడవలసిన విషయాలు చాలా వున్నాయి. ఇప్పుడు జరిగిన సందర్భ మేమిటో నువ్వు వివరించగలవా !"

ఏడ్వలేని నవ్వు నవ్వింది జయశ్రీ. "ఏముంది ? రోజుకు నాల్గు ఉత్తరాలు వ్రాసి పోస్టు చేయించమని చంపుకుతింటూరు నాన్న. నేనేదో విసుగ్గా వుండి, 'చచ్చినవాళ్ళకు ఎక్కడకని పంపించా' లని అనేశాను. అంతే. దానితో ఆయనకు కోపం వచ్చేసింది."

వింటూనే వ్యధిత హృదయుడయ్యాడు శ్రీనగేశ్. "అయ్యో, నువ్వలా అని వుండవలసింది కాదు. చూడు—ఆ ఉత్తరాలు తీసుకుని అలాగే పంపించినట్లు, వారు బ్రతికే వున్నట్లు నటించు, ఆయన మనస్సుకు నచ్చేలాగా. నటన కష్టమే అయినా అవసరం కదా మరి !"

"............................"

"ఏం మాటాడవు ?"

ఒక్కసారిగా తిరిగి ఏడ్చేసింది జయశ్రీ.

"**అయ్యో, అదేమిటి మళ్ళీ ?**"

ఆమె వెక్కిళ్లే సమాధానాలయ్యాయి.

"జయా !" జాలిగా, అనునయంగా తల నిమిరాడు శ్రీనగేశ్. "అలా మనస్థయిర్యం కోల్పోరాదు. నాకు తెలుసు, నీకు ఇక చెప్పుకోవటానికి, ఆదరణను ప్రసాదించడానికికూడ ఎవరూ లేరు. చాలా కష్టమే, కాని, చూడు ! నన్ను నువ్వు కేవలం డాక్టర్‌గానే చూడడం చాలా దురదృష్టం. నేను కష్ట సుఖాలు తెలిసిన మానవుడినికూడా. బంధుత్వం అటుంచు పోనీ. ఒక ఆత్మీయుడైన మిత్రునిగా, హితైషునిగా భావించి నీ మనస్సులోని బాధంతా నాకు చెప్పి భారం వదిలించుకో. కాని మీనాన్నగారెదుట మాత్రం నేను చెప్పినట్లు చేయాలి. లేనిదే నేను ఈ వైద్యం కొనసాగించడంలో అర్థమూ, ప్రయోజనమూ కన్పించవు."

"ఏమో బావా, ఏమిటో ఈ జీవితాని కర్థం తెలియడంలేదు. మనుషులూ

పోయారు : సుఖ సంతోషా లెగిరి పోయాయి. వయస్సు ఆగిపోయింది. ఈ పిచ్చిమనిషి, నేనూ మిగిలాం. ఈ భయంకర నిస్తబ్దంలో యిలా కాలం గడపడం నాకెంత బాధగావుందో నీకర్థం కాదు.''

''అర్థమైనది గనుకనే యిలానీదగ్గర కూర్చుని ఓదార్చగలుగుతున్నాను. నీకింకా చిన్నతనం జయా. నీకు తెలియదు. ప్రతీ జీవితంలోనూ ఏవో కష్టనిష్ఠూరా లుంటాయి.. ఏ మానవ ప్రాణికీ పరిపూర్ణ సౌఖ్యంలేదు. అసలు ఏదో ఒక బాధనూ, దుఃఖాన్నీ అనుభవించటానికే ఈ ప్రపంచంలో జన్మించటమని నేనను కొంటూ వుంటాను.''

ఏడ్పుమాని, అవనత వదనయై నిశ్శబ్దంగా వినసాగింది జయశ్రీ.

నాకు తెలిసిన ఎన్నో కష్టాలను, దుఃఖాలనూ పోల్చి చూస్తే నీబాధ అత్యల్పం జయా. అలాగేసర్దుకు పోవాలికాని అసంతృప్తితో దిగులుపడితే ప్రయోజనం లేదు.''

కొద్దిసేపు ఎవరూ మాటాడలేదు.

''నిన్న మామయ్య చాలా ఆనందం ప్రకటించారు. వాహ్యాళి సమయంలో పచ్చటి చేలనుచూచి ఆయన మనస్సు సంతోషపడింది. చాలా కులాసాగా, ఉత్సాహంగా ప్రవర్తించారు. కాని నేను గమనించినదేమిటంటే, పొలాల సేద్యమూ, వర్తక వ్యాపారాలూ, రాజకీయాలూ వంటి పెద్ద విషయాలలో ఆయన మెదడు శ్రమపడి ఆలోచించ లేకపోతున్నది.''

''ఓహో !''

''చూడు, నువ్వు కొన్ని పనులు చేయాలి. ఏమంటే, ఆయనతో ఎప్పుడూ నవ్వుతూ సరదాగా మాటాడాలి. విసుగుదల కన్పించనీయకూడదు. ఆ మాటాడే విషయాలు పెద్ద సమస్యలను ఆలోచనలనూ రేకెత్తించేవిగాక తేలికగా హాయిగా వుండాలి. తేలికగా చదివి, హాయిగా నవ్వుకోగల కొన్ని నవలలు తెచ్చాను నేను; హాలులో వుంచాను. అవి ఆయనచేత చదివించడం గానీ, నువ్వు చదివి విన్పించడంగానీ చేయాలి.''

''అలాగే''


''అదీ, అలా వుండాలి. మరో ముఖ్య విషయం. నువ్వు యిటువంటి కొట్టొచ్చేట్లున్న రంగుల దుస్తులు కాకుండా, కంటికి చల్లగా నిర్మలంగా వుండే లేత రంగులు, తెల్లనిదుస్తులూ వాడాలి.'' అన్నాడు ఆమె కట్టిన ఎఱ్ఱరంగు చీరను చూస్తూ.

ఆ మాటలు వింటూనే సిగ్గుపడిన జయశ్రీ కనురెప్పలు వాల్చి, కనుకొలకులలోని సిగ్గుదొంతరలనైతే కప్పిపుచ్చ గలిగినది కాని చెక్కిళ్ళపై మధుర లజ్జారుణ కాంతులను దాచలేక పోయింది.

అది గమనించీ గమనించనట్టుగా శ్రీనగేశ్ మరో సంభాషణలోనికి దిగిపోయాడు. ''అమ్మకు చెప్పి చూచాను ఒకసారి వచ్చి మామయ్యను చూడమని. కాని వినలేదు. సాధారణంగా ఆమె నియమాలనెవరూ మార్చలేరు. కాని, నువ్వు అనవసరంగా అంతపట్టుదలతో కూర్చోకు; ఒక్కసారి మాయింటికిరా జయా, బాగుంటుంది. నీకూ, అమ్మతో మాటాడడంవల్ల కాస్త మనస్సు తేలికౌతుంది.''

''రాను.'' తల అడ్డుగా ఊపుతూ తన ఖచ్చిత నిర్ణయాన్ని తెలియజేసింది జయ. ''ఏం, నాన్నకు తను స్వంతచెల్లెలుకదా! ఇంత కష్టసమయంలో కూడా నియమాలూ, నిష్ఠలూ ఏమిటి? ఒక్కసారి అంటే ఒక్కసారి అయినా వచ్చి చూచిన పాపాన పోయిందా? నేనైతే బ్రతికుండబట్టి సరిపోయిందికాని, నేనూ చచ్చిపోయుంటే ఏంచేసేది? అప్పుడు వచ్చి ఆయనను తీసుకెళ్ళక పోయేదా? 'గడప దాటి రాదలచుకోలేదు. ఇది నా నియమం' అంటూ ఆయనను ఖర్మానికి వదిలేసివుండేదా?''

నిస్సహాయంగా చూచాడు శ్రీనగేశ్. ''సరే నీయిష్టం. నీది మరీ ఆవేశ ధోరణి.'' అంటూ వెళ్ళిపోయాడు. అతడి నిష్క్రమణానంతరం, అతడి సరళ సౌమ్యతలను గురించి కొలదిసేపు యోచించకుండా వుండలేకపోయింది జయశ్రీ. (సశేషము.)



పారిశ్రామిక శిక్షణ సంస్థలు

డా॥ రాం. కె. వేపా, ఐ. ఎ. ఎస్.

శాస్త్రీయవిజ్ఞానం అత్యంత శీఘ్రంగా అభివృద్ధి చెందుతున్న యీనాటి ఆధునిక కాలంలో, పారిశ్రామిక, ఆర్థిక వ్యవస్థలలో రోజు రోజుకు కొత్త ధోరణులు ప్రవేశిస్తున్న ఈ వర్తమానకాలంలో బాగా శిక్షణ పొందిన అనుభవశాలుర అవసరం ఎంతయినావుంది. చతుర్థ పంచవర్ష ప్రణాళికలోనూ, ఆ తరువాత ప్రణాళికలకాలంలోనూ మన ఆర్థిక వ్యవస్థ మరింతగా అభివృద్ధి చెందుతుంది. కనుక ముందుముందు శాస్త్రీయ విజ్ఞానంలోనూ, ఆధునిక మార్గాలలోనూ క్షుణ్ణంగా శిక్షణ పొందిన కార్మికుల అవసరం చాలావుంది. ఈ సాంకేతిక మానవశక్తి సమస్యను ఎదుర్కొనాలంటే చాలా తెలివిగా వ్యవహరించాలి.

ఆంధ్రప్రదేశ్‌కు క్లిష్టకాలంగా చెప్పదగ్గ 1961-71 మధ్య కాలంలో సాంకేతిక మానవశక్తి ఎంతవరకు అవసరమో పరిశీలించే నిమిత్తం అప్లయిడ్ ఎకనామిక్ రిసర్చి తాలూకు జాతీయ మండలి ఆంధ్రప్రదేశ్‌లో సాంకేతిక-ఆర్థిక పరిశీలన జరిపి, ఆసక్తికరమైన కొన్ని సిఫారసుల్ని చేసింది. నివేదికలో అది సూచించిన కార్యక్రమాలన్నిటినీ చేపట్టితే మొత్తం మీద ఆంధ్రప్రదేశ్‌లోని శ్రామిక ఉత్పాదక శక్తి 85 శాతం పెరుగుతుందని యీ మండలి తెలియజేసింది. అయితే అన్ని రంగాలలోనూ అవసరమయ్యే సాంకేతిక నిపుణులు అధిక సంఖ్యలో లభించినప్పుడే యిది సాధ్యమౌతుందనికూడా యీ నివేదిక తెలియజేసింది. 1961-71 లో పరిశ్రమలకు, గనులకు మొత్తం కావలసిన 2,82,000 మంది లోనూ అదనంగా 30 శాతం నిపుణులు, కొద్దిపాటి నిపుణత గలిగినవారుగానూ వుండాలని కూడా యీ నివేదికలో తెలియపరచడం జరిగింది. ఈ ప్రాతిపదిక మీద 1961-71 లో 70,000 మందికి పైగా శిక్షణ యివ్వాలి. వీరిలో పదిహేను శాతం-అనగా 11,000 మంది-ఇంజనీర్లూ, డిప్లమోహోల్డర్లు వుండాలి.

రాష్ట్రంలో సాంకేతిక శిక్షణ పథకాలను రూపొందించేటప్పుడు యీ పై విషయాలను దృష్టిలో వుంచుకోవడం చాలా అవసరం. తృతీయ ప్రణాళికలో రాష్ట్ర పారిశ్రామికీ కరణకు అధిక ప్రాముఖ్యతను యివ్వడం దృష్ట్యా యితర విషయాలతోపాటు చేతి పనులవారి శిక్షణ పథకాల క్రింద పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో సాంకేతిక పనివారలకు శిక్షణ గరిపే అంశానికి అధికతర ప్రాధాన్యతను యివ్వడం అవసరం.

అసలు యీ పారిశ్రామిక శిక్షణ సంస్థలు ఎలా ఆవిర్భవించాయో సంక్షిప్తంగా యిక్కడ ప్రస్తావించడం అవసరం. ద్వితీయ ప్రపంచ సంగ్రామ కాలంలో రక్షణ పరికరాలను ఉత్పత్తి చేసే పరిశ్రమలలో నిపుణులు, కొద్దిపాటి నిపుణతగల పనివారల కొరత ఏర్పడినప్పుడు దేశవ్యాప్తంగా వృత్తిపనివారల శిక్షణ నిమిత్తం యుద్ధ సాంకేతిక శిక్షణ పథకం అన్న పేరుతో ఒక సమగ్ర పథకాన్ని భారత ప్రభుత్వం 1940 లో ప్రారంభించింది. ఆరేళ్లపాటు యిది అచరణలోవుంది. యుద్ధానంతరం సహాయక కార్యక్రమాల క్రింద చాలావరకు కేంద్రాలు మాజీ సైనికులకు శిక్షణఇచ్చే కేంద్రాలుగా మార్చబడ్డాయి. ఈ కార్యక్రమాలు పూర్తయిన అనంతరం పారిశ్రామిక సంస్థలలోని కేంద్రాలను ఉపకరించే విధంగా వృత్తిపనివారల శిక్షణ పథకాలను పునర్వ్యవస్థీకరించడం జరిగింది. కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ తాలూకు ఉపాధి కల్పన శిక్షణ డైరెక్టర్ జనరల్ ఆధ్వర్యం క్రింద యీ సంస్థలు వుంటాయి. పరిశ్రమలకు అవసరమయ్యే సమీప వాణిజ్య పరికరాల తయారీలో శిక్షణ పొందిన కార్మికుల కొరత లేకుండా వాటికి అందజేయడం, కార్మికులకు ఒక పద్ధతిలో శిక్షణ గరపడం ద్వారా పారిశ్రామిక ఉత్పత్తిలో నాణ్యాన్ని, పరిమాణాన్నీ పెంచడం, చదువుకున్న వారికి తగిన పరిశ్రమలలో ఉద్యోగం పొందడానికి వీలుగా వారికి శిక్షణ ఇచ్చి చదువుకున్న వారిలో నిరుద్యోగ పరిస్థితులను తొలగించడం- ఈ శిక్షణ సంస్థల ప్రధాన లక్ష్యాలు.

1956 నవంబర్‌లో ఈ సంస్థల నిర్వహణ ఆధిపత్యాన్ని కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన మంత్రిత్వ శాఖ నుండి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు అందజేయడం జరిగింది. ఈ పంపిణీ జరిగిన తర్వాత కూడా వృత్తి పనివారల శిక్షణ పథకాలకు అయ్యే ఖర్చును కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు 60:40 శాతంలో భరిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని పారిశ్రామిక శిక్షణ సంస్థలు 1964 జనవరి 1 వరకు సాంకేతిక విద్యాశాఖ డైరెక్టరు ఆధిపత్యం క్రింద ఉండేవి. ఆ తరువాత, ఉపాధి కల్పన, శిక్షణల మధ్య సమన్వయాన్ని కలిగించడానికి ఉపాధి కల్పన, శిక్షణ శాఖకు బదిలీ చేయబడింది. మూడు పంచవర్ష ప్రణాళికల క్రింద రాష్ట్రంలో పారిశ్రామిక శిక్షణ సంస్థల విస్తరణను పరిశీలిస్తే ఎంతగానో అభివృద్ధికి ప్రోత్సాహం గోచరించగలదు.

తొలి పంచవర్ష ప్రణాళిక ముగిసేనాటికి అయిదు పారిశ్రామిక శిక్షణ కేంద్రాలు వుండేవి. వీటిలో శిక్షణ పొందుతున్నవారి సంఖ్య 688. ద్వితీయ పంచవర్ష ప్రణాళికాంతానికి 3,528 మంది సంఖ్యతో 10 కేంద్రాలు సర్పడ్డాయి. ఈనాడు ఆంధ్రప్రదేశ్‌లో 7,420 మందితో 22 పారిశ్రామిక శిక్షణ సంస్థలు పనిచేస్తున్నాయి.

రాష్ట్రంలో బొబ్బిలి, విశాఖపట్టణం, కాకినాడ, ఏలూరు, విజయవాడ, తెనాలి, నెల్లూరు, చిత్తూరు, అనంతపురం, ద్రోణాచలం, శ్రీశైలం, నల్గొండ, హైదరాబాదు, సికింద్రాబాదు, సంగారెడ్డి, నిజామాబాదు, వరంగల్లు, పెద్దపల్లి, మంచిర్యాల, కొత్తగూడెం, మచిలీపట్టణంలలో ఈ పారిశ్రామిక శిక్షణ సంస్థలు వున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక శిక్షణ సంస్థలు ఉన్న ప్రాంతాలు, ఆ సంస్థల్లోని సీట్ల సంఖ్య యీదిగువ వివరంగా యివ్వబడినవి.

వ. నం.	పారిశ్రామిక శిక్షణ సంస్థ	పేరు	మొత్తం సీట్ల సంఖ్య
1.	పారిశ్రామిక శిక్షణ సంస్థ,	బొబ్బిలి	256
2.	..	విశాఖపట్టణం	496
3.	..	కాకినాడ	600
4.	..	ఏలూరు	264
5.	..	విజయవాడ	520
6.	..	తెనాలి	256
7.	..	నెల్లూరు	400
8.	..	చిత్తూరు	252
9.	..	అనంతపురం	428
10.	..	ద్రోణాచలం	260
11.	..	శ్రీశైలం	112
12.	..	నల్గొండ	264
13.	..	హైదరాబాదు	1160
14.	..	సికింద్రాబాదు	112
15.	..	సంగారెడ్డి	256
16.	..	నిజామాబాదు	392
17.	..	వరంగల్లు	432
18.	..	పెద్దపల్లి	256
19.	..	మంచిర్యాల	144
20.	..	కొత్తగూడెం	264
21.	ఎ. టి. టి. సంస్థ,	హైదరాబాదు	184
22.	ఎ.జె.కె.ఐ. పాఠశాల,	మచిలీపట్నం	112
			7420

ఆయా ప్రాంతాల అవసరాలను దృష్టిలో వుంచుకుని ఎక్కువగా యిక్కడ ఉదహరించిన వృత్తుల్లో యీ సంస్థలు శిక్షణ యిస్తున్నాయి. డ్రాఫ్ట్స్‌మెన్ (సివిల్) డ్రాఫ్ట్స్‌మెన్ (మెకానికల్) ఎలక్ట్రీషియన్, మెకానిక్(ఇనుస్ట్రుమెంట్స్), మెకానిక్ (రేడియో), కమ్మరి, వడ్రంగం, ఎలక్ట్రోప్లేటింగ్, ఫిట్టర్, లైన్‌మన్ మరియు వైర్‌మన్, మెషినిస్ట్, మెకానిక్ (మోటారు) మోల్డర్, వెల్డర్ (ఎలక్ట్రిక్ మరియు గేస్) ఇంతేగాక టైయిలరింగ్, ఫేన్సీ వస్త్రాల నేత, సూట్‌కేసుల తయారీ, వెదురు, ఫ్రేము పనులు మొదలైన యింజనీరింగేతర పనులలోకూడా శిక్షణ గరపబడుతుంది.

ఈ శిక్షణ సంస్థలలో చేరదలచిన అభ్యర్థులు కనీసం మెట్రిక్యులేషన్‌కుగాని లేదా ఎస్. ఎస్. ఎల్. సి. కి గాని లేదా దానికి సమాన యోగ్యతకుగాని, రెండు స్టేండర్డులు దిగువవరకు చదివి వుండాలి. అయితే (ఎ) డ్రాఫ్ట్స్‌మన్ (సివిల్) డ్రాఫ్ట్స్‌మన్ (మెకానికల్) (బి) ఎలక్ట్రీషియన్ (సి) రేడియో మెకానిక్ (డి) ఇనుస్ట్రుమెంట్ మెకానిక్ మాత్రం మెట్రిక్యులేషన్, లేదా ఎస్. ఎస్. ఎల్. సి ఉత్తీర్ణులై వుండాలి. వయఃపరిమితి 19–25 సంవత్సరాలు. షెడ్యూలు కులాలు, షెడ్యూలు తరగతులకు చెందిన వారి విషయంలో గరిష్ఠ వయఃపరిమితి మూడేళ్ళవరకు సడలించడం జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్‌లోని మాజీ సైనికులు, మాజీ స్వర్ణకారులు కూడా యితరత్రా అర్హులైవుండి వరుసగా 35–36 సంవత్సరాలకు పైబడి వుండకపోతే అట్టివారుకూడా యీ సంస్థలో చేరడానికి అర్హులే. షెడ్యూలు కులాల అభ్యర్థుల నిమిత్తం 12½ శాతం సీట్లు, షెడ్యూలు జాతుల అభ్యర్థుల నిమిత్తం 5 శాతం సీట్లు ప్రత్యేకించబడ్డాయి. ప్రతి వృత్తిలోనూ 10 శాతం స్త్రీల కొరకు, ప్రతి సంస్థలోనూ 5 సీట్లు మాజీ సైనికుల కొరకు ప్రత్యేకించబడ్డాయి.

సాంకేతిక వృత్తులలో శిక్షణకాలం రెండు సంవత్సరాలు. రెండేళ్ళలోనూ ఆరునెలలు పారిశ్రామిక సంస్థలలో ప్లాంట్ ట్రెయినింగ్ కూడా కలిసివుంటుంది. ఇంజనీరింగేతర వృత్తులలో శిక్షణకాలం ఒక ఏడాది మాత్రమే. శిక్షణ ఉచితంగా లభిస్తుంది. అభ్యర్థుల యోగ్యత-అభివృద్ధి ప్రాతిపదికగా 33⅓ శాతం అభ్యర్థులకు నెలకు 25 రూపాయలు స్టయిఫండు యివ్వబడుతుంది. శిక్షణపొందే మాజీ సైనికులు ఆంధ్రప్రదేశ్ పోస్ట్‌వార్ రికనస్ట్రక్షన్ ఫండ్‌నుంచి నెలకు 35 రూపాయలు స్టయిఫండ్ పొందడానికి అర్హులు. హాస్టల్ భవనాలు వున్నచోట 50 శాతం అభ్యర్థులు ఉచిత హాస్టల్ సౌకర్యం పొందుతారు. నాలుగు నెలలకు ఒకసారి వర్క్‌షాపు బట్టలు శిక్షణ పొందేవారికి ఉచితంగా అందజేయడం జరుగుతుంది.


శిక్షణానంతరం తగిన ఉద్యోగాలు లభించే అవకాశాలు చాలా వున్నాయి. హైదరాబాద్‌లోని పారిశ్రామిక శిక్షణ సంస్థ ఆవరణలో యీవిధమైన సాంకేతిక వ్యక్తుల నిమిత్తం ఒక ప్రత్యేక ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛేంజ్ ప్రారంభించబడింది. పారిశ్రామిక శిక్షణ సంస్థలలో శిక్షణపొందిన వారికి పబ్లిక్, ప్రయివేటు రంగాలలోని పరిశ్రమలలో తగిన ఉద్యోగాలను కల్పించే విష

యంలో యీ ప్రత్యేక ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛేంజ్ కృషి చేస్తుంది.

ఈనాడు దేశం అతి క్లిష్టమైన ఘట్టంలో వుంది. ఈ క్లిష్ట కాలాన్ని అధిగమించాలంటే రక్షణ ఉత్పత్తి, పరిశ్రమలు, ముఖ్యంగా వ్యవసాయోత్పత్తి శీఘ్రతరంగా అత్యధికం కావాలి; నేడు మన ప్రగతియాత్రలో, అభ్యుదయ పథంలో పబ్లిక్, ప్రయివేటు రంగాలలోని భారీ, లఘు పరిశ్రమలకు అవసరమయ్యే సాంకేతిక పనివారలకు-సాంకేతిక పనివారలకేకాదు హృదయ పూర్వకంగా దేశ సౌభాగ్యానికి కృషిచేయ సంకల్పించిన స్త్రీ, పురుషులకు-శిక్షణ గరిపి నిరంతరంగా పరిశ్రమలకు అందజేసి మన ప్రజాస్వామిక జీవన విధానంలో సర్వులకు, సౌభాగ్యాన్ని వెదజల్లి, మన దేశాన్ని సాటిదేశాలలో మేటిగా చేయడానికి ఈవృత్తి పనివారల శిక్షణ పథకాలక్రింద రూపొందించబడిన పారిశ్రామిక శిక్షణ సంస్థలు ఎంతగానో దోహదం కలుగజేస్తున్నాయి.

31-7-65 నాటికి వివిధ రాష్ట్రాలలోగల పారిశ్రామిక శిక్షణ సంస్థలు, వాటిలోని సీట్ల వివరాలు యీ దిగువ పొందుపరచబడినవి.

	రాష్ట్రాలు	31-7-1965 నాటికి పనిచేస్తున్న సంస్థలు	31-7-1965 నాటి అక్కడగల సీట్లు
1.	ఆంధ్రప్రదేశ్	22	7420
2.	అస్సాం	10	2580
3.	బీహారు	26	8420
4.	గుజరాతు	18	3028
5.	జమ్మూ, కాశ్మీరు	7	822
6.	కేరళ	10	5336
7.	మధ్యప్రదేశ్	22	6812
8.	మద్రాసు	31	8540
9.	మహారాష్ట్ర	31	9624
10.	మైసూరు	15	3408
11.	ఒరిస్సా	10	2468
12.	పంజాబు	26	8444
13.	రాజస్థాన్	14	3108
14.	ఉత్తర ప్రదేశ్	45	15888
15.	పశ్చిమ బెంగాలు	17	7216
16.	ఢిల్లీ	7	4528
17.	హిమాచల ప్రదేశ్	4	772
18.	మణిపూర్	1	180
19.	త్రిపుర	2	368
20.	గోవా	—	—







శ్రీ కృష్ణపాండవీయం చిత్రానికి రజత నంది బహుమతిని అందుకుంటున్న రామకృష్ణ—ఎన్.ఎ.టి. కంబైన్స్ నిర్మాత శ్రీ ఎన్. త్రివిక్రమరావు.



ఆత్మగౌరవం చిత్రానికి కంచు నంది బహుమతిని అందుకుంటున్న అన్నపూర్ణాపిక్చర్స్ నిర్మాత శ్రీ డి. మధుసూదనరావు.



అంతస్తులు దర్శకుడు శ్రీ వి. మధుసూదనరావు ప్రభుత్వ చిహ్న ఫలకాన్ని, చెక్కును స్వీకరిస్తున్న దృశ్యం.




ఆత్మగౌరవం దర్శకుడు శ్రీ కె. విశ్వనాథ్ ప్రభుత్వ చిహ్నఫలకాన్ని, చెక్కును స్వీకరిస్తున్న దృశ్యం.



చిహ్నా ఫలకాన్ని స్వీకరిస్తున్న శ్రీ ఎ. నాగేశ్వరరావు.



చిహ్నా ఫలకాన్ని స్వీకరిస్తున్న రేలంగి.




చిహ్నా ఫలకాన్ని స్వీకరిస్తున్న కుమారి కృష్ణకుమారి.



చిహ్నా ఫలకాన్ని స్వీకరిస్తున్న కుమారి కాంచన.



ఉత్తమ చలనచిత్ర కథారచయిత్రిగా శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి బహుమతులను స్వీకరిస్తున్న దృశ్యం. ఉత్తమ చలనచిత్ర కథా రచయితకు బహుమతి యివ్వడం ఈ ఏడాదే ప్రారంభించబడింది. ఆత్మగౌరవం చిత్రానికి శ్రీమతి సులోచనారాణి, శ్రీ మారుతీరావుగారలు ఇరువురూ కథా, సంభాషణలు కూర్చారు.




చిహ్నా ఫలకాన్ని, 500. రూ చెక్కును అందుకుంటున్న శ్రీ గొల్లపూడి మారుతీరావు.




గవర్నరు, ముఖ్యమంత్రితో శ్రీకృష్ణపాండవీయం నిర్మాత శ్రీ ఎన్. త్రివిక్రమరావు.




ఉత్సవం ఆఖరున కృతజ్ఞతలు తెలియజేస్తున్న ప్రధాన. కార్యదర్శి శ్రీ కె. ఎన్. అనంతరామన్, ఐ.సి.ఎస్.






గవర్నరు, ముఖ్యమంత్రితో ఆత్మగౌరవం బృందం



ముఖ్యమంత్రితో సినీకళాకారులు



మార్చి 24న ప్రెస్‌క్లబ్ ముందు పాత్రికేయులతో
సినీకళాకారులు

ఆంధ్రప్రదేశ్‌లో సాంఘిక సంక్షేమం

వి. ఆర్. కె. శాస్త్రి, ఐ.ఏ.ఎస్;

భారత దేశంలో సాంఘిక సంక్షేమ పరిధిలో షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులు, యితర వెనుకబడిన జాతులను ప్రత్యేకంగా పేర్కొనాలి. ఇతర వర్గాలకు దూరంగా చిన్న పల్లెలలో షెడ్యూలు కులాలవారు జీవిస్తున్నారు. దేశంలో అనాదిగా ఉన్న అంటరానితనం వారికి కూడా వర్తిస్తున్నది. సంక్షేమ రాజ్యంలో ప్రజల సాంఘిక, ఆర్థిక, భౌతిక, మానసిక బలహీనతలను తొలగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. వెనుక బడిన తరగతులు ప్రత్యేకంగా షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులకు చెందిన ప్రజల విద్యాభివృద్ధికీ, ఆర్థిక అభివృద్ధికీ రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలనీ, సాంఘిక దురన్యాయాలు, యితర విధాలైన దురాచారాల నుండి వారికి రక్షణ కల్పించాలనీ భారత రాజ్యాంగం నిర్దేశించింది.

మద్రాసు నుండి ఆంధ్ర రాష్ట్రాన్ని యేర్పరచిన తర్వాత ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం యేర్పడకముందు బడుగు ప్రజల సంక్షేమాభివృద్ధికి చెందిన కార్యక్రమాలను హరిజన సంక్షేమ శాఖ పేరుతో ప్రత్యేక శాఖ నిర్వహిస్తుండేది. తెలంగాణా ప్రాంతంలో స్వాతంత్ర్యానికి పూర్వంనుండి(1946 నుండి)సాంఘిక సేవ శాఖ పనిచేస్తున్నది. అయితే తెలంగాణా ప్రాంతంలో వరంగల్లు, ఆదిలాబాదు, మహబూబు నగరంలలో ప్రకటింపబడిన గిరిజన ప్రాంతాల అభివృద్ధికే యీశాఖ కార్యక్రమాలు పరిమితమై ఉండేవి. పూర్వపు హైదరాబాదు రాష్ట్రంలోని అన్ని జిల్లాలలోని షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు, వెనుకబడినతరగతులు,

షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులు, యితర వెనుకబడిన తరగతుల ప్రజల జీవనస్థాయిని, యితర వర్గాల జీవన ప్రమాణ స్థాయికి సమంగా అభివృద్ధి పరచడానికి వీలుగా ప్రథమ, ద్వితీయ పంచవర్ష ప్రణాళికలలో అమలు జరిపిన పథకాలు యితర పథకాలకన్నా గమనార్హమైనవి. ఇటువంటి పథకాలను అమలుజరపడంలో చాలా క్లిష్ట సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ పథకాల అమలు ఫలితంగా సాంఘిక వ్యవస్థలో అనేక శ్లాఘనీయమైన మార్పులు కలగడం, యీ వర్గాల స్థితిగతులు అభివృద్ధి కావడం జరుగుతుంది.

దేశంలోని బలహీనవర్గాలవారి-ప్రత్యేకంగా షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలవారి-విద్య, ఆర్థిక పరిస్థితులను ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి పరుస్తుందనీ, సాంఘిక అన్యాయంనుండి, యితర విధాలైన దురాచారాలనుండి వారికి రక్షణ కల్పిస్తుందనీ మన రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలో నిర్దేశించారు. షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల నిమిత్తం కొన్ని రిజర్వేషనులను కూడ రాజ్యాంగం పొందు పర్చింది. ప్రారంభంలో యివి 10 సంవత్సరాల వరకే పరిమితం చేసినా తిరిగి రాజ్యాంగ సవరణద్వారా యీ రిజర్వేషన్ పద్ధతిని మరో పది సంవత్సరాలకు పొడిగించారు. ఈ రక్షణలే ఆ వర్గాల సాంఘిక, ఆర్థిక పరిస్థితులను ప్రతిబింబింప జేస్తున్నాయి. పార్లమెంటు చర్యలు రెండు విధాలైన ప్రయోజనాలను కలిగిస్తాయి. దేశంలోని బలహీన వర్గాలు, షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు, యితర వెనుకబడిన వర్గాల ప్రజల జీవనస్థాయి పెంపుదల సమస్య మొదట్లో భావించినట్టుగా గాక బహు క్లిష్ట సమస్యఅనీ, సుదీర్ఘ కాలం కృషి చేయాల్సి వుంటుందని గుర్తించడం జరిగింది. అంతేగాక ఆర్థికస్థితిని అభివృద్ధి చేయడానికి తీవ్రకృషి అవసరమైనప్పటికీ కనీసం వచ్చే రెండు, మూడు ప్రణాళికల కాలంలో యీ వర్గాల ఆర్థిక, సాంఘిక స్థాయిని యితర ప్రజల ఆర్థిక సాంఘిక స్థాయికి తేవడానికి తీవ్రంగా కృషిచేయాలి. ఇతర వర్గాల స్థాయికి వారు చేరుకోవడం తథ్యం. కేంద్రం, రాష్ట్రాల మూడవ ప్రణాళికలను యీ దృష్టితో తరచుగా మదింపుచేస్తూ వివిధ దశలలో కార్యక్రమాల కేటాయింపులను ఎక్కువచేస్తూ ఉండాలి, సమీకృత సంఘ వ్యవస్థ రూపొందడానికి దేశ ఆర్థిక వ్యవస్థలో మార్పుకు జరిగే కృషిలో యిదొక క్లిష్ట సమస్య.

మొదటి, రెండవ, మూడవ భారత పంచవర్ష ప్రణాళికలలో సాంఘిక సర్వీసుల నిమిత్తం వరుసగా రు.531. కోట్లు (పెట్టుబడిలో దాదాపు 14 శాతం); రు. 850. కోట్లు (పెట్టుబడిలో 18 శాతం), రు.1300. కోట్లు (పెట్టుబడిలో దాదాపు 19 శాతం), అదే విధంగా సాంఘిక సంక్షేమం నిమిత్తం మూడు పంచవర్ష ప్రణాళికలలో వరసగా రు. 5. కోట్లు (సాంఘిక సర్వీసుల కేటాయింపులలో 1 శాతం); రు.19. కోట్లు (2.2 శాతం) రు.31. కోట్లు(2.3 శాతం) కేటాయించ బడ్డాయి. ఆయా ప్రాంతాలలో సాంఘిక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వాల ప్రణాళికేతర కేటాయింపులు యిందులో కలుపలేదు. స్త్రీ జనాభ్యుదయ పథకాలు, శిశు సంక్షేమం, యువజన అభివృద్ధి, వికలాంగుల పునరావాసం, బాల నేరస్థుల నిరోధన, భిక్షుకవృత్తి నివారణ, సాంఘిక, నైతిక సూత్రాల ప్రచారం, సంరక్షణ సర్వీసు, బీదల సంక్షేమం, పరిశోధన, సర్వే, సంక్షేమ శాఖ సిబ్బంది శిక్షణ పథకాల నిమిత్తం ప్రత్యేక కేటాయింపులు చేశారు.

డినోట్ పై చేయబడిన గిరిజనులకు సంక్షేమ కార్య క్రమాలను విస్తరింప జేసిన తర్వాత 1952లో సాంఘిక సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వాన్ని సర్పాటుచేశారు. 1955 లో యీ శాఖ పేరును సాంఘిక సంక్షేమ శాఖగా మార్చారు.

షెడ్యూలు కులాలు, ఆర్థికంగా వెనుకబడిన యితర తరగతులకు సంబంధించినంతవరకు యీశాఖ కార్యక్రమాలను మూడు విధాలుగా విభజించవచ్చు. (1) విద్య (2) ఆర్థిక ఉన్నతి (3) ఆరోగ్యం, గృహవసతి, యితర పథకాలు. ప్రణాళికా కాలాలలో యీ కార్య క్రమాలను చురుకుగా అమలు జరిపారు. ఈ పథకాల అమలుకు ప్రణాళికా కాలాలలో సాంఘిక సంక్షేమశాఖ వార్షికంగా రు 598 లక్షలు ఖర్చు చేస్తున్నది.

విద్యావిస్తరణవల్ల సంఘంలో కలిగే బహువిధాలైన మార్పులను గూర్చి ప్రత్యేకంగా పేర్కొనాల్సిన అవసరం లేదు. హరిజన బాలల విద్యాభివృద్ధికి సహాయపడడానికి మించిన సేవ మరొకటి లేదు. ఈ విధంగా అదృష్టహీన వర్గాల ప్రజలకు ప్రభుత్వం మహోపకారం చేస్తున్నది. భోజన వసతి గృహసౌకర్యం, స్కాలర్ షిప్పులు, పుస్తకాలు వగైరాలకు రొక్కంరూపంలో సహాయం వంటి ఎన్నో కార్యక్రమాలను ఈ శాఖ నిర్వహిస్తున్నది.

ప్రభుత్వ హాస్టళ్లు

షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులు, యితర వెనుకబడిన తరగతులకు యీ శాఖ అమలు జరుపుతున్న సంక్షేమ కార్య క్రమాలలో వారి పిల్లల విద్యాభివృద్ధికి హాస్టళ్లను ఏర్పాటు చేయడాన్ని ప్రత్యేకంగా పేర్కొనవచ్చు. యీహాస్టళ్లను ప్రభుత్వం నెలకొల్పి ప్రభుత్వనిధుల నుండి వీటి నిర్వహణకు డబ్బును ఖర్చు చేస్తున్నారు. ఈ హాస్టళ్లలో ప్రత్యేకంగా షెడ్యూలు కులాల వారికి, కొంత వరకు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి చెందిన విద్యార్థులకు భోజన, వసతి సౌకర్యం కల్పించబడుతున్నది. గుర్తించబడిన పాఠశాలల్లో IV స్టాండర్డు అంతకు మించిన తరగతులలో చదువుతున్న విద్యార్థుల వయఃపరిమితిని ఈ క్రింది పట్టికలో చూడవచ్చును.

తరగతి	వయః పరిమితి (సంవత్సరాలు)
స్టాండర్డు	
IV	12
V	13
VI	14
VII	15
VIII	16
ఫారమ్.	
IV	17
V	18
VI	19
కళాశాల తరగతులు	
తరగతి	
I	20
II	21
III	22
IV	23

ఎలిమెంటరీ, సెంకడరీ పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లి దండ్రుల వార్షిక ఆదాయం రు1,200/-లకు మించకుండాను కళాశాలలలో చదివే విద్యార్థుల తల్లి దండ్రుల వార్షిక ఆదాయం రు 1,500/-లకు మించకుండాను ఉన్న వారికే యీ హాస్టళ్లలో ప్రవేశం లభిస్తుంది. హాస్టళ్లు ఉన్న ప్రాంతానికి మూడు మైళ్ల లోపు దూరంలో ఉన్న విద్యార్థులకు యీ హాస్టళ్లలో ప్రవేశం లభించదు. అయితే విద్యార్థినులకు యీ నిబంధన వర్తించదు. రాష్ట్రం మొత్తంలో 205 ప్రభుత్వ హాస్టళ్లు నిర్వహింపబడుతున్నాయి. వీటిలో 3600 మందికి వసతి కల్పించారు. మొత్తం ఖర్చు రు 52.21 లక్షలు.

ప్రభుత్వం పూర్తిగా తమ నిధులతో హాస్టళ్లు నిర్వహించడంతోపాటు ప్రైవేటు యజమాన్యంలో నిర్వహింపబడే బోర్డింగ్ గృహాలకు సబ్సిడీకూడ ప్రభుత్వం మంజూరు చేస్తున్నది.

ఇటువంటి హాస్టళ్లలో ఉన్న అర్హత గల విద్యార్థులకు ప్రతి ఒక్కరికి పది నెలలకు రు. 200/-ల చొప్పున బోర్డింగ్ గ్రాంట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. హాస్టల్ ఉన్న ప్రదేశానికి మూడు మైళ్లకు మించిన దూరంలో ఉన్న విద్యార్థులకే యీ అర్హత ఉన్నది. బాలికల విషయంలో యీ నిబంధన లేదు. నిర్ణీత వయః పరిమితిలో ఉండి మూడవ తరగతి, అంతకు పైబడిన తరగతులలో చదివే విద్యార్థులందరు యీ గ్రాంట్లకు అర్హులవుతారు. షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులు, విముక్త జాతికి చెందిన విద్యార్థులను వయస్సు తరగతి, ప్రాంత పరిధిల నిబంధనల నుండి మినహాయించడం జరిగింది. రాష్ట్రమంతటా ప్రస్తుతం 1,132 సబ్సిడీ పొందుతున్న హాస్టళ్లు ఉన్నాయి. 42,195 బోర్డింగ్ గ్రాంట్లు మంజూరు చేయబడినవి. ఈ హాస్టళ్లలో 387 బాలికల హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో దాదాపు 11,146 మంది బాలికలు ఉన్నారు. ప్రభుత్వహాస్టళ్లు, సబ్సిడీ పొందుతున్న హాస్టళ్లు జిల్లా పరిషత్తు, పంచాయతీ సమితుల నిర్వహణలో పనిచేస్తున్నాయి.

ఉన్నత పాఠశాలలు కళాశాలలు వృత్తి, సాంకేతిక కోర్సులలో చదువుతున్న అర్హతగల వర్గాల విద్యార్థి విద్యా

థినుల విద్యా విషయక ఖర్చుల నిమిత్తం సహాయంగా యీ శాఖ రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ స్కాలర్‌షిప్పులను మంజూరు చేస్తున్నది.

విద్యార్థులు చెల్లించే ఫీజులు, నోటు బుక్కులు మొదలైన వాటి ఖర్చుల నిమిత్తం నాన్ రెసిడెన్షియల్ స్కాలర్‌షిప్పులు మంజూరు చేయబడుతున్నాయి. షెడ్యూలు జాతులు, నోటిఫై చేయబడిన జాతులు మినహా అర్హత గల విద్యార్థులందరికీ ప్రీ మెట్రిక్ నాన్ రెసిడెన్షియల్ స్కాలర్‌షిప్పులు మంజూరు చేయబడుతున్నాయి. షెడ్యూలు జాతులు, నోటిఫై చేయబడిన జాతులకు కలెక్టర్లు మంజూరు చేస్తారు. అర్హతగల విద్యార్థులకు ప్రీ మెట్రిక్ నాన్ రెసిడెన్షియల్ స్కాలర్‌షిప్పులు, ప్రీ పోస్టు మెట్రిక్ రెసిడెన్షియల్ స్కాలర్‌షిప్పులను సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టరు మంజూరు చేస్తారు. వార్షికంగా నాన్ రెసిడెన్షియల్ స్కాలర్‌షిప్పులు దిగువ రేట్లలో మంజూరు చేయబడుతున్నాయి.

కోర్సు.	షెడ్యూలుకులాలు. షెడ్యూలు జాతులు.	ఇతర వెనుకబడిన తరగతులు.
	రు.	రు.
ప్రీ మెట్రిక్	4 నుండి 200 వరకు	6 నుండి 70 వరకు
వృత్తి విద్య, ఇతర కోర్సులతో		
సహా పోస్టు మెట్రిక్.	14 నుండి 314 వరకు.	54 నుండి 434.
పోస్టు గ్రాడ్యుయేటు కోర్సులు....	23 నుండి 223 వరకు	23 నుండి 283 వరకు.

జన్మస్థలానికి 5 మైళ్ల దూరంలో ఉన్న కళాశాల లేక పాఠశాల హాస్టళ్లలో గానీ, గుర్తించబడిన ప్రైవేటు హాస్టళ్లలో గానీ ఉంటున్న విద్యార్థులకు రెసిడెన్షియల్ స్కాలర్‌షిప్పులు మంజూరుచేయబడుతాయి సంస్థకు అనుబంధంగా ఉన్న హాస్టళ్లలో నివసించే విద్యార్థినులకు యీ నిబంధన వర్తించదు. తెలంగాణా ప్రాంతంలో హరిజన విద్యార్థులు మాత్రమే యీ స్కాలర్‌షిప్పులకు అర్హులవుతారు. పై తెల్పిన రేట్లలో నాన్ రెసిడెన్షియల్ స్కాలర్‌షిప్పులతో పాటు ప్రక్కన తెల్పిన రేట్లలో భోజన వసతి ఖర్చులు రెసిడెన్షియల్ స్కాలర్‌షిప్పులలో ఉన్నాయి.

i. సబ్సిడీ పొందుతున్న హాస్టళ్లలో ఉన్న ఉన్నత పాఠశాల విద్యార్థులకు నెలకు రు. 15/= లు, పదినెలలు.

ii. పాఠశాల హాస్టళ్లలో నివసించే ఉన్నత తరగతులలో చదివే విద్యార్థులు, సబ్సిడీ పొందుతున్న హాస్టళ్లలో నివసించే కళాశాల విద్యార్థులకు పాఠశాల, హాస్టల్ వార్డెన్ కోరిన మేరకు నెలకు రు. 20/= లు లేక అంతకు తక్కువ.

iii. హైదరాబాదు, విశాఖపట్నం, కర్నూలు, గుంటూరులలో కళాశాల హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు 9 నెలలు నెలకు రు. 50/–ల చొప్పున మంజూరు చేస్తారు.

iv. ఇతర ప్రదేశాలలో కళాశాల హాస్టళ్లలో నివసించే విద్యార్థులకు 9 నెలలకు నెలకు రు. 40/= ల చొప్పున.

ఏ హాస్టల్‌లోను ప్రవేశం లభించని విద్యార్థులకు ప్రత్యేక నాన్ రెసిడెన్షియల్ స్కాలర్‌షిప్పులను సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టరు మంజూరు చేస్తారు. ఈ స్కాలర్‌షిప్పు రేట్లు రు. 14 నుండి 25 వరకు ఉంటాయి.

నియమ నిబంధనలకు సంబంధించిన అంశాలు దిగువ విధంగా ఉన్నాయి.

1. రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ స్కాలర్‌షిప్పులు రెండూ విద్యార్థి చేరిన నెలనుండి ప్రారంభమవుతాయి. విద్యార్థి చదువునుండి విరమించుకున్న మొదలు లేక గైర్ హాజర్ అయిన కాలానికి తగు రీతిగా తగ్గింపులు జరుగుతాయి.

2. మొత్తం కోర్సు కాలంలో రెండు సార్లు మాత్రమే ఫేల్ అయినప్పుడు రెండవసారి స్కాలర్‌షిప్పులు మంజూరు చేస్తారు. అవి VI నుండి VIII తరగతులలో ఒకసారి IX నుండి XI తరగతులలో ఒకసారి. ఆర్ట్సు కళాశాలలలో చదివే విద్యార్థులకు ఎట్టి కన్సెషనులు యివ్వబడవు.

3. మెరిట్ స్కాలర్‌షిప్పులు మినహా సాంఘిక సంక్షేమ శాఖ మంజూరు చేసే స్కాలర్‌షిప్పులు పొందేవారు యితర యే స్కాలర్‌షిప్పులను పొందడానికి అనుమతింపబడరు.

4. షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు, నోటిఫై చేయబడిన జాతులకు చెందిన విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులు, లేక సంరక్షకుల వార్షిక ఆదాయ పరిమితి రు. 3,600/- లు ఉంటుంది. అయితే యితర వెనుకబడిన వర్గాలవారి వార్షిక ఆదాయ పరిమితి రు. 1,500/- లకు ఉంటుంది. 1959-60 సంవత్సరానికి పూర్వం పాఠశాలల్లో ఉన్న తెలంగాణా ప్రాంతానికి చెందిన అభ్యర్థులకు యీ నిబంధన వర్తించదు.

5. ప్రభుత్వం విశ్వ విద్యాలయాలకు సంబంధించిన పరీక్షా రుసుముల విషయంలో అర్హతగల వర్గాలకు చెందిన విద్యార్థుల నుండి దరఖాస్తులు అందిన వెంటనే మంజూరు చేయబడతాయి. షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులు, తదితర వెనుకబడిన కులాల వారికి రాష్ట్రప్రభుత్వం యిచ్చే స్కాలర్ షిప్పులకుతోడు కేంద్ర ప్రభుత్వ స్కాలర్ షిప్పులు కూడా కొన్ని వున్నాయి. వీటినే ఇన్‌లేండ్ పోస్టు మెట్రిక్ స్కాలర్

పిప్పులు అంటారు. ఈ స్కాలర్ షిప్పులను మంజూరు చేసే అధికారం వికేంద్రీకరించి కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించగా, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని సాంఘిక సంక్షేమ శాఖకు అప్పగించి, భారత ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిర్ణయించే నియమ నిబంధనల మేరకు వాటిని మంజూరు చేయాలని ఉద్దేశించారు. ఈ స్కాలర్ షిప్పుల మంజూరికి నిర్ణయించిన మీన్స్‌టెస్ట్ ప్రాతిపదిక మీద కేవలం కడపటి వార్షిక పరీక్షలో ఉత్తీర్ణులైనంత మాత్రాన యోగ్యులైన షెడ్యూలు కులాల విద్యార్థులందరికీ భారత ప్రభుత్వ స్కాలర్ షిప్పులు మంజూరు చేస్తారు. వైద్య, ఇంజనీరింగు కోర్సులలో ప్రవేశానికి ప్రయత్నించే షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతుల విద్యార్థుల విషయంలో ఒకసారి పరీక్ష తప్పినప్పటికీ ఈ స్కాలర్ షిప్పులను మంజూరు చేస్తారు. షెడ్యూలు జాతుల విద్యార్థులకు మీన్స్ టెస్ట్‌గాని, యోగ్యత పరీక్ష గాని లేదు. ఇంతవరకు ఇతర వెనుకబడిన కులాల వారికి ఇచ్చే భారత ప్రభుత్వ స్కాలర్ షిప్పులను కులాల ప్రాతిపదిక మీద మంజూరు చేస్తూ వచ్చారు. కాని 1963-64 తర్వాత యీ విధానాన్ని మార్చాలని భారత ప్రభుత్వం భావించి, కులాలతో నిమిత్తం లేకుండా విద్యార్థుల తల్లిదండ్రుల ఆర్థిక స్థితిగతులను బట్టి వారి వార్షిక ఆదాయం రు. 1,500 లకు మించనిచో అట్టివారికి భారత ప్రభుత్వ స్కాలర్ షిప్పులను మంజూరు చేయాలని ఆదేశించింది. వైద్య, టెక్నికల్ విద్యార్థులకు యీ స్కాలర్ షిప్పులు మంజూరు చేసే విషయంలో వారి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. 2,400 లు మించకూడదు.

హాస్టలులో వుండే విద్యార్థులకు నెలకు నిర్వహణ ఖర్చు క్రింద ఆయా కోర్సులను బట్టి రు. 40నుండి రూ. 75 వరకు యిస్తారు.

డే స్కాలర్లకు రూ. 27 నుండి రూ. 60 వరకు వుంటుంది. ఈ స్కాలర్ షిప్పులు గుర్తింపబడిన కొన్ని సంస్థలకు మాత్రమే యిస్తారు. వృత్తి చదువులు చదివే స్కాలర్లకు రైలు, బస్సు మొదలైన వాటికి అయ్యే అసలు పర్యటన ఖర్చులకు పరిమితంచేస్తూ ఏడాదికి రూ. 100 లు వరకు పరిశీలక పర్యటనల ఛార్జీలు యిస్తారు. అయితే అతనికి సంబంధించిన సంస్థ అధిపతి ఆ పరిశీలక పర్యటన అవసరమనిన్నీ, అది లేకుండా అతని కోర్సు పూర్తి కాదనిన్నీ, సర్టిఫై చేయవలసి వుంటుంది. ఈ పథకం క్రింద రిసర్చి స్కాలర్‌లకు కూడా, ఆ సంస్థ అధిపతి సిఫార్సు చేసినచో, థీసిస్ టైపింగ్, ప్రింటింగ్ ఛార్జిలకు రూ. 100 లు యిస్తారు.

పాఠశాలలు :

సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యీ నాడు 544 వరకు సాంఘిక సంక్షేమ పాఠశాలలు వున్నాయి. వీటిలో కృష్ణా జిల్లాలోని దోకిపర్రులో ఒకటి, మచిలీపట్టణంలో ఒకటి, నెల్లూరు జిల్లా కొరిమెర్లలో ఒకటి, తూర్పు గోదావరి జిల్లా అనంతపురంలో ఒకటి. మొత్తం నాలుగు వున్నత పాఠశాలలు ప్రత్యేకంగా షెడ్యూలు కులాల వారికిన్నీ, గుంటూరు జిల్లా, స్టూవర్టు పురం కాలనీలో ఒక ఉన్నత పాఠశాల అప్రకటిత జాతుల వారికిన్నీ ప్రత్యేకించి వున్నాయి. మిగిలినవి ఎలిమెంటరీ పాఠశాలలు.

స్టూవర్ట్ పురంలో ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, సీతానగరంలోనూ, సిద్ధాపురంలోనూ గల రెండు ప్రాథమిక పాఠశాలలు—యివి మినహా మిగిలిన పాఠశాలల నిర్వహణ బాధ్యత ఆయా పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్తులు వహిస్తున్నాయి. వీటి నిర్వాహణ ఖర్చుల కని ప్రతియేటా పంచాయతీరాజ్ సంస్థల అధీనంలో నిధులను వుంచడం జరుగుతున్నది. ఈ ఎలిమెంటరీ పాఠశాలల్లో చదివే షెడ్యూలు కులాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించబడుతున్నది. పుస్తకాలు, స్టేషనరీ నిమిత్తం ఆర్థిక సౌకర్యాన్ని కల్పించే పథకం క్రింద ప్రాథమిక పాఠశాలల్లో చదివే(1 నుంచి 5 తరగతులు)షెడ్యూలు కులాల విద్యార్థులకు సంవత్సరానికి ఒక్కొక్క విద్యార్థికి పలకలు, పుస్తకాలు, బట్టలు, తదితర స్టేషనరీ సామానుల్ని కొనే నిమిత్తం రూ. 6 మంజూరు చేయబడుతున్నవి. స్కాలర్ షిప్పులు పొందడానికి యీ విద్యార్థులు అర్హులు కారు.

ఆర్థిక ప్రగతి పథకాలు

విద్యకు సంబంధించిన పథకాల తర్వాత ప్రధానమైనవి ఆర్థిక ప్రగతికి సంబంధించిన పథకాలు. ఈ కార్యక్రమం క్రింద శిక్షణ-ఉత్పత్తి కేంద్రాలకు సంబంధించిన పథకాలను చేపట్టడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన పథకాల క్రింద ద్వితీయ ప్రణాళికా కాలంలో [illegible] కేంద్రాలకు ప్రారంభించి మామూలు కేటాయింపులతోనే వీటిని కొనసాగించడం జరుగుతున్నది. హరిజన యువకులకు ఆయా ప్రాంతాలకు అనువైన వివిధ చేతిపనులలో శిక్షణయిచ్చి, వారి సాంఘిక, ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పుతెచ్చి, వారి జీవన స్థితిగతులను అభివృద్ధిపరచడానికి యీ కేంద్రాలలో వారికి శిక్షణ గరపబడుతున్నది.

ప్రతి సంవత్సరం, అనుమతించబడిన సంఖ్యలో అభ్యర్థులను చేర్చుకుని, వారికి అభిరుచివున్న చేతిపనిలో ఒక ఏడాది పాటు శిక్షణ గరపబడుతుంది. శిక్షణ కాలం పూర్తయ్యాక జీవనభృతి వెతుక్కునే నిమిత్తం వీరికి పనిముట్లు, పరికరాలు రూపంలో ఆర్థిక సహాయం కల్పించబడుతుంది. శిక్షణ కాలంలో వీరికి స్టయిఫండు కూడా యిస్తారు. అర్హులైన బోధకులు వీరికి శిక్షణ యిస్తారు. ఈ కేంద్రాలు యిప్పుడు ఆయా జిల్లా పరిషత్తుల అధీనంలో వున్నాయి. ఈ కేంద్రాలు యీ దిగువ పేర్కొన్న ప్రాంతాలలో వున్నాయి.

ఆంధ్ర ప్రాంతం

వస్త్రం కేంద్రాలు	సంఖ్య 2	రూ. 85,400
ఒక్కొక్క కేంద్రంలోను మంజూరీ అయిన సీట్ల సంఖ్య	20 అభ్యర్థులు	
స్టయిఫండు	శిక్షణ పొందుతున్న వ్యక్తి ఒక్కొక్కరికీ	రూ. 20
సోమన్న దొడ్డి	అనంతపురం జిల్లా	
బుట్టల తయారీ కేంద్రాలు	సంఖ్య 2	రూ. 15,800
ఒక్కొక్క కేంద్రంలోనూ మంజూరైన సీట్ల సంఖ్య	15	
వియ్యన్నపేట	విశాఖపట్నం	
చిత్తూరు	చిత్తూరుజిల్లా	

దుస్తుల తయారీ కేంద్రాలు

ఒక్కొక్క కేంద్రంలోనూ మంజూరీ సీట్ల సంఖ్య — సంఖ్య ఆంధ్ర 11 + తెలంగాణ 5

రూ. 2,10,500

స్టయిఫండ్ నెలకు రూ. 20

1.	శ్రీకాకుళం	శ్రీకాకుళం జిల్లా
2	విశాఖపట్నం	విశాఖ జిల్లా
3.	కాకినాడ	తూర్పుగోదావరి జిల్లా
4.	తాడేపల్లిగూడెం	పశ్చిమగోదావరి జిల్లా
5.	విజయవాడ	కృష్ణా జిల్లా
6.	మంగళగిరి	గుంటూరు జిల్లా
7.	కడప	కడప జిల్లా
8.	అనంతపురం	అనంతపురం జిల్లా
9.	చిత్తూరు	చిత్తూరు జిల్లా
10.	కర్నూలు	కర్నూలు జిల్లా
11.	నెల్లూరు	నెల్లూరు జిల్లా

తెలంగాణా ప్రాంతం

శిక్షణ మరియు చర్మవస్తువుల తయారీకేంద్రం	సంఖ్య—5	రూ. 1,22,800
ఒక్కొక్క కేంద్రంలో మంజూరైన సీట్ల సంఖ్య	30	
స్టయిఫండ్	నెలకు రూ. 20	

1.	ఉప్పల్	హైదరాబాదు జిల్లా
2.	అర్మూరు	నిజామాబాదు జిల్లా
3.	నర్సింగి	మెదక్ జిల్లా
4.	రఘునాథపల్లి	వరంగల్లు జిల్లా
5.	1) చెర్లపల్లి 2) పోచంపల్లి 3) మట్టంపల్లి	నల్గొండ జిల్లా

శిక్షణ కేంద్రాలు

1.	సికింద్రాబాదు	హైదరాబాదు జిల్లా
2.	బేగంపేట	
3.	అంబర్ పేట	
4.	ఖైరతాబాదు	
5.	బొల్లారం	

ఆరోగ్య, గృహ వసతి, తదితర పథకాలు

గ్రామశివార్లలో విడిగా హరిజనులు నివసిస్తువుండడం మనకు తెలిసిన విషయమే. వారిలో ఒక విధమైన తక్కువ భావమూ, కలిసి వుండలేని వేరు తనమూ కలకడానికి యిది దోహదం చేసింది. అందువల్ల తోటి హిందువులతో సమానంగా కలిసి మెలిసి ప్రవర్తించడం వారికి యిబ్బంది కరంగా వుంటున్నది. పూరి ప్రజలలో వారు ఏవిధంగానూ ఏ వ్యక్తి కన్నా తక్కువ కాదనేభావం వారిలో కలిగించవలసిన అవసరం వుంది. హరిజన వాడలలో పారిశుధ్య సౌకర్యం లేని యిరుకు, మురికి ప్రాంతాలలో నివసిస్తున్న నీరు హరిజనులకు విముక్తి కలిగించి ఇండ్ల స్థలాలను పంపిణీ చేసే విషయమై స్థలాలు సేకరించబడ్డాయి, సేకరించ బడుతున్నాయి. స్వంత యిళ్ళస్థలం లేని ప్రతి హరిజన కుటుంబానికి 5 సెంట్ల భూమిని యివ్వడం జరుగుతున్నది. పారిశుధ్య సౌకర్యాలకు సంబంధించిన పథకం క్రింద షెడ్యూలు కులాలు, షెడ్యూలు జాతులు, తదితర అప్రకటిత జాతుల గృహాలు అధికంగా ఒకేచోట వున్న గ్రామీణ ప్రాంతాలలో నీటిఎద్దడి వున్న చోట మంచినీటి బావులు త్రవ్వడం జరుగుతున్నది.

షెడ్యూలు జాతుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం అనేక చర్యలను తీసుకుంటున్నది. ఈ సంక్షేమ పథకాలన్నీ ముఖ్యంగా రవాణా, వార్తా సౌకర్యాలను, విద్యను అభివృద్ధి పరచడానికీ, గిరిజన ఆర్థిక వ్యవస్థను మెరుగు పరచడానికీ వారికి సంబంధించిన వైద్య, ఆరోగ్య స్థితిగతులనూ, వారి వ్యవసాయ, మత్స్య, కుటీర పరిశ్రమలను అభివృద్ధి పరచడానికీ, చిన్నతరహా నీటి పారుదల సౌకర్యాలను విస్తృత పరచడానికీ ఉద్దేశించబడ్డాయి.

గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ, హైదరాబాదు

వివిధ భాషలకు, వివిధ జాతులకు చెందిన గిరిజనులు ఆంధ్ర ప్రదేశ్‌లో 13.24 లక్షలు మంది వున్నారు. ఇది చాలా ఎక్కువ మొత్తమే. వీరి సాంస్కృతిక, సాంఘిక, ఆర్థిక సమస్యలను సశాస్త్రీయంగా పరిశోధించే నిమిత్తం కేంద్రప్రభుత్వం తలపెట్టిన పథకం క్రింద హైదరాబాదులో 1963 లో ఒక గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ ఏర్పాటు చేయబడింది. (1) గిరిజనులను గురించీ, వారి సమస్యలను గురించీ సాంఘిక-ఆర్థిక పరిశీలనలను నిర్వహించటం (2) ఆయా గిరిజనుల ప్ర[illegible] సమస్యలను పరిశీలించి, వారి సమస్యలను తొలగించడానికి పరిపాలనా శాఖలకు నిపుణుల నివేదికలను అందజేయడం యీ సంస్థ ప్రధాన కార్యక్రమాలు. అంతే గాక ఆయా గిరిజనుల శరీర పరిణామానికీ, మానసిక, సాంఘిక స్థితిగతులకూ సంబంధించిన సమస్యలపై పరిశీలనలు, పరిశోధనలు యిక్కడ జరుపుతారు. పైగా, గిరిజన పునశ్చరణ తరగతులను యీ సంస్థ నిర్వహించి, అందులో వివిధ శాఖల సిబ్బందికి శిక్షణ యిస్తారు.

అప్రకటిత జాతులు కొన్ని వున్నాయి. ఎరుక, ఏనాది, సుగాలీ జాతులు అలాంటివే. ఆంధ్రప్రాంతంలో యివి షెడ్యూలు జాతులుగా గుర్తింప బడినప్పటికీ తెలంగాణా ప్రాంతంలో మాత్రం వీటిని అప్రకటిత జాతులుగానే భావించడం జరుగుతోంది. వారి ఆర్థిక, విద్యా విషయక సమస్యలను మెరుగు పరిస్తేనే గాని నేరస్వభావాలను వారు వదిలిపెట్టలేరు. ఇందుకుగాను ప్రత్యేక పాఠశాలలు, ఇండ్లు, మంచి నీటి బావులు మొదలైన సౌకర్యాలను వారికి అందజేయడం జరుగు తున్నది.

ఈనాడు ఆంధ్రప్రదేశ్‌లో కర్నూలు జిల్లా సిద్ధాపురం, గుంటూరుజిల్లా సీతానగరం, స్టూవర్టుపురంలలో మొత్తం మూడు అప్రకటిత జాతుల కాలనీలు వున్నాయి. ఇవి సాంఘిక సంక్షేమశాఖ అధ్వర్యంలో వున్నాయి. స్వతస్సిద్ధంగా నేరస్వభావంగల యిటువంటి వారిని సత్ప్రవర్తనులుగా తీర్చిదిద్ది, వారికి పునరావాసం కల్పించే నిమిత్తం 1913, 1914 లో యీ కాలనీలు ప్రారంభించబడి కొనసాగించబడుతున్నాయి. వీరికి యిళ్ళను యిస్తున్నారు. విద్యాసౌకర్యం తదితర సౌకర్యాల్ని కల్పిస్తున్నారు.

కులం ప్రాతిపదికగా తదితర వెనుకబడిన కులాలవారి సంక్షేమం నిమిత్తం [illegible] సౌకర్యాలు యిచ్చే పద్ధతిని ఆర్థిక స్థితిగతులు ప్రాతిపదికగా అందజేసే పద్ధతికి మార్పు చేయడంజరిగింది. కులంతో నిమిత్తం లేకుండా రూ 1,500 లు వార్షిక కుటుంబ ఆదాయం మించని వారికి పై సౌకర్యాలను కలిగించే పద్ధతి అమలులోకి వచ్చింది.

సాంఘిక, నైతిక పునరుద్ధరణ కార్యక్రమాల క్రింద బాల నేరస్తులకు, సముద్ధరణ గృహాలు నుండి విడుదలైన వ్యక్తులకు పునరావాసం కల్పించబడుతున్నది. వీరిని సమాజంలో బాధ్యతా రహితంగా విడిచి వేయడం వలన వీరు పూర్వపు జీవితంవైపు మొగ్గే అవకాశంవుంది. అటువంటివారికి పని కల్పించి, వ్యాపకం ఒకటి వుండేటట్టు చేయడం వారికే గాక సమాజానికికూడా శ్రేయోదాయకం. అటువంటి వారికి పునరావాసం కల్పించేవుద్దేశంతో యీ దిగువ పేర్కొన్న సముద్ధరణ గృహాలను (హోంలను) నిర్వహించడం జరుగు తున్నది. ఈ గృహాలలో వీరికి ఏదో ఒక వృత్తిలో శిక్షణ గరపబడుతుంది.

1.	రాష్ట్ర సముద్ధరణ గృహం	హైదరాబాదు (కరక్షనల్ హోం)	శిక్షణ పొందుతున్న వారి సంఖ్య 60
2.	,,	రాజమండ్రి ,,	40
3.	,,	గుంటూరు (నాన్ కరక్షనల్)	50

హైదరాబాదు రాజమండ్రిలలోని పై గృహాలు జైళ్ళశాఖకు అప్పగించడం జరిగింది.

వృద్ధులు, దుర్బలుల నిమిత్తం 1962-63 లో హైదరాబాదు, [illegible] పురంలో 200 మందితో ఒక హోం ప్రారంభించ బడింది. ఇందులో స్త్రీలకు, పురుషులకు విడి విడి విభాగాలు వున్నాయి. 60 సంవత్సరాలకు పైబడిన గతిలేనివారికి, వయస్సుతో నిమిత్తం లేకుండా [illegible]లైన వ్యక్తులకూ యిందులో ప్రవేశం వుంటుంది ఇందులో చేర్చుకోబడిన ప్రతి ఒక్కొక్కరికి ఒక దూది పరుపు, ఒక బ్లాంకెటు, రెండు దుప్పట్లు, ఒక తలగడ, ఒక తువ్వాలు యిస్తారు. ఇవిగాక సంవత్సరానికి మూడు జతల బట్టలు యిస్తారు. వృద్ధులు, అంధులు, దుర్బలుల నిమిత్తం 1964-65లో విజయవాడలో ఒక హోం ప్రారంభించ బడింది. ఇందులో చేర్చుకోబడేవారి సంఖ్య 50. వీరికి కూడా హైదరాబాదులోని హోంలో వారికి కల్పించబడిన సౌకర్యాలే కల్పించబడు తున్నాయి. 50 మందితో హైదరాబాదులో ఒకటి, 60 మందితో కాకినాడలో ఒకటి మొత్తం రెండు ఆశ్రయ గృహాలను సాంఘిక సంక్షేమశాఖ నెలకొల్పి, నిర్వహిస్తోంది. వీటిలో కొంత వయసులోపు దిక్కులేని పిల్లలను చేర్చుకొని ఉచితవిద్య, భోజన, వసతి సౌకర్యాలు అందజేయడం జరుగుతోంది.

ఆంధ్ర ప్రదేశ్‌లో గిరిజనులు

జిల్లావారీ జనాభా

వరుస నం.	జిల్లా పేరు	మొత్తం జనాభా	షెడ్యూల కులాల జనాభా	షెడ్యూలు జాతుల జనాభా	షెడ్యూలు ప్రాంతాలు చ. మైళ్ళలో
1	అనంతపురం	17,67,464	2,36,285	48,500	
2.	చిత్తూరు	1[illegible],14,639	3,40,134	50,932	
3.	కడప	13,42,0[illegible]5	1,48,616	22,457	
4	తూర్పు గోదావరి	23,08,375	4,59,656	1,00,348	2,592.85
5.	గుంటూరు	30,09,900	1,57,850	95,457	
6.	కృష్ణా	20,78,956	2,23,332	37,473	
7.	కర్నూలు	10,08,740	1,06,084	90,040	
8.	నెల్లూరు	20,33,679	3,35,326	1,31,509	
9.	శ్రీకాకుళం	23,40,873	2,20,767	1,92,276	509,00
10.	విశాఖపట్నం	22,90,759	1,85,046	2,13,820	2,606.00
11.	పశ్చిమ గోదావరి	19,78,257	3,04,578	44,058	583.03
12.	ఆదిలాబాదు	10,09,292	1,87,124	1,31,971	1,771.23
13.	హైదరాబాదు	20,62,995	3,26,203	1,551	
14.	కరీంనగర్	16,21,515	3,15,233	13,116	
15.	ఖమ్మం	10,57,542	1,42,954	1,71,284	2,596.69
16.	మహబూబ్‌నగర్	15,90,686	2,91,878	4,750	552.98
17.	మెదక్	12,27,361	2,09,359	85	
18.	నల్గొండ	15,74,946	15,74,946	2,69,449	471.00
19.	నిజామాబాదు	10,22,013	1,63,104	739	
20	వరంగల్లు	15,45,435	2,60,503	32,936	333.11
	మొత్తం ...	3,59,83,447	49,73,616	13,24,368	11,594.88

ఆ[illegible] గిరిజనుల జనాభా

[illegible]వరాలు

1.	కోయలు	2,20,146
2.	బగతలు	55,154
3.	చెంచులు	17,609
4.	గడబాలు	21,840
5.	గోండులు	1,43,680
6.	గౌడులు	3,392
7.	కొండరెడ్లు	3,894
8.	జటాపులు	62,794
9.	కమ్మరలు	24,629
10.	కొండదొరలు	86,911
11.	కొండ కాపులు	29,823
12.	కొండ రెడ్లు	35,439
13.	గోండులు	21,754
14.	కోటియా బెంతు ఒరియాలు	11,008
15.	మాలిలు	1,443
16.	మన్నెదొరలు	8,476
17.	ముఖదొరలు	9,965
18.	పోర్జలు	9,350
19.	ప్రధానులు	9,701
20.	నాయకులు	2,902
21.	రెడ్డి దొరలు	3,132
22.	సవరలు	68,185
23.	సుగాలీలు	96,174
24.	తోటీలు	546
25.	వాల్మీకులు	22,354
26.	ఏనాదులు	2,05,381
27.	ఎరుకులు	1,28,024
28.	అంధలు	1,468
29.	భిల్లులు	83
30.	కట్టునాయకన్లు	74
31.	కులియలు	85
32.	రోనలు	23
33.	కొలములు	16,731

ఆలోచనలూ - అభిప్రాయాలూ

*మంచి సద్గుణ సంపన్నురాలైన పిల్లను ఎన్నుకుని వివాహం చేసుకోండి. వివాహానంతరం భార్యను సరిగా చూడండి. నిరాదరణ చేయవద్దు. నాకు స్త్రీలలో అచంచలమైన విశ్వాసం వుంది. నా భార్యలో నాకు ఎంతో విశ్వాసం ఉన్నది. ఇప్పుడు నేను జీవితంలో యింత ఉన్నత స్థితిని పొందగలిగానంటే దానికి కారణం నాభార్యే.

—మైసూరు ముఖ్యమంత్రి

*అశ్లీల మనేది అసలు వసువులో కాక చూచేవారిలోనే వుంటుందని ఇంగ్లీషులో ఒకనానుడి. అశ్లీలంకోసంవెదకడం మొదలు పెడితే మన సంస్కృతాంధ్ర కావ్యాలేవీ ముట్టడానికైనా వీలుపడదు; మన ప్రాచీన శిల్ప చిత్ర కళా ఖండాలుగాని, పాశ్చాత్య దేశాల ప్రాచీనాధునిక కళాఖండాలుగాని ఏవీ నిలవవు.

—ఆంధ్రజ్యోతి

*సుదీర్ఘ జీవితం ప్రస్తుతం మానవునికి అందని ప్రాని పండు; అందుచేత దానికోసం ఆరాటపడవచ్చు. కాని నిజంగానే అది లభిస్తే మానవుడు భరించగలడా? ఇప్పటి ఆయుః ప్రమాణాలనుబట్టి చూసినా వృద్ధాప్యం ఎంత దుర్భరమైనది! ముఖ్యంగా, వృత్తి వ్యాపారాలనుంచి రిటైరయినతరువాత పనిపాటు లేకుండా గోళ్ళు గిల్లుకుంటూ, యితరులపై ఆధారపడుతూ, మృత్యువు రాని, బ్రతుకుపోని స్థితిలో రోజులు వెళ్ళబుచ్చడం చాలా దయనీయమైన దశ. దానికంటే మృత్యువే ఆహ్వానించ దగినదిగా తోస్తుంది.

—ఒకపత్రిక సంపాదక వ్యాఖ్య

*ఆంధ్ర రాజులు హిందూ మతావలంబకులు. వారు క్షాత్రానికి, శౌర్యానికి మారుపేరు. కాని అంతఃపురంలోని రాణులు బౌద్ధ మతావలంబకులు. వారు సౌకుమార్యం, లాలిత్యం, శాంతీ మూర్తీభవించినవారు.

—కేంద్ర విద్యామంత్రి

*సకల భోగభాగ్యాలతో తులతూగుతున్న అమెరికాలో చాలామందికి రాత్రిళ్ళు సరిగా నిద్ర పట్టదు. పెక్కుమంది నరాలవ్యాధులతో బాధపడుతున్నారు. అందువల్ల యిక్కడ నిద్ర మాత్రలకు నానాటికీ గిరాకీ పెరిగిపోతున్నది. అమెరికాలో ప్రతి ఏడాది సుమారు 210 కోట్ల రూపాయల విలువగల నిద్ర మాత్రలు అమ్ముడు పోతున్నాయట.

—వార్త

*మనదేశంలో ఒక ఉద్యోగానికి వంద లాది దరఖాస్తులు వస్తాయి. కాని లండన్‌లో ఒక దరఖాస్తుదారుకు పదిహేను ఉద్యోగాలు ఉన్నవట. ఉద్యోగుల కొరత - ఉద్యోగాల కొరతగాదు-నివారించే నిమిత్తం లండన్‌లో వివాహితలుకూడా పనిచేయడానికి అవకాశాలు కల్పిస్తున్నారు. పసిపిల్లలు వున్న తల్లులు తమ్మ పిలలను ఆఫీసుకు తీసుకువచ్చి, వారికోసం ప్రత్యేకించిన గదిలో వారిని వుంచి హాయిగా పనిచేసుకోవచ్చు.

—వార్త

*వెనుకటికి హరిశ్చంద్రుని అష్టకష్టాలు పెట్టిన తరువాత "నీసత్య నిష్ఠను పరీక్షించడానికే ఇదంతా చేశా" నన్నాడట విశ్వామిత్రుడు. అలాగే అయిదవ ఉక్కు-ఫ్యాక్టరీ స్థలనిర్ణయంపై కాలయాపన ఆంధ్రుల సహనాన్ని పరీక్షించడానికే జరుగుతున్నదా అనిపిస్తున్నది. ఎటొచ్చీ ఆంధ్రులందరు హరిశ్చంద్రులు కారు, అంతులేని సహనం వహించడానికి.

—ఒక సంపాదకీయవ్యాఖ్య

హిందూస్తాన్ యంత్రపరికరాల కర్మాగారం సాధించిన అభివృద్ధి

—ఎస్. ఎం. పాటిల్

> హైదరాబాదులో 5వ ఫ్యాక్టరీకి సంబంధించిన నిర్మాణకార్యక్రమం రు. 7.75 కోట్ల పెట్టుబడి ఖర్చు అంచనాతో 1964 మేలో ప్రారంభమైంది. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం సుమారు 850 ఎకరాల స్థలం యీ ఫ్యాక్టరీ కోసం ఉచితంగా యిచ్చింది.

స్వతంత్ర భారతదేశంలో పంచవర్ష ప్రణాళికలు ప్రారంభమైన క్రొత్తలోనే, దేశంలో పారిశ్రామిక ప్రగతి సాధించాలంటే ఒక సమగ్రమైన యంత్ర పరికరాల పరిశ్రమను అభివృద్ధి పరచుకోవాలనీ, తద్వారా పారిశ్రామికోత్పత్తికి తోడ్పడే యంత్రాలను తయారుచేసుకోవడం అవసరమనీ గుర్తించడం జరిగింది. ఈ ఉద్దేశంతోనే 1949 మార్చి నెలలో భారత ప్రభుత్వం స్విడ్జర్‌లాండ్‌కు చెందిన ఓర్లికన్ బెహ్రూల్ అండ్ కంపెనీ యంత్ర పరికరాల ఉత్పత్తి సంస్థతో సాంకేతిక సహాయ ఒడంబడిక కుదుర్చుకున్నది. దేశంలో ఒక యంత్రపరికరాల సంస్థను ఏర్పాటు చేయడానికి యీ ఒడంబడిక ఉద్దేశించబడింది. ఆ విధంగా బెంగుళూరులోని హిందూస్తాన్ యంత్రపరికరాల ఫ్యాక్టరీ స్థాపించడం జరిగింది. 1955 అక్టోబరులో పండిట్ నెహ్రూ యీ సంస్థ యొక్క ప్రథమ కర్మాగారానికి ప్రారంభోత్సవం చేశారు.

కృత్యాద్యవస్థ :

ఆరంభంలో చాలా యిబ్బందులు, అపజయాలను ఎదుర్కొంటున్నందువల్ల హిందూస్తాన్ యంత్ర పరికరాల ఫ్యాక్టరీలో 1956 లో ఎక్కువ షిప్టులలో పని చేసే పద్ధతి ప్రవేశపెట్టబడింది. దీనికి అవసరమైన సిబ్బందిని తీసుకుని వారికి తగిన తర్ఫీతు యివ్వడం జరిగింది. ఫ్యాక్టరీకి సంబంధించిన నిత్యనైమిత్తిక కార్యకలాపాలలో తగినంత స్వేచ్ఛ వుండడానికై ఆ సంవత్సరమే స్విడ్జర్‌లాండ్ సంస్థ యొక్క ఆర్థిక భాగస్వామ్యము రద్దుచేయబడింది. ఈ భాగస్వామ్యంవల్ల పనిచేయడంలో అనేక యిబ్బందులను ఎదుర్కొనవలసి వచ్చింది. ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని పూర్తిగా భారత ప్రభుత్వమే స్వీకరించి, ఓర్లెకన్స్ సంస్థ వారికిగల మూలధనాన్ని కూడా కొనివేసింది. ఇవీ, యింకా మరి కొన్ని చర్యలు తీసుకున్నందువల్ల, ఫ్యాక్టరీ పనిలో నైపుణ్యం పెరగడం, ఉత్పత్తి హెచ్చడం జరిగి 1960-61 సంవత్సరంలో చెప్పుకోదగినంతగా లాభం వచ్చింది. ఆ సంవత్సరం ఓం ప్రథమంగా 10 శాతం డివిడెండ్ ప్రకటించారు. అంతేకాక మిగిలిన లాభంతో బెంగుళూరులో రెండో ఫ్యాక్టరీ కూడా స్థాపించడానికి అవకాశం కలిగింది. దీనికి కూడా పండిత నెహ్రూ 1961 జూలై 28 వ తేదీన ప్రారంభోత్సవం చేశారు. ''జాతికి ఒక బహుమతి''అని యీ ఫ్యాక్టరీని ఆయన అభివర్ణించారు. ఈ ఫ్యాక్టరీ విదేశ సాంకేతిక సహాయంగానీ, భారత ప్రభుత్వ ఆర్థిక సహాయంగానీ లేకుండా స్వయంగా నిర్మించబడి ప్రారంభించబడినది,

ఫ్యాక్టరీ ఉత్పత్తి ఆయేటి కాయేడు బాగా పెరిగింది. 1956-57 లో బెంగుళూరు ఫ్యాక్టరీ (నెం. 1) 135 యంత్రాలను తయారుచేసింది. వీటివిలువ రు. 50లక్షలు. 1957-58 లో రు. 155 లక్షల విలువగల 402 యంత్రాలు తయారైనవి. ఆ తరువాత సంవత్సరంలో ఉత్పత్తి: యంత్రాలు 552; విలువ రు. 200 లక్షలు 1959-60 లో 702 యంత్రాలు తయారైనవి; విలువ రు. 225 లక్షలు, బెంగుళూరు ఫ్యాక్టరీ పూర్తి ఉత్పత్తి శక్తిని అందుకున్న 1960-61 సంవత్సరంలో ఉత్పత్తి 1002 యంత్రాలు, వాటి విలువ రు. 350 లక్షలు. 1961-62 లో రెండో ఫ్యాక్టరీ ఉత్పత్తి ప్రారంభించింది. అప్పుడు రెండింటిలో కలిసి రు. 445 లక్షల విలువగల 1250 యంత్రాలు తయారైనవి. రెండవ ఫ్యాక్టరీలో 1962-63 సంవత్సరంలో చెప్పుకోతగిన ఉత్పత్తి జరిగింది. ఆయేడు రెండింటిలో కలిసి రు. 670 లక్షల విలువగల 1615 యంత్రాలు తయారైనవి. 1963-64 సంవత్సరం బెంగుళూరులోని రెండు ఫ్యాక్టరీలు పూర్తి ఉత్పత్తి శక్తితో పనిచేసినవి. ఆయేడు తయారైన యంత్రాల సంఖ్య 2,000; వాటి విలువ రు. 925 లక్షలు.

కొత్త విభాగాలు :

ఆమేటి కామేడు లభించే ఫలితాలు ప్రోత్సాహకరంగా వున్నందువల్ల, మూడో ప్రణాళికాకాలంలో యింకా మూడు యంత్ర పరికరాల ఫ్యాక్టరీల నిర్మాణాన్ని చేపట్టగలమనీ, యిందులో ఒకదానిని తనస్వంత లాభాలతో నిర్వహించుకోగలమనీ 1961 లో ఫ్యాక్టరీ మేనేజిమెంటు భారత ప్రభుత్వానికి నివేదించింది. భారత ప్రభుత్వం దీనికి అంగీకరించింది. 1962-63 లో పంజాబ్ లో చండీఘర్‌కు సమీపానగల పింజోరీలో పంజాబ్ ప్రభుత్వం ఉచితంగా యిచ్చిన 900 యకరాల స్థలంలో మూడవ ఫ్యాక్టరీ స్థాపించబడింది. దీనికి కూడా 1963 అక్టోబరులో పండిత నెహ్రూయే ప్రారంభోత్సవం చేశారు. ఆనాటి నుంచి ఉత్పత్తి ప్రారంభమైంది. 1965-66 నాటికి యీ ఫ్యాక్టరీల పూర్తి ఉత్పత్తి శక్తిని అందుకుంటుంది.

1964 లో ఎర్నాకుళంవద్ద కాలమస్సేరీ లో 4 వ యంత్ర పరికరాల ఫ్యాక్టరీ నిర్మించబడింది. బెంగుళూరు, పింజోరీలలోవలె యిక్కడ కూడా స్వయం పోషకమైన ఒక చిన్న పట్టణం వెలుస్తున్నది. ఇది పూర్తికావచ్చింది. ఫ్యాక్టరీకి, కాలనీకి కావలసిన సుమారు 850 యకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరించి ఉచితంగా యిచ్చింది. ఈ ఫ్యాక్టరీ నెలకొల్పడానికి అవసరమైన రు. 7.75 కోట్ల పెట్టుబడి ధనం మొదటి రెండు ఫ్యాక్టరీల ద్వారా వచ్చిన లాభాలతో సమకూర్చబడింది. 1964 అక్టోబరు 2 వ తేదీన హెచ్. యం. టి. ఛైర్‌మన్ శ్రీ యం.యం. ఫిలిఫ్ దీనిని లాంఛనంగా ప్రారంభించారు.

హైదరాబాదులో 5 వ ఫ్యాక్టరీకి సంబంధించిన నిర్మాణ కార్యక్రమం రు. 7.75 కోట్ల పెట్టుబడి ఖర్చు అంచనాతో 1964 మేలో ప్రారంభించడం జరిగింది. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం సుమారు 850 ఎకరాల స్థలం దీనికోసం ఉచితంగా యిచ్చింది. ఈ ఫ్యాక్టరీ కూడా, లోగడ నెలకొన్న మూడు ఫ్యాక్టరీలవలె, విదేశీ నిపుణుల సాంకేతిక సహాయం లేకుండా పూర్తిగా భారతీయ ఉద్యోగుల ప్రజ్ఞా ప్రాభవంతోనే నిర్మించబడింది.

హెచ్. యం. టి. కి సంబంధించిన 5 ఫ్యాక్టరీలు కలిసి 1967 నాటికి ఏటేటా రు. 25 కోట్ల విలువగల యంత్ర సామగ్రిని తయారు చేయగలమని అంచనా. అప్పుడు 15 వేల మంది పనివారు కంపెనీ లలో పనిచేస్తుంటారు.

ఉత్పత్తిలో వైవిధ్యము :

1956 లో ఓర్లికన్స్ సంస్థవారి ''హైస్పీడ్, హైప్రెసిషన్ సెంటర్‌లాథే'' యంత్రంతో ఉత్పత్తి ప్రారంభమైంది. దీనిని క్రమేణా రకరకాల పరికరాల ఉత్పత్తికి మార్పు చేసుకుని కొనుగోలు దార్ల అవసరాలకు అనుగుణంగా ఫ్యాక్టరీలను, ఉత్పత్తులను రూపొందించుకోవడం జరిగింది. 1957-58 లో మిల్లింగ్ యంత్రాల ఉత్పత్తి కూడా చేపట్టబడింది. అలాగే ఆ తరువాత సంవత్సరంలో రకరకాల డ్రిల్లింగ్ రేడియల్ డ్రిల్లు యంత్రాల నిర్మాణం ఆరంభమైంది. 1959-60 లో సాధారణ అవసరాలకు పనికివచ్చే లాథే యంత్రాలు, 1960-61 లో సిమెట్రికల్, యూనివర్సల్ గ్రైండింగ్ యంత్రాలు నిర్మించడం ప్రారంభమైంది. బాగా అభివృద్ధిపొందిన దేశాలన్నింటిలోనూ ప్రచారంలోవున్న ఒకానొక ఉత్పత్తి సాంకేతిక ప్రక్రియా విధానం మన దేశంలోని మార్కెట్‌లోకూడా తన ప్రభావాన్ని ప్రసరింపజేసింది. అదేమంటే, యంత్రాల అధికోత్పత్తికి స్పెషల్ పర్పస్ అండ్ ట్రాన్స్‌ఫర్ లైన్ మెషిన్ల వాడకం. ఇవి ప్రధానంగా ఆటోమొబైల్ పరిశ్రమలో అమల్లోకివచ్చింది. హెచ్. యం. టి. కూడా యీ మార్గాన్ని చేపట్టవలసివచ్చింది. ఒక ప్రఖ్యాత ఫ్రెంచి సంస్థ సహకారంతో బెంగుళూరులోని 2వ ఫ్యాక్టరీలో 1962-63 లో యీ యంత్రాల ఉత్పత్తి ప్రారంభమైంది.

రకరకాల యంత్ర పరికరాలకు, లోహ పరిశ్రమ యంత్రాలకు ఆనాటికానాడు బాగా పెరిగిపోతున్న గిరాకీని తట్టుకోడానికీ, తాను స్థాపించిన కొత్త ఫ్యాక్టరీలలో పూర్తి ఉత్పత్తి జరిపించడానికీ వీలుగా హెచ్. యం. టి. తన ఉత్పత్తి పరికరాలలో మరింత వైవిధ్యం సాధించడానికి పూనుకున్నది. 1963 లో ఒక బ్రిటిష్ సంస్థతో కలిసి గేర్ షేపింగ్ యంత్రాల ఉత్పత్తి ప్రారంభించింది. వీటి ఉత్పత్తి బెంగుళూరులో ప్రారంభించి చివరకు హైదరాబాదులోని 5 వ ఫ్యాక్టరీకి మార్చాలని ఉద్దేశం. అదే సంవత్సరంలో యీ ఫ్యాక్టరీ ఒక పశ్చిమ జెర్మనీ సంస్థతో ఒడంబడిక కుదుర్చుకుని ఆల్ ఎలెక్ట్రిక్ హెవీ డ్యూటీ ప్రోగ్రాం కంట్రోల్డ్ మిల్లింగ్ యంత్రాలను తయారు చేయడానికి పూనుకున్నది. ఇవి పింజోరీలోని 3 వ ఫ్యాక్టరీలో తయారవుతున్నవి. వీటితోపాటు బెంగుళూరుఫ్యాక్టరీల్లో తూర్పు జర్మనీ మోడల్ హెవీ డ్యూటీ సర్ఫేస్ గ్రౌండర్లు, జర్మన్ డిజైన్ గేర్ హాబ్బర్లు హైదరాబాదు ఫ్యాక్టరీలోనూ తయారు చేయబడుతవి. ఆయుధ కర్మాగారాలలో అవసరమైన సింగిల్ స్పిండిల్ [illegible] ఒక ఫ్రెంచి సంస్థతో ఒప్పందం కుదిరింది. బెంగుళూరులో పని జరుగుతున్నది.

సొంత డిజైన్లు

యంత్ర పరికరాల్లో అధునాతనమైన డిజైన్ల నిర్మాణానికి విదేశాల లైసెన్సులు సేకరిస్తున్నప్పటికీ, హెచ్. యం. టి. సొంతంగా డిజైన్లు తయారుచేసుకునే విభాగాన్ని ఏర్పాటుచేయాలని మొదటి నుండి ప్రయత్నంజరుగుతున్నది. యిప్పుడు యీ విభాగం సొంతంగా డిజైన్లు తయారుచేసుకోగలుగుతున్నది. హెవీడ్యూటీ టర్రెట్‌లాథే యంత్రాలు, అనేకరకాల సెంటర్ లాథేలు — ప్రస్తుతం మార్కెట్‌లోవున్నవి — హెచ్. యం. టి. సొంతంగా ప్రథమంగా నిర్మించుకున్న డిజైన్లే. ఇవికాక యింకా 5 రకాల యంత్ర పరికరాలు డిజైనులో వున్నవి. త్వరలోనే మార్కెట్‌లో విడుదలకానున్నవి.

యంత్రనిర్మాణంలో ప్రత్యేకత

ఈ విధంగా వైవిధ్యంగల ఉత్పత్తి కార్యక్రమం వల్ల ఆదిలో కొన్ని లాభాలు చేకూరినప్పటికీ, దీనినే వదలకుండా అనుసరించడం వల్ల, యీ విధానాన్ని అధికాధికంగా అమలుపరచడం వల్ల కొన్ని క్లిష్ట సాంకేతిక సమస్యలు ఉద్భవించినవి. అందువల్ల ఉత్పత్తి కార్యక్రమాన్నంతా ఏవికేంద్రీకరించి, ప్రతి ఫ్యాక్టరీ ఒకటి, రెండు

ముఖ్య మార్గంలో ప్రత్యేక కృషిజరుపుతూ మిగిలిన వాటిలో వైవిధ్యం ప్రదర్శిస్తూ వుండాలని నిశ్చయించబడింది. ఉత్పత్తి ఖర్చులు తగ్గడం, ఉత్పత్తి ప్రక్రియా సామర్థ్యం పెరగడం జరుగుతుంది.

నాలుగవ ప్రణాళిక చివరకు జనరల్ పర్పస్ ఆటోమేటిక్, సెమి-ఆటోమేటిక్, మెటల్ ఫార్మింగ్ యంత్రపరికరాల గిరాకీ సంవత్సరానికి రూ. 130 కోట్ల మేరకు వుంటుందని అంచనా. దీనిలో కనీసం 40 శాతమైన సప్లయి చేయాలనే వుద్దేశంతో, ఏడాది కొకటివంతున యీ 'ప్రణాళికా కాలంలో యింకా 5 ఫ్యాక్టరీలు నిర్మించాలని కంపెనీ ప్రభుత్వానికి ప్రతిపాదన చేసింది. ఈ 5 ఫ్యాక్టరీల నిర్మాణానికి అవసరమైన రూ. 20 కోట్ల పెట్టుబడి కంపెనీ లాభాల నుండే పెట్టడం జరుగుతుంది.

ఎగుమతులు

గత రెండేండ్ల కాలంలో అత్యవసర పరిస్థితి వల్లనూ, దేశరక్షణ అవసరాలకు ఉత్పత్తి జరిగినందుననూ ఎగుమతులు కొంతవరకు మందగించినవి. మళ్లీ ఎగుమతులను వృద్ధిపరచడానికి తగు ప్రయత్నం ప్రారంభమైంది. దేశంలో విదేశ ద్రవ్యం కొరతగావున్నందున, ముడిపదార్థాలు కొన్ని విడిభాగాల దిగుమతులకుగాను కంపెనీ విదేశీమారక ద్రవ్యం సంపాదించుకో వడం అవసరం. ఇంజనీరింగ్ ఎక్స్ పోర్టు ప్రొమోషన్ కౌన్సిల్ వారి సహాయం వల్లనూ, ఎక్జిక్యూటివ్ ఆఫీసర్ల పర్యటనల వల్లనూ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జపాన్, ఫిలిప్పీన్స్, అమెరికాలలో మార్కెట్ సర్వే జరపడం సాధ్యమైనది. దీనివల్ల హెచ్. యం. టి. తయారుచేసిన యంత్రాలను ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, అమెరికా దేశాలకు ఎగుమతి చేయడానికి మంచి అవకాశాలు వున్నవని తేలింది. స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ సహకారం వల్ల తూర్పు యూరపు దేశాలకు మన యంత్ర పరికరాలను ఎగుమతి చేసే కార్యక్రమం బాగా బలపడింది. ఇంకా మధ్య ప్రాచ్య దేశాలకు, ఆఫ్రికా, లాటిన్ అమెరికా, స్కాండి నేవియన్ దేశాలకు ఎగుమతులు జరపటానికి గల అవకాశాలు అన్వేషించ బడుతున్నవి.

ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, తూర్పు యూరప్ దేశాలలో విక్రయ శాలలు నెలకొల్పబడినవి. ఇంకా అమెరికా, పశ్చిమ జర్మనీ, ఇంగ్లండులలో డిస్ట్రిబ్యూటర్లను నియమించడానికి సంప్రదింపులు జరుగుతున్నవి. ఈ యేడు రూ. 21 లక్షల విలువ గల 86 యంత్రాలకు 'ఆర్డర్లు లభించినవి.

విదేశ మార్కెట్లలో గట్టి ప్రవేశం కలగాలంటే ఆరంభంలో మార్కెట్ సర్వేలు, ప్రకటనలు, షోరూములు, ప్రదర్శనల్లో పాల్గొనడం మొదలగు రూపాలలో విదేశీ మారక ద్రవ్యం ఖర్చు పెట్టుకోవలసి వుంటుంది. ఈ కంపెనీ తయారుచేసే యంత్రాలకు విదేశీ మార్కెట్ల సాధనకొరకు యీ సందర్భంలో, దీర్ఘకాలిక ప్రణాళిక తయారుచేసి భారత ప్రభుత్వానికి పంపడం జరిగింది. యిటీవల నేను 5 వారాలపాటు ఇంగ్లండు, యూరప్, అమెరికా దేశాలు పర్యటించిన సందర్భంలో, విదేశీ మార్కెట్ల పరిస్థితి చాలా ప్రోత్సాహకరంగా వున్నట్లు గమనించాను.


గడియారాల ఫ్యాక్టరీ

యంత్ర పరికరాలనుండి గడియారాల ఉత్పత్తి? అవును. హెచ్. యం. టి. లో నిపుణులైన పనివారు చాలమంది ఉండడం దేశంలో మొట్టమొదటి గడియారాల ఫ్యాక్టరీని స్థాపించే బాధ్యతను భారత ప్రభుత్వం యీ కంపెనీకి యిచ్చింది. ప్రభుత్వం గడియారాల ఉత్పత్తికై జపాన్‌కుచెందిన సిటిజన్ వాచ్ కంపెనీతో చేసుకున్న ఒడంబడిక లైసెన్సు హెచ్. యం. టి. కి మార్చడం జరిగింది. బెంగుళూరులోని యంత్రపరికరాల ఫ్యాక్టరీకి ప్రక్కగా గడియారాల ఫ్యాక్టరీ నిర్మాణం 1961 లో ప్రారంభమై 1962 అక్టోబరునాటికి ముగిసింది. 1963 ఏప్రియల్‌లో గడియారాల ఉత్పత్తి మొదలు పెట్టారు. వాటిలో 54 శాతం దేశీయసామగ్రి వినియోగించబడింది. 1963-64లో 1,20,000 గడియారాలు తయారుచేయబడినవి. ఇందులో మూడు రకాలు- స్టెయిన్‌లెస్‌స్టీల్ 'జనత', గోల్డ్ ప్లేటెడ్ "సిటిజన్ జెంట్స్", "సుజాతా లేడిస్" గడియారాలు. 1964 ప్రారంభంలో రేడియం డయల్‌తో మన సైనికుల కోసం "జవాన్" గడియారాలు తయారు చేయబడినవి.

హెచ్. యం. టి. గడియారాల ఫ్యాక్టరీలో 60 శాతం దేశీయ వస్తుసామగ్రి వినియోగించి రోజుకు 800 గడియారాల వంతున తయారయ్యే అభివృద్ధి జరిగింది. కాని విదేశీ మారక ద్రవ్యం కొరతవల్ల గడియారాల ఉత్పత్తిని తగ్గించడం తప్పని సరి అయింది. ఎగుమతుల కొరకు జరిగే కృషి ఫలించి, గడియారాల ఉత్పత్తి మళ్ళీ మామూలుస్థాయి అందుకోగలదనీ, ఫ్యాక్టరీ యింకా అభివృద్ధి పొందగలదని ఆశిస్తున్నాము.

ఆర్థిక ఫలితాలు :

సామర్థ్యం పెరగడం వల్లనూ, ఉత్పత్తి శక్తి హెచ్చినందువల్లనూ, గత 9 సంవత్సరాల కాలంలో కంపెనీ సాధించిన ఆర్థిక ఫలితాలు గణనీయమైనవిగా వున్నవి. 1964-65 లో, వరుసగా 5వ సంవత్సరం కూడా 10 శాతం డివిడెంట్ ప్రకటించారు. స్వయంగా ఆర్థికవనరులు సమకూర్చుకునే కార్యక్రమంలో యింతవరకు హెచ్. యం. టి. రూ. 7.93 కోట్ల ఖర్చుతో విస్తరణ పథకాలు అమలు పరిచింది. వాటాదార్లకు, అంటే భారత ప్రజలకు హెచ్. యం. టి. ద్వారా ముమ్మందు యింకా ఎక్కువ లాభాలు చేకూరగలవనడంలో సందేహం లేదు.



(సీరియల్)

పంచతంత్రము

నీలిమందు పాత్రలో పడిన నక్క కథ

ఒక వనములో "చండరవము" అను పేరుగల నక్క నివసించుచుండెను. అది ఒకసారి ఆకలిగొని నగరములో ప్రవేశించెను. అప్పుడు ఆ పట్టణములోని శునకములు దానిని చూచి మొరుగుచు వెంబడించి కరువజొచ్చెను. అప్పుడు ఆ నక్క ప్రాణభయముచేత సమీపమునందున్న రాజభవనము లోనికి ప్రవేశించెను. అచ్చట నీలిమందు రసము చేత నిండిన ఒక పెద్ద పాత్ర పుండెను. శునకముల దాడికి తట్టుకోలేక నక్క ఆ పాత్రలో పడెను. నీలి మందులో మునిగి అది బయటికి వచ్చుసరికి దాని రంగు నీలముగా మారెను. ఇంతలో శునకములు అది నక్క కాదనుకొని వెళ్లిపోయెను. అప్పుడు ఆ చండరవము అడవిలోనికి తప్పించుకొని పోయెను. అక్కడ నీల వర్ణముగల ఈ జంతువును చూసి సింహ, వ్యాఘ్రాదులైన ఇతర అడవి జంతువులన్నియు భయముచే పరుగెత్తెను. ఇది ఏ జంతువో, దీని పౌరుషమెట్టిదో మనకేమియు తెలియదు. దూరముగా పోవుదము- అని ఆ జంతువులు పోవుచు అనుకొనెను. భయపడిన ఆ జంతువులను చూసి చండరవము ఇట్లనెను "ఓ మృగములారా! ఏల మీరు నన్ను చూడగనే భయపడెదరు. బ్రహ్మదేవుడు నన్ను ఇప్పుడు స్వయముగా సృష్టించి ఇట్లు ఆజ్ఞాపించెను. 'మృగములకు రాజు లేడు. ఇప్పుడు నిన్ను మృగరాజ్యమునందు అభిషేకించుచున్నాను. నీకు "కకుద్రుమము" అను పేరు పెట్టితిని. నీవు భూ మండలములో మృగములను పాలించుము' అని అందు వల్ల నేను ఇచ్చటికి వచ్చితిని. ఇచ్చటి జంతువు లన్నియు నా ఛత్రచ్ఛాయలో ఉండవలెను."
—అని.

ఆ మాటవిని సింహ వ్యాఘ్రాది మృగములు "స్వామీ! చిత్తము" అని చెప్పుచు దానిని పరివేష్టించి యుండెను. ఆ కకుద్రుమము సింహమునకు అమాత్య పదవిని, పులికి తన శయ్యా పాలన పదవిని, ఖడ్గమృగమునకు తన తాంబూలపు పెట్టె అధికారమును, తోడేలుకు ద్వారపాలనాధికారమును ఇచ్చెను. అది తన బంధువులైన నక్కలతో సంభాషణలు కూడ వదిలెను. అన్ని నక్కలను మెడపట్టి బయటికి గెంటించెను. అది అట్లు రాజ్యము చేయుచుండగా సింహాదులు మృగములను చంపి తెచ్చి దాని ముందు పెట్టుచుండెను అది ఆ మాంసమును కడుపార తిని భుక్త శేషమును పరివారమునకు పంచి ఇచ్చుచుండెను. ఇట్లుండగా ఒకనాడు అది దూరముగా నక్కల కోలాహల ధ్వనిని వినెను. దానితో పులకలెత్తి ఆనందముతో అది బిగ్గరగా గొంతెత్తి అరచెను. ఆ ధ్వని వినిన ఇతర మృగములు ఇది నక్క అని తెలిసికొని తమ తెలివి తక్కువకు సిగ్గుపడి ఇట్లు పరస్పరము ప్రసంగించుకొనెను. "ఓయీ! యీ నక్క మనను మోసగించెను, దీనిని చంపుడు" ఆ మాటవిని నక్క పలాయనము చిత్తగించెను. ఆ మృగములు దానిని తరమి చంపెను. అని దమనకుడు చెప్పిన పై కథనువిని—

పింగళకుడు:-ఓయీ! దమనకా! సంజీవకుడు నా యెడల ద్రోహము తలపెట్టినాడనుటలో ప్రమాణమేమి? ఋజువు చేయగలవా?

దమ :—సరే స్వామి! ఋజువు పరచెదను. సంజీవకుడు రేపు తెల్లవారుసరికి పింగళకుని చంపెదనని నేడు నాతో చెప్పినాడు.

రేపు ఉదయము అతడు ఎఱ్ఱని కన్నులతో ముఖముతో పెదవులు అదరుచుండగా నలుదిక్కులు చూచుచు అనుచిత స్థానములో కూర్చుని క్రూర దృష్టితో మీపై వేచియుండును. అప్పుడతనిని చూచిన మీకే నామాట ఋజువగును. అప్పుడు మీకు తోచిన విధముగా అతనిని దండించుడు

అని చెప్పి దమనకుడు అక్కడినుండి



సంజీవకుని వద్దకు పోయి అతనికి నమస్కరించి కూర్చునెను. అతనిని జూచి సంజీవకుడిట్లనెను:-

సంజీవ :—(ఆదరముతో) మిత్రమా! స్వాగతము, చాల కాలమునకు కనపడితివి. క్షేమమా?

దమన :—సేవకజనులకు క్షేమమెక్కడిది?

సంజీవకుడు:-నీవిప్పుడేదో చెప్పదలచినట్లున్నది?

దమన:-రాజుల రహస్యమును మంత్రులు వెలిబుచ్చరాదు. అయినను నేను నీ

యందలి మిత్రభావము చేత రహస్యమును చెప్పితిని. నా మాట చేతనే నీవు రాజు గృహములో నమ్మకముగా ప్రవేశించితివి.

ఇప్పుడు పింగళకుడు నీ యెడల ద్రోహము తలపెట్టినాడు, 'రేపు తెల్లవార సంజీవకుని చంపి మృగకులమున కంతయు తృప్తి చేసెదను' అని నేడు నాతో రహస్యముగా ఈ మాట మూడవవాని చెవిలో పడకుండా చెప్పెను. ఆ మాటవిని నేను పింగళకునితో, "స్వామీ! ఇది యుక్తము కాదు. మిత్రద్రోహము చేయకూడదు" అని అంటిని. ఆ మాటకు పింగళకుడు కోపముతో ఇట్లనెను "దుష్ట బుద్ధీ! గడ్డితిను సంజీవకుడు మాంసము తిను మనకు శత్రువుకదా! కనుక అతనిని ఉపేక్షించ కూడదు'. పింగళకుని యీ నిర్ణయమును తెలిసికొని నేను నీవద్ద కిప్పుడు వచ్చితిని. ఈ రహస్యమును నీకు తెలిపితిని. నీ యిష్టము వచ్చినట్లు చేయుము.

సంజీవకుడు పిడుగువంటి యీ మాట విని మూర్ఛిల్లి కొంత సేపటికి తేరుకొని వైరాగ్యముతో ఇట్లు చెప్పెను.

సంజీవకుడు:—ఇతనిని నమ్మి మైత్రిచేయుట నాకు తగనిపని. ఇప్పుడింతకు వచ్చెను. అతనిని ప్రసన్నునిగా చేయ దలచినను ఇపుడు అతడు ప్రసన్నుడు కాడు. ఓర్పులేని వారెవరో అసూయ చేత పింగళకునకు నాపై కోపము తెప్పించి యుందురు.

దమనకు:- మిత్రమా! అట్లైనచో నీవు భయపడకుము. ఒకవేళ దుష్టులు అతనికి నీపై కోపము కలిగించినను నీమాటల నేర్పుచేత తిరిగి అతడు ప్రసన్నుడు కావచ్చును.

సంజీవకుడు:- ఓయీ నీమాట సరికాదు. అల్పులైనను దుర్జనుల మధ్య ఉండ కూడదు. ఏదో ఉపాయముచేత వారు చంపుటకు తప్పక ప్రయత్నించెదరు, ఇట్లే పూర్వము ఒకప్పుడు క్షుద్రములైన కాకులు మొదలైన జంతువులు ఒంటెను చంపినవి.

దమనకుడు:-ఆ కథయెట్లు? చెప్పుము.

సంజీవకుడా కథ చెప్పదొడగెను.

(సశేషము)

సహకార సేద్యం ద్వారా అధికోత్పత్తి

— డా. కరన్ సింగ్

> ప్రభుత్వం ప్రకటించిన విధానం ప్రకారం సహకారసేద్యం రైతుల ఐచ్ఛిక కృషితో అమలుజరుగవలసి వున్నది. ఇది మన ప్రజాస్వామ్య సూత్రాలకు అనుగుణంగా కూడా వున్నది.

వ్యవసాయోత్పత్తులను, ముఖ్యంగా ఆహారధాన్యాల ఉత్పత్తిని, అధికంచేయడం తక్షణ కర్తవ్యమనే విషయం అందరూ గుర్తించినదే. బహుకాలంగా దేశంలోవున్న కొరతను నివారించుకోడానికీ, పెరుగుతున్న జనాభా ఒత్తిడిని తట్టుకోడానికీ యిది తప్పనిసరి. మన వ్యవసాయోత్పత్తులను పెంచుకోవడం, సరుకులను సక్రమంగా, న్యాయంగా పంపిణీచేయడం, కోట్లాది మనరైతుల జీవన ప్రమాణాన్ని పెంచడం అనే బహుముఖ సమస్య నేడు మనకు కాలం చేసిన సవాలుగా మనం స్వీకరించి పనిచేయాలి. ఈ లక్ష్యసాధనకు ఉపకరించే సాధనాలలో సహకారోద్యమం ఒకటి.

సహకారసేద్యమనేది బహుక్లిష్టమైన సమస్య; వాదోపవాదాలకు తావిచ్చే సమస్య. చూడడానికి యీ ప్రతిపాదన చాలా ఆకర్షణీయంగా వుంటుంది. ఎందుకంటే దీనివల్ల రైతు తనకు గల కొద్దిపాటి వనరులను, వసతులను, యితరుల వనరులతో కలిపి. తద్వారా లోగడ తనఒక్కడికీ సాధ్యంకాని అభివృద్ధిని నలుగురితో కలిసి సాధించడానికి సహకారసేద్యం అవకాశం కల్పిస్తుంది. ఈ సమిష్టికృషివల్ల మేలురకం విధానాలను అనుసరించడానికీ, యాంత్రికపద్ధతులద్వారా వ్యవసాయం చేయడానికి వీలుకలుగుతుంది. కాని ప్రత్యక్షంగా యీ సూత్రాన్ని అమలుపరచడంలో చాలా యిబ్బందులను ఎదుర్కోవలసి వస్తుంది. అయితే అంతమాత్రాన యీ సిద్ధాంతాన్ని ప్రచారం చేయడానికిగానీ, అమలుపరచడానికిగానీ మనం వెనుకాడనవసరంలేదు. క్లిష్టమైనది కాబట్టి మనం యింకా ఎక్కువ జాగ్రత్తతో దీని పరిష్కారమార్గాలకోసం అన్వేషించాలి.

మార్పును అంగీకరించని రైతులు:

ఓం ప్రథమంగా మనం ఎదుర్కొనే సమస్య యీ సిద్ధాంతానికి మనరైతులను ఒప్పించడం, భూమియొక్క యాజమాన్యం రైతుకే వుంటుందని పదేపదే చెప్పడం జరుగుతున్నప్పటికీ రైతులలో సహజంగా వుండే, మార్పును సులువుగా అంగీకరించని స్వభావంవల్ల అతను వెనుకంజవేస్తాడు. భూమిపై తనకు వంశపారంపర్యంగా సంక్రమించిన హక్కులకు ఏమాత్రం భంగం కలిగినా అతన్ని ఒప్పించడం కష్టం. ఎందుకంటే అతనికి ఆ భూమే ఏకైక జీవనాధారం. ప్రభుత్వం ప్రకటించిన విధానం ప్రకారం సహకారసేద్యం రైతుల ఐచ్ఛికకృషితో అమలు జరుగవలసి వున్నది. ఇది మన ప్రజాస్వామ్య సూత్రాలకు అనుగుణంగా కూడా వుంది. రైతులకు మనం గట్టిగా నచ్చజెప్ప గలిగినప్పుడే యీ పథకం విజయవంతంగా అమలుజరుగుతుంది. రైతులలో ఒక వర్గంవారిని యీ పథకం అమలుపరచడానికి అంగీకరింపజేశామని అనుకుందాం. తరువాత ఎదుర్కొనే సమస్య సహకార సేద్య సంఘాన్ని నెలకొల్పుకునే క్లిష్టమైన పని. సంఘసభ్యులకు ఆయాపనులను కేటాయించి, వారా పనులను సక్రమంగా నిర్వహించేటట్లు చూడడం అనుకున్నంత సులభం కాదు. పైగా పండిన పంటను, అందరికీ సంతృప్తికరంగా న్యాయంగా పంపిణీ చేయడం కూడా చిక్కులతో కూడుకున్న సమస్యే. ఈపని సక్రమంగా జరగడానికి సహకార సంఘ వ్యవస్థ పటిష్ఠగా వుండాలి. రైతుల్లో దీనికి తగిన విజ్ఞానంవుండాలి. కాని యిదే ప్రస్తుతానికి లేదు. ఒకవైపు రాజకీయ పార్టీలవారు తమతమ అభిప్రాయాలను ప్రచారం చేసుకుంటూ వుంటారు. వారి అభిప్రాయాలు సహకార సేద్య విధానాన్ని బలపరచాలనే నియమంలేదు. అందువల్ల కూడా పరిస్థితి మరికొంత క్లిష్టమవుతుంది.

చిన్నచిన్న భూకమతాలను ఒకచోటచేర్చి సహకార సేద్యవిధానం అమలు పరచినందువల్ల గ్రామాల్లోని కొందరు ప్రజలకు పని దొరకని పరిస్థితికూడా ఏర్పడే ప్రమాదం వుంది. ఇప్పుడు వారికి సగంసగంగా పని దొరుకుతున్నది. అయితే పనిలేనివాళ్ల యితే, వారు సంఘంలో తిరుగబడే శక్తిగా తయారుకావచ్చు. ఈ సమస్యలన్నీ అలా వుంచుదాం. అన్నింటికంటే ముఖ్యమైన ప్రాథమికమైన సమస్య. యిప్పుడు ఆలోచిస్తున్న పద్ధతులలో అసలు సహకార సేద్యంవల్ల అధికోత్పత్తి జరుగుతుందాఅని. ఇప్పుడు రైతు తనబ్రతుకుతెరువుకు దాదాపు సరిపడిన సరుకును మాత్రమే ఉత్పత్తి చేసుకుంటూ వ్యవసాయం చేస్తున్నాడు. అటువంటి పరిస్థితుల్లో సహకారసేద్యం విఫలమయ్యే ప్రమాదాన్ని అతను భరించలేడు. దీనిని ప్రయోగంగాచేసి చూద్దామని సాహసించలేడు. అందులోనూ యీ విధానం ఒకసారి అపజయం పొందిందంటే మళ్ళీ రైతు దానివైపు కన్నెత్తి చూడనేచూడడు.

కొన్ని సూచనలు:

సహకార సమస్యలను పరిష్కరించుకోడానికి స్థూలంగా కొన్నిసూచనలు చేస్తాను.

1. దేశమంతటా బహుళార్థసాధక సేవా సహకారసంఘాలను పటిష్ఠంచేసి, వాటి కార్యక్రమాలను విస్తృతపరచాలి. ఇందులో భేదాభిప్రాయాలకు తావులేదు. సేవాసహకార సంఘాలవల్ల ప్రజలకు మేలుజరగడమే కాకుండా సంఘసభ్యులలో సహకారభావన ఏర్పడుతుంది. సహకార సేద్యవిధానం జయప్రదం కావాలంటే యీ భావన ఏర్పడడం చాలాముఖ్యం.

2. ప్రణాళికా కార్యక్రమంద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పరపతి సౌకర్యాలను విరివిగా పెంచాలి. గ్రామీణులందరికీ గల పరపతి అవసరాలను తీర్చే విధంగా ఆ సౌకర్యాలను విస్తృతపరచాలి. గత కొలది సంవత్సరాల కాలంలో యిందుకోసం చాలా కృషి జరిగినప్పటికీ, మొత్తం అవసరాల్లో కొద్దిభాగాన్ని మాత్రమే మనపరపతి సంఘాలు తీర్చగలుగుతున్నవి.

3. సహకార సేద్యాన్ని గురించి విజ్ఞాన ప్రచారమూ, దానివల్లకలిగే సత్ఫలితాల ప్రదర్శన భారీయెత్తున జరగాలి. అందువల్ల యీ విధానం అనుసరించడం మూలంగా ప్రజలకు ఏ ఏ లాభాలు చేకూరుతాయో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు చక్కగా తెలుస్తుంది. సిద్ధాంత రూపంగా యీ విజ్ఞానాన్ని ప్రచారం చేయడమేకాక ప్రస్తుతం అమల్లోవున్న వ్యక్తి కమతాల పద్ధతికంటే సహకార సేద్యం లాభదాయకమని ప్రదర్శనాత్మకంగా రైతులకు అర్థమయ్యేట్లు చేసి చూపడం అవసరం. ఇప్పటి పద్ధతిలో చెదురు చెదురుగావున్న భూకమతాలవల్ల లాభదాయకమైన వ్యవసాయం జరుగదని వారికి నచ్చజెప్పాలి. సహకార సేద్యాన్ని గురించిన ఆదర్శాల, సిద్ధాంతాల విషయం ఎలావున్నా, అది ఎంతవరకు వ్యవసాయోత్పత్తులను పెంచగలుగుతుంది, ఎంతవరకు రైతుల జీవన ప్రమాణాలను పెంచగలుగుతుంది అనే దానిమీదనే దాని విజయం ఆధారపడివుంటుంది. సాధ్యమైనంత భారీ ప్రమాణంలో దేశమంతటా పైలట్ ప్రాజెక్టులను అమలు పరచడం మంచిది. దీనివల్ల సహకారసేద్య నిర్వహణలో అధికార, అనధికార ప్రముఖులకు ప్రత్యక్షమైన తర్ఫీతు యివ్వడానికి వీలుగలుగుతుంది. కేవల సిద్ధాంత జ్ఞానంకంటే యిది వేయిరెట్లు మేలు. క్రొత్తగా సాగులోకి తేబడిన భూములు, కాందిశీకుల భూములు ప్రభుత్వ భూముల్లో యీ ప్రయోగాన్ని చేసి చూపడానికి మంచి అవకాశం వుంటుంది. ఎందుకంటే ఆ భూములకు వ్యక్తి యాజమాన్య హక్కులబాధ వుండదు. అదే సమయంలో గ్రామాల్లోని కొందరు రైతులను కూడా సహకారసేద్య విధానానికి పురికొల్పగలిగితే మరీమంచిది. ఈ పద్ధతివల్ల తగినంత లాభం చేకూరుతుందనే విషయం గ్రహింపబడితే, రైతుల్లో యిది బహుళ ప్రచారం పొందుతుందనడంలో సందేహమేమీవుండదు. ఉదాహరణకు రసాయనిక ఎరువులవాడకాన్ని తీసుకుందాం. వాటిని కొత్తగా ప్రవేశపెట్టిన రోజుల్లో, వాటి ఉపయోగాన్నిగురించి చాలా అనుమానాలు వుండేవి. మన రైతులు వాటిని వినియోగించడానికి వెనుకాడుతుండేవారు. కాని రసాయినిక ఎరువులు వాడిన చేలలో పంట అధికంగా పండుతున్నదని వారు గ్రహించిన వెంటనే, రైతులు ముందుకువచ్చి ఎరువులు వాడడం ప్రారంభించారు. ఈ నాడు యీ ఎరువులకువున్న గిరాకీని తట్టుకోవడం అసాధ్యంగా తయారైంది. అదేవిధంగా, సహకారసేద్యం విషయంలోకూడా, సిద్ధాంత ప్రచారం ఎంతజరిగినా అంతగా ప్రయోజనం వుండదు. కండ్లతో దాని ఫలితాలుచూస్తేనే వారు దానిని ఆచరణలో పెడతారు.

4. మన గ్రామీణ ప్రజలకు వేరే వృత్తి పనులు చూపేందుకు, ముఖ్యంగా సహకార సేద్యం అమలుపరచే సందర్భాలలో, భూమిమీదగల ఒత్తిడిని తగ్గించడానికై గ్రామీణ పరిశ్రమల కార్యక్రమాలను విరివిగా చేపట్టడం అవసరం. వీటినికూడా వీలైన సహకార సిద్ధాంతాల మీదనే నడపుకోవచ్చు. అయితే విద్యుచ్ఛక్తి గ్రామాలకు విస్తరించబడినపుడే యిది బాగా సులభమవుతుంది. అంతేకాక గ్రామసీమల్లో మానవశక్తి సంపదను దేశహిత నిర్మాణకార్యక్రమాలకు ఉపయోగించుకునే అవకాశాలను సమగ్రంగా ఉపయోగించుకోవాలి. గ్రామస్థులను కేవలం ఉచితంగా శ్రమదానం చేయమనడం ఆచరణరీత్యా జరిగేపనిగా కనిపించడంలేదు. ఫలహారాల రూపంలోనో, వినోదకార్యక్రమాల రూపంలోనో వారికి ఏదైనా ప్రోత్సాహం కల్పిస్తే, వారు తప్పకుండా ముందుకు వస్తారు. సహకార సూత్రాలద్వారా జాతీయ ఆర్థికవ్యవస్థను మెరుగు పరచుకునే కృషిలో వారి సహకారం మనకు పూర్తిగా లభిస్తుంది.

మరొక విషయం మనవిచేయవలసి వుంది. ఈ వ్యాస విషయంతో దానికంత సంబంధంలేక పోయినా, దానిని నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరం. ఏమంటే-మన జనాభా విపరీతంగా పెరుగుతున్నందువల్ల, మనం సాధించిన ఆర్థికాభివృద్ధి ఫలితాలు స్పష్టంగా కనిపించడానికి వీలులేని పరిస్థితి ఏర్పడింది. మూడు ప్రణాళికల కాలంలో సాధించిన అభివృద్ధికి యిదే పరిస్థితికలిగింది. ఈ జనాభా పెరుగుదల, దేశానికి రానురాను ప్రమాదంగా, అరిష్టంగా తయారవుతున్నది. అయితే జనాభానిరోధక సహకార సంఘాలు ఏర్పరచమని నేను సలహా యివ్వడంలేదు. కాని విస్తృతంగా పనిచేస్తున్న మన సమాజ వికాస, సహకారోద్యమ శాఖలద్వారా, గ్రామీణ ప్రాంతాల ప్రజల్లో, జనాభాను అరికట్టవలసిన ఆవశ్యకతనుగురించి ప్రచారం చేసి, వారు యీ ప్రమాదాన్ని గుర్తించేట్లు చేయడం చాలా అవసరం. ఈ సమస్య పరిష్కారం కావాలంటే యీ విజ్ఞానప్రచారం భారీయెత్తున చేయడం ప్రథమ కర్తవ్యం. రెండవది-సంతాననిరోధానికి తప్పక పనిచేసే మందు. నోటిద్వారా సేవించడానికి వీలైన మార్గంలో తయారుచేసి పంపిణీచేయడం. ఇటువంటి మందు యిప్పుడు తయారైంది. కాలక్రమేణా యిది సర్వప్రజల్లో విరివిగా ప్రచారమై వినియోగించబడుతుందని భావిస్తున్నాను.

———

ముఖ్యవార్తలు

రాష్ట్రంలో

ఏప్రెల్ 18—పదిహేను రోజులపాటు కొనసాగే రేడియో ప్రసారాల పునశ్చరణ శిక్షణ తరగతులు రాజేంద్రనగర్ ప్రారంభించబడ్డాయి.

ఏప్రెల్ 19—రోడ్డు రవాణా సంస్థ ప్రాంతీయ వర్కుషాపు భవనానికి విజయవాడలో ముఖ్య మంత్రి ప్రారంభోత్సవం జరిపారు.

1966 సం. పు ఆంధ్ర ప్రదేశ్ నీటి పారుదల (నీటిమార్గాల నిర్మాణ, నిర్వహణ) చట్టాన్ని సవరించడానికి గవర్నరు సమ్మతిని తెలియజేశారు.

ఏప్రెల్ 21—జాతీయ వై.యం.సి.ఎ. ల పరిషత్తు 20 వ త్రై వార్షిక సమ్మేళనానికి హైదరాబాదులో గవర్నరు ప్రారంభోత్సవం చేశారు.

ఏప్రెల్ 23—నాగార్జున కొండపై పురావస్తు ప్రదర్శనశాలకు కేంద్ర విద్యా మంత్రి ప్రారంభోత్సవం జరిపారు.

మే 10 — ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సహకార సమితికి గవర్నరు హైదరాబాదులో ప్రారంభోత్సవం జరిపారు.

భరత దేశంలో

ఏప్రెల్ 16— అఖిల భారత వార్తా పత్రికల సంపాదకుల 18వ సమావేశం పచ్మర్హిలో ప్రారంభించ బడింది. ప్రసిద్ధి చిత్ర కారుడు శ్రీ నందలాల్ బోస్ శాంతినికేతనంలో పరమ పదించారు.

ఏప్రెల్ 17—అఖిల భారత ఆదిమజాతి సేవక సమాజం ఎనిమిదవ సమావేశానికి ప్రధాన మంత్రి రికబ్డియోలో ప్రారంభోత్సవం జరిపారు.

ఏప్రెల్ 21—న్యాయ మూర్తి శ్రీ పి. సత్యనారాయణ రాజు క్రొత్త ఢిల్లీలో పరమపదించారు.

ఏప్రెల్ 28—సబ్స్టిట్యూట్ ఫెర్రస్, నాన్ ఫెర్రస్ ఎల్లాయ్స్‌కు సంబంధించిన పదార్థాలపై నాలుగు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సదస్సు జమ్‌షెడ్‌పూర్‌లో ప్రారంభమైంది.

ఏప్రెల్ 29 — 1966—67 సంవత్సరానికి పన్నుల ప్రతిపాదనలో మార్పుల్ని, రాయతీలనూ లోకసభలో ఆర్థిక మంత్రి ప్రకటించారు.

మే 5 — పార్లమెంటులో స్వర్గీయ జవహర్లాల్ నెహ్రూ చిత్ర పటాన్ని రాష్ట్రపతి ఆవిష్కరించారు.

మే 6 — పూనాలో శ్రీ రఘునాథ పురుషోత్తం పరంజపేయ స్వర్గస్థులయ్యారు.

జోషినాథ్ నుండి బదరీనాథ్ వరకు క్రొత్తగా రాకపోకల నిమిత్తం వేసిన 27 మైళ్ళ రోడ్డుకు కేంద్ర రక్షణ మంత్రి ప్రారంభోత్సవం జరిపారు.

మే 9 — గోపాలకృష్ణ గోఖలే శత జయంత్యుత్సవాలకు పూనాలో రాష్ట్రపతి ప్రారంభోత్సవం జరిపారు.


విదేశాలలో


ఏప్రెల్ 14—బస్రావద్ద సంభవించిన హెలికాప్టర్ ప్రమాదంలో ఇరాక్ అధ్యక్షుడు ఫీల్ మార్షల్ అబ్దుల్ సలాం అరిఫ్ మరణించారు.

ఏప్రెల్ 17—ఇరాక్ అధ్యక్షుడుగా మేజర్ జనరల్ అబ్దుల్ రహమన్ అరిఫ్ ఎన్నికయ్యారు.

మే 9 —పీపుల్స్ చైనా తన మూడవ అణుపాటవ పరీక్ష జరిపింది.

EDITED AND PUBLISHED BY THE DIRECTOR OF INFORMATION AND PUBLIC RELATIONS, ANDHRA PRADESH, HYDERABAD AND PRINTED BY THE DIRECTOR OF PRINTING, GOVERNMENT OF ANDHRA PRADESH, AT THE GOVERNMENT CENTRAL PRESS, HYDERABAD-24




Regd. No. H. 133